
# వేదవ్యాసుడు

(పౌరాణిక నాటకం)



బోయి భీమన్న

| | | |
|---|---|---|
| ప్రథమ ముద్రణ | : | సెప్టెంబర్, 2000 |
| కాపీలు | : | 1000 |
| హక్కులు | : | రచయితవి |
| వెల | : | 75 |

ముఖచిత్రం
రవిచంద్ర పొన్నాడ

లేజర్ టైప్ సెట్టింగ్
కార్తీక్ గ్రాఫిక్స్, కూకట్‌పల్లి, హైదరాబాద్

ముద్రణ
డిజైన్స్ మీడియా
కూకట్‌పల్లి, హైదరాబాద్
మొబైల్: 9849064928

ప్రతులకు
భీమన్న సాహితీ నిధి
ఐ.సి. 85, ఇర్రంమంజిల్ కాలనీ
హైదరాబాద్

# కృతి సమర్పణ
## శ్రీమతి ప్రతిభా భారతి గారికి

పూర్ణ రవిచంద్ర లీలా విలాసం నుంచి
నవోదయ సుప్రభాతంగా ఉదయించి
విద్యా వినయ సంపత్తితో విద్యార్థి నాయకురాలై
విశ్వ జన రంజక రశ్మితో వికసించి

ఎడ తెరిపి లేకుండా ఎచ్చెర్ల నుంచి
ఆంధ్ర అసెంబ్లీకి ఎన్నుకోబడుతూ
మాన్యమంత్రిగా మానవసేవకు లక్ష్యతారయై
భారతీయ ప్రతిభకు నాగావళీ వంశధారయై

ప్రస్తుతం ఆంధ్ర అసెంబ్లీ అధ్యక్ష పీఠంపై
స్పీకరుగా లోకమాన్య అవుతున్న
వ్యాస గీతా వరప్రసాద సుప్రభాత హారతికి !
శ్రీమతి కావలి ప్రతిభా భారతికి !

ప్రతిభా భారతి భారత
ప్రతిభకు సమ్యక్ ప్రతినిధి; ప్రభుతకు ఆద్య
శ్రుతి ! ఏ తత్ ప్రాజ్ఞత కీ
కృతి తగునని ఇచ్చుచుంటి కేల్మోడ్పులతో !

కవితా కుసుమాంజలితో

–భీమన్న

# జ్ఞానం నుంచి జన్మకు

## (వేదవ్యాసుడు నాటకానికి పీఠిక)

అచతు ర్వదనో బ్రహ్మా
ద్వి బాహు రవరో హరిః
అ ఫాలలోచనః శంభుః
సాయాత్ త్రైః బాదరాయణః

చాలా కాలం క్రితం నేను చదివిన శ్లోకం ఇది. ఎవరు వ్రాశారో నాకు తెలియదు. వేదవ్యాసుణ్ణి గురించి ఇంతకంటే గొప్పగా మరెవరూ చెప్పలేరనటం మాత్రం స్పష్టం.

వేదవ్యాసుడు ఎటువంటివాడు ?

సాక్షాత్తు బ్రహ్మ. అయితే నాలుగు ముఖాలు లేవు, ఒకటే ముఖం. ఒకే ముఖం కల బ్రహ్మ.

సాక్షాత్తు విష్ణువు. రెండు చేతులు మాత్రమే కల విష్ణువు.

సాక్షాత్తు శివుడు. నుదుట మూడవ కన్ను లేని శివుడు.

వేదవ్యాసుడు త్రిమూర్తులు ముగ్గురూ కలిసిన ఏకైక మూర్తి. అంతటి శక్తిమంతుడు, ధీమంతుడు, సమగ్ర విశ్వ విజ్ఞాన తేజస్వి.

ఇంతటి వేదవ్యాసుడు బ్రాహ్మీమూర్తి మా పూర్వికు డంటూ, నేను ఆయన వారసు ణ్ణంటూ, గర్వపడుతున్నా నంటే నే నెంత అదృష్టవంతుడిని !

ఇంతకూ ఈ వేదవ్యాసుడు ఎవరు ? ఎక్కడ పుట్టాడు ? నాకు పూర్వీకుడెలా అయ్యాడు? ఈ ప్రశ్నలకు జవాబుల కోసం పరిశోధనలు చేస్తూనే వున్నాను. ఫలితాలను వెల్లడిస్తూనే వున్నాను. ఆయన జీవితంలోని కొన్ని సామాన్య జీవిత ఘట్టాలను తీసుకొని ఈ నాటకాన్ని అల్లాను. నేను చేసిన ఈ పని అన్ని విధాలా సవ్యమే. అందుకే చేశాను మరి. ఈ యుగంలో ఆయన వారసుణ్ణి కదా !

ధర్మ వ్యాధుడు, వేద వ్యాసుడు అంటూ నేను చాలా కాలం క్రితమే రెండు నాటకాలు వ్రాశాను. ఇవి రెండూ జంట నాటకాలు. ఎప్పుడో వ్రాసిన వీటిని కొంచెం పరిష్కరించి ముద్రించా లనుకొన్నాను. ఒకేసారి ముద్రించబడవలసి నట్టివి. ఆర్థికంగా పేదవాడ్ని కదా ! రెండు గ్రంథాలను ఒకేసారి ముద్రించటం సాధ్యం కాలేదు. నా కున్నదంతా ధర్మవ్యాధుడు ప్రింటింగుకే సరిపోయింది. అది గత సంవత్సరం (1999) మాట.

ఇపుడు, ఈ 2000వ సంవత్సరంలో ఈ 'వేదవ్యాసుడి'ని ముద్రిస్తున్నాను, పెద్దగా పరిష్కరించకుండానే.

'వేదవ్యాసుడు' గురించి ఎప్పుడు ఎవరు వ్రాసినా, అందులో పెద్దగా మార్పులేమీ వుండవు. దృక్కోణంలో మార్పు లుండవచ్చు. ఆయన జీవితంలో మార్పులు చేయడం సాధ్యం కాదు. అది అందరికీ తెలిసినదే ! ఎవరు ఏ దృక్కోణంతో చూసినా అదంతే. ఈ పీఠికలో నేను చెపుతున్నది మాత్రం పూర్తిగా వాస్తవ దర్శనం, వినూత్న దర్శనం, విశిష్ట దర్శనం. నాటకీకరించడంలో మాత్రం చిన్న చిన్న మార్పులు తప్పనిసరి కదా!

నేను చాల చిన్నప్పుడే, చిన్న క్లాసులు చదువుతున్నప్పుడే మహాభారతం చదివాను. కవిత్రయం వారి పద్దెనిమిది పర్వాలూ వరుసపెట్టి చదివేశాను. అప్పుడు వాటిని 'చేట భారతాలు' అనేవారు. వాటి సైజులు చాట లంతేసి వుండేవి. అందుకాపేరు. నిజానికి నేను చదివిన మొదటి పుస్తకమే మహాభారతం. దానిని సంస్కృతంలో 'వ్యాసుడు' వ్రాశాడని తెలిసినపుడు, అతడెవరో కనుక్కోవాలనే ఆలోచన కలిగి పరిశోధన మొదలు పెట్టాను. అతడు 'అరుంధతి'కి ముని మనవడు అని తెలిసినపుడు నా ఆనందానికి అవధులే లేకపోయాయి. ఎందుకంటే, అరుంధతి మా 'ఇంటి ఆడపడుచు' కదా !

నేను పుట్టి బుద్ధెరిగి నప్పట్నుంచీ, అరుంధతి మా కులానికి చెందినదే అనే సత్యం నాకు తెలుసు. మా వాళ్ళంతా అదే చెప్పారు. లోక మంతటికి తెలిసిన పౌరాణిక సత్యమే అది. ఈ విషయాలన్నీ నా సాహిత్యం నిండా నేను వ్రాస్తూనే వచ్చాను, ఇంకా యింకా పరిశోధిస్తూనే వస్తున్నాను. ఇపుడీ గ్రంథం వేదవ్యాసుణ్ణి గురించిన చరిత్ర కాబట్టి ఇపుడు మళ్ళీ అదే చెపుతున్నాను. చెప్పిందే చెపుతున్నానని నన్ను నిందించకండి. సృష్టిలో ప్రతి విషయమూ ఇలానే నడుస్తూంది మరి ! జరిగిందే జరుగుతూ వుంది. అదే మళ్ళీ మళ్ళీ జరుగుతూ వుంది. అంతా పునరుక్తి, చర్విత చరణం !

## మూడే వర్ణాలు! నాలుగోది సేవక వర్గం

"ఆర్యా త్రై వర్ణికా" అనేది వేదోక్తి ! అంటే ఆర్యులు ఈ భారత దేశానికి వచ్చినపుడు మూడు వర్ణాలుగా వచ్చారట ! ఆర్యులు ఒకే జాతి వాళ్ళయితే వాళ్ళందరూ ఒకే రంగులో వుండాలి కదా ! కాగా, వర్ణం అంటే రంగు కాదన్నమాట. వర్ణం అంటే వృత్తి. విద్య, రక్షణ, వ్యాపారం – ఈ మూడు ఏ జాతి మనుగడకయినా ముఖ్యమైనవే ! ఈ మూడు వృత్తులలోను స్థిరపడ్డ వర్గాలకు సహాయకులు, సేవకులు అవసరం కనుక అందుకు దేశీయులను వాడుకొన్నారు. నిజానికి ఈ నాలుగోది వర్గం, బానిస వర్గం. స్వజాతీయ బంధితులు కూడా ఈ బానిస వర్గంలో చేరవచ్చు.

బ్రాహ్మణః క్షత్రియః వైశ్యః
త్రయో వర్ణా ద్విజాతయః
చతుర్ధ ఏకజాతిస్తు శూద్రోః
నాస్తితు పంచమః

అన్నాడు మనువు అందుకే. అంటే అంతకుముందు నుంచీ దేశీయులుగా వుంటున్న వారినే జయించి తమ వర్ణ వ్యవస్థలో శూద్ర వర్ణంగా కలుపుకొన్న ఆర్యులు సాంఘికంగా ఒక నిబంధనను చేసుకొన్నా రన్నమాట. దేశీయులందరూ ఒకే వర్ణం – సేవకులు. ఆర్య వర్ణ వ్యవస్థ ఈ నాలుగు వర్గాలుగా వుంటే చాలనుకొన్నారు. అందుకే ఐదవ వర్ణం లేదని ఖచ్చితంగా చెప్పేశారు.

ఆర్యులు వచ్చేనాటికి ఈ దేశంలో స్థిరపడివున్న ప్రజ లెవరు ? వాళ్ళు కూడా ఆర్యుల కంటె ముందు ఈ దేశానికి వచ్చిన ఆర్య జాతుల వాళ్ళే ! ఈ చరిత్ర అంతా నేను 'రాగ వాశిష్టం' (అరుంధతీ కళ్యాణం) నాటకంలో, ముఖ్యంగా దాని పీఠికలో వివరించి వున్నాను.

నిజానికి పంచముల ఆది మూలం గురించి నా గ్రంథాలలో అవకాశం కలిగినప్పుడల్లా పేర్కొంటూ వచ్చాను. అంత చేసినా,ఆ గ్రంథాలేవి చదవకుండా, కనీసం మంగిపూడి వెంకట శర్మగారి 'నిరుద్ధ భారతం' గ్రంథాన్నయినా చూడకుండా, ఎందరో

నన్ను ఈ దళితుల రూట్సు గురించి అడుగుతూనే వున్నారు. నేను చెపుతూనే వున్నాను, మళ్ళీ మళ్ళీ వ్రాస్తూనే వున్నాను. ఎవరూ చైతన్యవంతులు మాత్రం కావడం లేదు.

'ఆధునిక విజ్ఞానం గురించి, అందులో పాశ్చాత్యుల ముందంజ గురించి అందరూ చెప్పుకుంటూ వుంటే, ఒక బామ్మగారు అన్నారట – 'దాందే ముందీ ? అన్నీ మన వేదాల్లోనే వున్నాయిషగా !'' అని. అదే ధోరణిలో నేనంటున్నాను, ''ఈ పంచముల చరిత్రంతా నా గ్రంథాలలో వుంది, చదవండి'' అని.

## వ్యాసుడి పుట్టుక

ఈ నాటకంలో మొదటి దృశ్యం వ్యాసుడి పుట్టుకకు సంబంధించినది.

''జాతో వ్యాసస్తు కైవర్త్యా'' అంటూ వ్యాసుడు ఒక బెస్తపిల్లకు పుట్టినవాడుగా మహాభారతంలో చెప్పబడింది. ''శ్వపాక్యాస్తు పరాశరంః'' అని కూడా అక్కడే చెప్పబడింది. పరాశరుడు ఒక మాల మాదిగ పిల్లకు పుట్టాడు అని.

ఈ వాస్తవాన్నే కాబోలు మంగిపూడి వెంకటశర్మ గారు ఒక పద్యంలో చెప్పారు.

వ్యాసముని చంద్రు గన్న పరాశరుండు
మాల దానికి పుట్టి బ్రహ్మర్షి అయ్యె;
వేశ్యకును పుట్టి, మాలెత బెండ్లియాడి
ఆ వశిష్ఠ మహర్షి బ్రహ్మర్షి అయ్యె.

ఇదే విషయాన్ని వెల్లడించే వేమన పద్యం కూడా ఒకటుంది, ఎంత మంది వ్రాసినా వాస్తవం మాత్రం ఒకటే. అరుంధతీ, అదృశ్యంతీ, శక్తిమునీ, పరాశరుడు, వేదవ్యాసుడు – ఈ అందరూ ఒకే కుటుంబం వాళ్ళనీ వెలివేయబడ్డ మతంగుల సంగం వాళ్ళనీ, పంచములనీ, మాల మాదిగ లనీ.

వీళ్ళను మాల మాదిగ లనడం తెలుగు భాషలో మాత్రమే. ఇతర భాషల వాళ్ళకు ఈ మాటలు అర్థం కావు. వేరు వేరు భాషల్లో వేరే వేరే పేర్లతో వీళ్ళు పిలవబడతారు. మొత్తం దేశ మంతటా తెలిసే పేర్లు సంస్కృత భాషలో వున్నట్టివి. శ్వపచ, శ్వపాక శబ్దాలు ఆహారానికి సంబంధించినవి. చైనా వంటి తూర్పు దేశాలలో అందరూ శ్వపచులే. మాంసాహార మన్నపుడు ఏ మాంసం అయినా ఒకటే ! జీవ హింస అన్నపుడు,

హింసించబడేది ఏ జీవి అయితే మాత్రమేమిటి ? కార్మికులను హింసపెట్టే యజమానులు కూడా జీవహింసకులే కదా !

మాల మాదిగ అనేవి అవర్ణ వర్గాలకు తెలుగు పేర్లు మాత్రమే. దేశమంతటికీ తెలిసిన సంస్కృత నామాలలో ప్రధానమైనట్టివి 'చండాల', 'వాల్మీకి' అనేవి. ఇప్పటికీ బెంగాలీ భాషలో చండాల శబ్దమే వాడుకలో వుంది. చండాలుడు అంటే చండ గుణం కలవాడు, కోపం కలవాడు. తీక్షణంగా స్పందించేవాడు. ఈ గుణాలు కలవాడిని చండాలుడు అన్నారు. మొట్టమొదటి చండాలుడు మతంగుడు.

ఈ మతంగుడు ఎవరు ? ఇతని పుట్టుక ఎలాంటిది ?

## ప్రథమ చండాలుడు

''చండాలస్తు జనితో బ్రాహ్మణ్యాం వృషలేన'' అని అమరకోశం అనే నిఘంటువు అర్థం చెపుతుంది. ఒక బ్రాహ్మణ వర్గం స్త్రీకి శూద్ర వర్గం పురుషుడి వల్ల పుట్టినవాడు అని ఆ మాటకు అర్థం, అంటే వర్ణ సంకరుడు అన్నమాట.

జ్ఞాన ప్రధానమైన వేద సమాజం శిథిలమైపోయి, జన్మ సంబంధమైన కుల వ్యవస్థ ఏర్పడుతున్న కొత్తలో సంఘటన కావచ్చు ఇది. చదువుకున్న వాళ్ళను బ్రాహ్మణులు అంటున్నారు. బ్రహ్మ విద్య అనేదే విద్యకు పరాకాష్ఠ కదా ! బ్రహ్మ విద్య తెలిసిన వాళ్ళు బ్రాహ్మలు. బ్రహ్మ విద్య అంటే ఈ నాటి డాక్టరేటు లాంటి దన్నమాట !

సమస్త సృష్టికి, చరాచర వర్గానికి, స్థావర జంగమాద్ధులన్నిటికీ, మూలాధారం ఒక శక్తి, ప్రాణశక్తి. పంచభూతాల సమ్మేళనంతో ఏర్పడిన శక్తి అది. దానిని 'బ్రహ్మము' అన్నారు. దీనికే బ్రహ్మ, పరబ్రహ్మ, పరమాత్మ, శక్తి, విశ్వశక్తి, ప్రకృతి పురుష శక్తి, తత్ సత్, ఆనంద మొదలైనవి పర్యాయ పదాలుగా వాడబడుతున్నాయి.

అలాంటి బ్రహ్మను తెలుసుకున్నవాడు బ్రాహ్మడు. ఈ తెలుసుకోవడమే జ్ఞానం. జ్ఞాన ప్రధానంగా ఏర్పడినట్టిది ఆదిలో వేద సమాజం. అటువంటి సమాజానికి అట్టి జ్ఞానం గల బ్రాహ్మడే అగ్రగామిగా, మార్గదర్శిగా వుంటాడు.

సమాజాన్ని శత్రు శక్తుల నుంచి కాపాడటానికి ధైర్య సాహసాలు కల బలమైన ఒక వర్గం వుంటుంది. అట్టి వాళ్ళకు క్షాత్రం ప్రధానం. అందుకే వాళ్ళను క్షత్రియు లన్నారు. సామాజిక దైనందిన వ్యవహారాలు నడిపే సామాన్య జనాన్ని వైశ్యులు అన్నారు. వైశ్యులు

అంటే విశ్వ నిర్వాహకులు. మొత్తం మీద ఈ అందరికీ సహాయ పడే పరిజనాన్ని, సేవకులను, భృత్యులను, చెప్పినపని తప్ప మరే పని చెయ్యగల నేర్పులేని పని వాళ్ళను మొత్తంగా 'శూద్రులు' అన్నారు.

ముఖ్యమైన వృత్తులను పై మూడు వర్గాలు చేపట్టడం వలన, ఈ శూద్రులు ఏ వృత్తి లేని వాళ్ళు. కేవలం పై వాళ్ళను సేవించడమే వీళ్ళకు వృత్తి అయింది.

ఈ వివరాలన్నీ ఇదివరకే చాలా చోట్ల చెప్పాను. ఇక్కడ మళ్ళీ చెపుతున్నాను. సంప్రదాయాన్ని వదిలేసి, ఇతర జాతులతో సంబంధాలు ఏర్పడి, ప్రపంచ మానవులంతా ఒకే జాతిగా బ్రతకడం జరుగుతున్న ఈ కాలంలో, గతానికి సంబంధించిన ఆచారాలు వదలకుండా పట్టుకొని వెనక్కులాగుతూ గందరగోళం పడుతున్న నవతరం వాళ్ళ కోసం ఇదంతా మళ్ళీ చెపుతున్నాను.

వేద సమాజంలో వృత్తి విభజనే తప్ప, జాతి విభజన లేదు. ఇక్కడ జాతి అంటే 'జన్మ' అని అర్థం. ఎక్కడ జన్మించిన వాడయినా, ఎలా పుట్టిన వాడయినా బ్రహ్మజ్ఞాని అయిన వాడు బ్రాహ్మడే. ధైర్యసాహసాలు కలవాడు క్షత్రియుడు. ఏ పని స్వయంగా చేసుకోలేని వాడు శూద్రుడు. ఆ కాలంలో జన్మకు ప్రాధాన్యం లేదు, మానసిక స్థాయికి మాత్రమే ప్రాధాన్యం వుండేది.

అందుకే అడవిలో వేటాడుతూ, దోపిడీలు చేస్తూ బ్రతికిన గిరిజనుడు వాల్మీకి అయినాడు. పట్టపగలు ఒక బెస్త పిల్లకు పుట్టిన ద్వైపాయనుడు వేదవ్యాసుడు అయినాడు. ఆ కాలంలో వర్ణాలు (వృత్తులు) వున్నా వర్ణభేదాలు లేవు. నిషేధాలు లేవు, హెచ్చు తగ్గులు లేవు. అస్పృశ్యత లేదు. ప్రజ్ఞకు తగ్గ గౌరవం వుండేది. ప్రతిభకు అగ్ర గణ్యత వుండేది.

మరి, మతంగుడు వర్ణ సంకరుడెలా అయ్యాడు ? అవర్ణుడెలా అయ్యాడు ? వర్ణ బాహ్యత ఎలా కలిగింది ? వెలి, అంటరాని తనం ఎలా సంక్రమించాయి ?

ఈ ప్రశ్నలకు జవాబుగా కొంచెం వెనక్కు వెళ్ళి సురలు, అసురలు యీ దేశానికి వచ్చినప్పటి పాత గొడవలు కొన్ని తెలుసుకొనవలసి వుంది.

## మధ్య ప్రాచ్యం – కశ్యప సంతానం

ఎక్కడ పుట్టినా, ఎక్కడ పెరిగినా మానవ జాతిలోని వివిధ శాఖల మనుషులు మధ్య ప్రాచ్యంలో అభివృద్ధి పొందారనడం చారిత్రక వాస్తవం. 'మధ్య ప్రాచ్యం' అంటే మధ్యధరా సముద్రం, అరేబియా సముద్రం, సుమేరు పర్వాతాలు, సింధు లోయ ఆ మధ్యలో ఉండే భూభాగం అనవచ్చు. ఇప్పుడు మనం మధ్య ప్రాచ్యం అంటున్నది యిదే! ఏ దేశ చరిత్ర అయినా, ఏ జాతి ప్రజల విస్తరణ అయినా మధ్య ప్రాచ్యం నుంచి ప్రారంభమైనట్టిదే అని చరిత్ర.

ఎన్నో జాతులుగా, దేశాలుగా, విభజించబడి వున్న ఆ భూభాగంలో, సిరియా, అస్సిరియా అనే రెండు దేశాల వాళ్ళు అగ్ర పంక్తికి వచ్చి పరస్పరం కలహించుకొంటూ వున్న కాలంలో ప్రారంభమయింది మన చరిత్ర. ఈ సిరియా, అస్సిరియా దేశాల వాళ్ళు దాయాదులు. ఒకే తండ్రికి పుట్టిన సవతి తల్లి బిడ్డలు. ఆ తండ్రి పేరు కశ్యపుడు.

చరిత్రకు తెలిసిన మొదటి మహాముని అతడే గనుక, అతణ్ణి 'కశ్యప బ్రహ్మ' అన్నారు. బ్రహ్మ అంటే 'ప్రజాపతి' మాత్రమే కాదు, సర్వ సృష్టినీ చేసిన సృష్టికర్త. విశ్వాన్ని నిర్మించిన విశ్వకర్మ, సమస్త సృష్టికి అతడు పిత, కనుక 'పితామహ'.! 'పితామహుడు' అంటే సామాన్యార్థంలో 'తాత' అనే కాదు, 'మహాపిత' అని. 'తాత' అనే అర్థం తీసుకొని 'బ్రహ్మ'ను ముసలివాడుగా చిత్రించడం అవివేకం.

ఈ కశ్యపుడు ఒక్కొక్క భార్యకు ఒక్కొక్క వర్గం చొప్పున సృష్టిలోని మొత్తం 84 లక్షల వర్గాలను కనిపెట్టినాడు. 'జీవు లెనుబది నాల్గు లక్షలు' అంటూ తత్త్వవేత్త యడ్ల రామదాసు కట్టిన లెక్క యిది. అదితికి ఆదిత్యులు, దితికి దైత్యులు, దనువుకు దానవులు, మనువుకు మానవులు, వినతకు గరుడులు, కద్రువకు నాగజాతులు పుట్టినట్లు మనందరకూ తెలిసిందే కదా !

యూదులు, అరబ్బులు ఈ విధంగా పుట్టిన దాయాదులే. లోకంలో అగ్రగణ్యత కోసం పోరాడుకున్న వారిలో లోక దృష్టిని ఆకర్షించిన వాళ్ళు అదితి సంతానం. వాళ్ళే సిరియా దేశాన్ని పరిపాలించిన సిరియన్లు. వాళ్ళకు వైరస్థానంలో నిలిచి, ప్రాబల్యం కోసం పోరాటాలకు దిగిన వాళ్ళు దితి, దనువు వంటి వారి సంతానం దైత్యులు, దానవులు. వాళ్ళే అస్సీరియా దేశాన్ని పరిపాలించిన అస్సీరియన్లు.

సిరియనులే సురులని, అస్సీరియనులు అసురులని తదుపరి పేర్కొనబడ్డారు. సురులకు తండ్రి వాత్సల్యం, పెద్దల ఆశీర్వాదాలు ఎక్కువగా వుండటం వల్ల, అందుకు వాళ్ళ ప్రతిభా ప్రాభవాలు తోడ్పడడం వల్ల వాళ్ళు మధ్యధరా సముద్రం నుంచి హిమాలయ ప్రాంతాల వరకు వ్యాపించారు.

అసురులు కూడా వాళ్ళకు తీసిపోలేదు ! అస్సీరియా సామ్రాజ్యాన్ని నెలకొల్పిన అసురులు సురులను తరచు వేధిస్తూ వుండే వాళ్ళు. సదరు వైరమూ, పోరాటమూ వాళ్ళు ఎక్కడికి వెళ్ళినా కూడానే వుండేవి. భారతదేశంలోకి కూడా వెన్నంటి వచ్చాయి, దేవాసుర యుద్ధాలుగా ప్రఖ్యాత మయ్యాయి.

కశ్యపబ్రహ్మ అంతటి ప్రముఖుడు సృష్టికి ఆద్యుడు కనుకనే అతడుండే ప్రాంతానికి కౌశ్యపం (కాకేషస్ ప్రాంతం) అని, ఆ ప్రాంతంలోని జలాశయానికి కాస్పియన్ సముద్రం అని పేర్లు వచ్చాయి.

కాశ్మీరు లోయ మహా సరస్సుగా వున్నపుడు దాని నీటిని సింధూ నదిలోకి విడగొట్టి, దానినొక దేశంగా చేసిన వాడు కూడా ఈ కశ్యపుడే, ఇతని పేరు మీద కాశ్మీరు అని పేరు ఏర్పడినది.

పరశురాముడు రాజు లందరినీ జయించి గైకొన్న భూలోకాన్ని ఈ కశ్యప ప్రజాపతికి ఇచ్చివేయడం వల్లనే భూమికి 'కాశ్యపి' అనే పేరు వచ్చింది. ఈ చరిత్రంతా కశ్యప బ్రహ్మ ఔన్నత్యాన్ని చాటేదే.

ఈ బ్రహ్మ ఇతర జాతుల చరిత్రలలో 'అబ్రహాం'గా పేర్కొనబడ్డాడని చాలా మంది మేధావుల వుద్దేశం. భారతీయ బ్రహ్మకు, హీబ్రూ అబ్రహాముకు పోలిక లున్నాయి. బ్రహ్మ భార్య శారద. అబ్రహాం భార్య 'శారా' తన సృష్టే కనుక బ్రహ్మకు శారద కూతురు అనవచ్చు. అబ్రహాము కూడా శారాను చెల్లెలుగా చెప్పుకున్నాడు. బ్రహ్మ సంతానంలో ప్రధానమైన శాఖలు దేవతలు, రాక్షసులు. అబ్రహాం సంతానంలో ప్రధాన శాఖలు యూదులు, అరబ్బులు. ఇలాంటి పోలిక లెన్నైనా చెప్పవచ్చు.

## యుగాలు - వేదాలు

భారతీయులు కాలాన్ని నాలుగు యుగాలుగా విభజించారు. ఆ నాలుగే మళ్ళీ మళ్ళీ రిపీట్ అవుతూ వుంటాయనేది సిద్ధాంతం. కలియుగం తరువాత, మళ్ళీ

కృతయుగం వస్తుందన్నమాట. అయితే ఆ మళ్ళీ వచ్చే కృతయుగం మొదటి కృతయుగం లాటిదేనా ? కాదంటాను నేను.

కాలగమనం సరళ రేఖ కాదు, క్రమోన్నతి కల వృత్త రేఖ. శంఖావర్త పురోగమన మది. ఘాట్టు రోడ్డు వంటిది. అస్సీరియన్లు, సిరియన్లు భారతదేశంలో ప్రవేశించి, తమ యుద్ధాలను కొనసాగించడం ప్రారంభించిన కాలమే ఒక కృతయుగారంభం. అంతకు ముందు ఎన్నో 'యుగచతుష్కాలు' గడిచిపోయి వుండవచ్చు. ఇప్పటి కృతయుగం మాత్రం ఇంద్ర, వృత్రాసుర యుద్ధంతో ప్రారంభమయిం దనవచ్చు.

వేదాలు అంతకు ముందు నుంచే ఈ దేశంలో వున్నవా ? లేక, మధ్య ప్రాచ్యం నుంచి దేవాసురలతో (ఆర్యులతో) వలస వచ్చి నట్టివా ? అనే ప్రశ్నలు అప్పుడప్పుడు వెలువడుతూ వుంటాయి. ఈ ప్రశ్నలు అనవసరమని నా వుద్దేశం. ఎందుకంటే ఈనాటి భారతదేశం ఒకానొక కాలంలో అజనాభంగాను, జంబూ ద్వీపంగాను పిలువబడిందే కదా ! ఆ కాలంలో ఉత్తర ధ్రువ ప్రాంతం కూడా భారత్‌లోదే. మధ్య ప్రాచ్యం కూడా భారత్ లోదే, అమెరికా కూడా ఈ జాతి మానవుల ఆవాస భారతం.

తిలక్‌గారు చెప్పిన హిమ ప్రళయం సమయంలో, అక్కడి ఆర్య జాతులు ధ్రువ భూముల నుంచి, నాలుగు ప్రక్కలకూ వలస పోవడం జరిగింది. కొందరు యిటు దక్షిణానికి వస్తే, కొందరు అటు బేరింగు మీదుగా అమెరికాలో ప్రవేశించడమూ జరిగింది. అందువల్ల వేదాలు ఎక్కడ పుట్టాయి ? ఎక్కడెక్కడికి ఏయే రూపాలలో ప్రయాణించాయి ? అనే ప్రశ్నలే అక్కర్లేదు.

''అనంతాః వేదాః'' వేదాలు అనంతం. ఎప్పుడో ఒకప్పుడు పుట్టి ఆగిపోయినట్టివి కాదు. అవి నిరంతరంగా పుడుతూనే వున్నాయి. వేదాలు అపౌరుషేయాలు కదా ! అంటే మామూలు మనుషులు చెప్పినట్టివి కాదు. అనుభవజ్ఞుల నోట దేవుడు పలికించినట్టివి. అప్పుడున్న దేవుడు ఇప్పుడు మాత్రం లేడా ! అప్పుడు పలికించినట్టే ఇప్పుడూ పలికించడా! ఋషులున్నది అప్పుడేనా ! ఇప్పుడు లేరా ? కనుక వేదాలు అపౌరుషేయాలు అంటే అనుభవజ్ఞులైన వాళ్ళు జ్ఞానం ద్వారా, ధ్యానం ద్వారా మానవుడి ప్రయోజనం కోసం చెప్పే సూక్తు లన్నమాట.

ఈ సూక్తులు నాడు, నేడు కూడా చాలా వరకు ఒకే విధంగా వుంటై, కొన్ని మాత్రం కాలానుగుణంగా మారతై. పాత పద్ధతులను పరిహరించి, కొత్త పద్ధతులను

ప్రవేశపెట్టే వాళ్ళు ఋషులే, మేధావులే. ఈ ఋషులు పూర్వం కంటె ఇప్పుడే ఎక్కువగా పుడుతున్నారని నా వుద్దేశం. ప్రకృతి ప్రవర్తనలో మార్పు వస్తున్న కొలది దానికి కారణభూతులైనఋషులు అవతరిస్తూనే వుంటారు. ఇదొక నిరంతర పరిణామ క్రమం.

రెండెడ్ల బండి కాలం కంటె మోటారు కారు కాలం ఉత్తమమైనట్టిది కదా! అలాగే ఈ కాలపు అనుభవజ్ఞుడు ఉత్తమోత్తముడు కదా ! ఆనాటి ఋషుల కంటె ఈనాటి సైంటిస్టులు ఎక్కువ గొప్పవాళ్ళు.

## వేదాల విభజన

వేదాలను విభజించినందువల్లనే వ్యాసుడు వేదవ్యాసు డైనాడు కదా ! నిజానికి వేదాలను ఎందుకు విభజించవలసి వచ్చింది. విభజించక ముందు వేదస్వరూపం ఎలా వుండేది ?

జ్ఞాన ప్రధానమైన వేద సమాజం వేరు, జన్మ సంబంధమైన కుల సమాజం వేరు అనే నా సిద్ధాంతం ఈ సందర్భంలో పుట్టినదే ! అరుంధతికి సంబంధించిన వర్గంలో పుట్టిన మాల మాదిగ వాడు వ్యాసుడు మొత్తం భారత జాతికే అన్ని విధాలా మూల పురుషు డెలా అయ్యాడు ? అది జ్ఞాన ప్రధానమైన కాలం కనుక, జ్ఞానం అంటే బ్రహ్మ జ్ఞానం కనుక. ఆనాటి సమాజానికి అగ్రేసరుడైనాడు వ్యాసుడు. బ్రహ్మ విద్యావేత్తయై బ్రాహ్మణు డైనాడు.

ఆనాటి వర్ణాలు కూడా వృత్తులు, ప్రతిభను నాలుగు ప్రజ్ఞలుగా విభజించి, ఒక్కొక్క ప్రజ్ఞను ఒక్కొక్క వృత్తిగా ఎన్నుకొన్న వాళ్ళను ఒక్కొక్క వర్గంగా పరిగణించారు. అట్టి వృత్తి వర్గాలనే వైదిక భాషలో వర్ణాలు అన్నారు.

అందులో బ్రహ్మ జ్ఞానం ప్రధాన వృత్తిగా గల వాళ్ళు బ్రాహ్మణులైనారు కదా! వశిష్ఠాది ఋషులు వేదవ్యాసుడి వరకు అలా ఏర్పడ్డ బ్రాహ్మణ వర్గమే.

వేదాలంటే ఆనాటి పెద్దల అనుభవ సూక్తులు, వయోవృద్ధుల 'బుద్ధి' గల మాటలు. ఎవరో కొద్ది మంది యువకులను మినహాయిస్తే లోకానుభవం ప్రాతిపదికగా వెలువడే విలువైన వచనాలన్నీ, వాక్యాలన్నీ, పెద్దల నుంచి వచ్చేవే. అట్టి వారినే 'ఋషు' లన్నారు. అట్టి వాక్యాలే వేదవాక్యా లయినాయి.

యువకులయినా, వృద్ధులయినా, ఏ కొద్ది మందో చెప్పే మాటలే ప్రకృతి ధర్మాల ననుసరించి వుంటాయి. అట్టి ఎవరెవరో చెపుతూ వచ్చిన ఎన్నెన్నో మాటలు సూక్తులుగా, వేదవాక్యాలుగా సమాజం నిండా వ్యాపించి వుండటం జరుగుతుంది. అవి బాగా విస్తరించి నపుడు ఏ సందర్భాని కే వాక్యం పలకాలో తెలియకుండా పోయే ప్రమాదం ఏర్పడుతుంది. అట్టి ప్రమాదం ఏర్పడిన సందర్భంలో అట్టి వాక్యాలన్నీ తెలిసిన విపుల విజ్ఞాన వేత్త అయిన వాడు వాటిని గుర్తించి చెప్పవలసి వుంటుంది. అట్టి పనినే మనం యిప్పుడు 'ఎడిటింగ్' చేయడం అంటున్నాము. ఆ విధంగా ఆనాడు వేద మంత్రాలను 'ఎడిటింగ్' చేసిన వాడే వేదవ్యాసుడు.

వ్యాసకాలపు యుగ చతుష్కం సురాసుర యుద్ధానంతరం మొదలైనట్టిది. జ్ఞానం స్థానంలో జన్మను నిల్పి, యూదు గురువులు బ్రాహ్మణులై వైదిక జ్ఞాన వ్యవస్థను ఆక్రమించు కొన్నట్టిది. మతంగుడి వెలికి మూలం యిదే.

నాలుగు సందర్భాలను ఎన్నుకొని కలగూర గంపగా వున్న వేద మంత్రాలను నలుగురు శిష్యులకు చెపుతూ వచ్చాడు వ్యాసుడు. ఒక్కొక్క శిష్యుడికి చెప్పిన మంత్రాలన్ని కలిసి ఒక్కొక్క వేద సంపుటి అవుతూ వచ్చింది. ఆ విధంగా నలుగురు శిష్యులు నాలుగు వేదాలకు 'నిధుల' య్యారు.

## కులవ్యవస్థ ఎప్పటి నుంచి

ఆదిలో జ్ఞాన ప్రధానమైన వర్ణ వ్యవస్థగా వున్న భారత సాంఘిక వ్యవస్థ తరువాత జన్మ ప్రధానమైన కులవ్యవస్థగా ఎలా మారింది ? ఎప్పుడు మారింది ? ఎందుకు మారింది?

ఈ మూడు ప్రశ్నలకూ ఖచ్చితంగా, చారిత్రక పరిణామాల దృష్ట్యా సమాధానం చెప్పాలంటే అదొక పెద్ద విప్లవ గాథ అవుతుంది. నిజం చెప్పి నిష్ఠూరం తెచ్చుకొనే కీర్తి కలవాణ్ని కాబట్టి, నాకు తెలిసిన నిజం సూటిగా చెప్పాలనుకొంటున్నాను. ఈ విషయంలో ఎంతో పరిశోధన జరగవలసి వుంది ! సాంఘిక స్వార్థం, రాజకీయ ప్రయోజనం, లాభ నష్టాల బేరీజు లేని ఉత్తమ మేధావులు చెయ్యవలసిన పరిశోధన అది. అందులో ఎలాంటి స్వపర పక్షపాతాలకు తావుండకూడదు.

జ్ఞాన కాలంలో ఎక్కడ ఎవరికి పుట్టిన వాడయినా, బ్రహ్మజ్ఞాని బ్రాహ్మణుడయ్యే వాడు ! బ్రహ్మ జ్ఞానిత బ్రాహ్మణ అయిన ఆ కాలం వేదవ్యాసుడి వరకూ కొనసాగిందన వచ్చు.

ఎందుకూ పనికిరాని ఒక అజ్ఞాని అపూర్వంగా బ్రహ్మజ్ఞాని అయితే, అంతకు ముందు అతని కుండే దాస (పరిచారక లేక కార్మిక) స్థాయి మారిపోయి, బ్రాహ్మణ స్థాయి లభించేది. జన్మను బట్టి గాక, గుణ కర్మలను బట్టి వ్యక్తి సాంఘిక స్థాయి పెరుగుతూ, తరుగుతూ వుండేది. బానిస బ్రాహ్మణు డయ్యేవాడు, బ్రాహ్మణుడు పరిచారకు డయ్యేవాడు. ఈనాడు కొన్ని ఇతర దేశాలలో వున్న వర్గ నిర్మాణం అలాంటిదే కదా ! పరిస్థితుల మార్పును బట్టి కార్మికుడు యజమాని, యజమాని కార్మికుడూ అవుతున్నారు కదా ! ఆనాడు భారతీయ వైదిక సమాజం కూడా, గుణ కర్మలను బట్టి మారే వర్గ సమాజంగానే వుండేది !

జ్ఞాన సమాజం జన్మ సమాజం ఎలా అయ్యింది ?

కశ్యప కుమారులైన దేవదానవ దాయాది వర్గాలు రెండూ కొట్లాడుకొంటూ, భారత దేశంలో కూడా తమ పోరాటాలను కొనసాగిస్తూ, తుదకు అవి చల్లారిన తర్వాత, సమాజంలో మార్పులు చేర్పులు విపరీతంగా జరిగిన తర్వాత, దేశంలో ఒక విధమైన స్తబ్ధత ఏర్పడింది. చిన్న చిన్న రాజ్యాలు ఏర్పడి, 'రాజ్యం వీర భోజ్యం' అనే సిద్ధాంతం పుట్టుక వచ్చింది. దేశం నిండా రకరకాల రాజులూ, రాజ్యాలూ ! వేదాలు విస్మరించబడ్డాయి. సమాజ నిర్వహణలో ప్రమాణాలు లేకుండా పోయాయి. అంతా అయోమయం, అంధ యుగం !

దేశ చరిత్రలో అట్టి చీకటి కాలం ఒకటున్నదని చారిత్రక పరిశోధకులు అందరూ అంగీకరిస్తున్నారు. అట్టి కల్లోల స్థితి ఎంత కాలం కొనసాగిందో తెలియదు. మళ్ళీ సమాజం ఒక గాడిన పడాలనుకొన్నప్పుడు, ప్రమాణాల సంగతి చర్చకు వచ్చి, ఎక్కువ మంది రాజులు వేద ప్రమాణాలను స్వీకరించదలచి వుంటారు. సర్వజనులకూ వేద ప్రమాణం సామాన్యం కాబట్టి, దాని కోసం ఆలోచించి వుంటారు.

ప్రతి రాజు సర్వ స్వతంత్రుడే ! ప్రతి రాజు వేద పండితులకోసం అన్వేషించినవాడే! పూర్తిగా వేద జ్ఞానం కలవాళ్ళు దొరకలేదు. కొద్ది కొద్దిగా జ్ఞాపకమున్న వాళ్ళు లభించారు.

తమకు జ్ఞాపకం వున్న వాటిని స్మరణకు తెచ్చుకొని 'స్మృతులు' వ్రాశారు. ఒక్కొక్క రాజు ఒక్కొక్క 'స్మృతి కర్త'ను ఆదరించి, ఒక్కొక్క స్మృతిని అధికార ప్రమాణంగా స్వీకరించాడు. అట్టి సంధికాలంలో ఏర్పడిందే. జన్మకుల వ్యవస్థ. వారసత్వ సిద్ధాంతం.

రాజ్యం వీర భోజ్యం, బలం కలవాడే రాజు అంటూ వచ్చి, శక్తి ప్రాధాన్య సిద్ధాంతాలను అనుసరించి ఏర్పడిన రాజ్యాలే ఆనాటి వన్నీ ! పనిలో పనిగా, తమ రాజ్యాలను సుస్థిరం చేసుకోవడానికి, అనువంశికంగా అనుభవించడానికి తగు చట్టాలను అప్పుడే ఏర్పాటు చేసుకొన్నారు రాజులు ! అట్టి చట్టాలను నిర్మించిన పురోహితులకు, మంత్రులకు, అందులో భాగం పంచారు. ఆ విధంగా రాజు కొడుకు రాజు, మంత్రి కొడుకు మంత్రి వంటి జన్మ కులం ఉనికిలోకి వచ్చింది. ఇది జన్మాతిశయం కల యూదు సంప్రదాయం.

## పంచమ యుగం

కాలం నాలుగేసి యుగాల యూనిట్లుగా విభజించబడింది కదా. ఒక్కొక్క యూనిట్‌లో నాలుగు యుగాలుంటై. అలాంటి యూనిట్లు అసంఖ్యాకం. గడిచిన వెన్నో, గడవబోయేవెన్నో తెలియదు. అలాంటి యూనిట్లలో ఒకటి ఇప్పుడు జరుగుతున్న వ్యాస చతుష్కం. కృత, త్రేతా, ద్వాపర, కలియుగ చతుష్కం ఇది. కలియుగం తర్వాత పంచమ యుగాన్ని చేరుస్తున్నాను నేను ఇప్పుడు.

వైదిక భారతంలోకి దేవాసురులు ప్రవేశించి, ఆధిపత్యం కోసం పోరాడుకుని దేశంలోని సంస్కృతినీ, సామాజిక వ్యవస్థనూ నాశనం చేసి, అయోమయం సృష్టించిన యుగ చతుష్కం ఇది. ప్రస్తుత యుగ చతుష్కం అట్టి అయోమయ స్థితి నుంచి ప్రారంభమై, త్రేతా గడిచి ద్వాపరం నడుస్తున్నప్పుడు పుట్టిన వాడు వ్యాసుడు. వ్యాసుడు పుట్టే వరకు కూడా వైదిక వ్యవస్థ అల్లకల్లోలంగానే వుంది.

దేవ జాతుల గురువు బృహస్పతి వంశం వాళ్ళూ, రాక్షస జాతుల గురువు శుక్రాచార్యుల వంశం వాళ్ళూ కూడా ఆయా జాతుల వెంట భారతదేశానికి వచ్చిన విదేశీ ఆర్యులే. యూదు జాతీయులే ! మధ్య ప్రాచ్యంలో ఎన్ని జాతులు ఎన్ని పేర్లతో పిలువబడినా, ఆనాడు అక్కడ నివసించిన వాళ్ళందరూ ఒకే జాతి వాళ్ళు. కశ్యప సంతానం. మంగోలియా నుండి టర్కీ మీదుగా మధ్యధరా సముద్రం వరకు, ఇటు గంగ సింధూ మైదానం వరకు ఆక్రమించి పరిపాలించిన ఆర్యజాతి అది.

ఏది ఏమైనా, వ్యాసయుగ చతుష్కం ప్రారంభం నాటికి దేశంలో వున్న స్థితి అయోమయం. వైదిక వ్యవస్థ శిథిలం చేయబడింది. శ్రుతుల స్థానంలో స్మృతులు ప్రవేశ పెట్టబడ్డాయి. జ్ఞానం స్థానంలో జన్మ (పుట్టుక) ప్రతిష్ఠించబడింది. వర్ణ వ్యవస్థ కఠిన కుల వ్యవస్థగా మారగానే, తక్షణ ఫలితంగా కుల సంకరం ఏర్పడింది. కులాంతర ప్రేమ ఫలితంగా పుట్టిన వాళ్లు సంఘ పరిధి నుంచి వెలి వేయబడుతూ వచ్చారు.

తక్కిన కులాల సంగతి ఎలా వున్నా, మొదటి కులానికి చివరి కులానికి మధ్య సాంకర్యం కఠిన శిక్షలకు గురైంది. అలా సంఘ బహిష్కృతుడైన మొట్ట మొదటి పిల్లవాడే మతంగుడు.

వ్యాసయుగ చతుష్కం లోని కృతయుగం నాటి సంగతి అది. ఆనాడు కుల బహిష్కారమే తప్ప అంటరానితనం లేదు. వీరబాహుడు, పుల్కసుడు మొదలైన వాళ్ళందరూ బహిష్కృతులు కావచ్చు. అంటరాని వాళ్ళు మాత్రం కాదు. కాశీ నగర వీధుల్లో స్వేచ్ఛగా వూరేగుతూ, హరిశ్చంద్ర చక్రవర్తినే కొనగలిగిన వీరబాహుడు అస్పృశ్యుడెలా అవుతాడు ? బహిష్కృత వంశం వాడన్న చిన్న చూపు అతనిపట్ల పైకులాల వాళ్ళకుంది. అంతే !

## అందరూ అవైదికులే

యయాతి చక్రవర్తి నుంచి క్రిందికి దిగి వస్తే, ఈ దేశంలో భారతీయులుగా పరిగణించ బడుతున్న హిందువు లందరూ ఆయన వారసత్వానికి చెందిన బహుజనులే (వెనుకబడ్డ కులాల వాళ్ళే). ముసలి యయాతికి చెందిన ముదిరాజులు, దేవయానికి చెందిన యాదవులు, శర్మిష్టకు చెందిన పౌరవులు, కాళిదాసుకు చెందిన గొల్లలు, నారదుడికి చెందిన రజకులు, దేవరాక్షస గణాలకు సురాపానం అందించిన గౌడలు, మయ, విశ్వకర్మ మున్నగు చతుష్షష్టి కళలకు చెందిన అనేక మంది, వృత్తులను బట్టి అనేక కులాల పేర్లతో జీవితాన్ని సాగిస్తున్న వివిధ వర్గాల ప్రజలంతా ఒకే అసుర మూల జాతికి చెందిన శాఖలే !

కాలజ్ఞాన తాత్వికుడైన వ్యాసుడికి ఈ అయోమయ స్థితి అంతా అవగతమైంది. ఆది వైదిక సామాజిక వ్యవస్థను పునరుద్ధరించా లనుకున్నాడు. అందుకే వేద విభజన చేశాడు. పురాణాలు, ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రాలు చివరకు భగవద్గీత ప్రకటించి, అన్ని విధాలా భారతోద్ధారకు డైనాడు. నా వంశ వృక్షం ఇంతటి గొప్పది.

ఈనాడున్న కులవ్యవస్థ ఆనాటి వర్ణ వ్యవస్థ కాదు. ఈనాడున్న బ్రాహ్మలు ఆనాడు వేదాలను పలికిన బ్రహ్మజ్ఞానులు కాదు. ఈనాటి వాళ్ళంతా జన్మకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చే యూదుజాతీయులు. మంగోలులు. టర్కీ దేశం కేంద్రంగా జంబూ ద్వీపాన్ని పాలించిన వాళ్ళు. ఇప్పుడున్న ప్రజ లందరూ కులాంతర ప్రేమ వివాహాల ఫలితంగా పుట్టుక వచ్చిన బహుజనులే, స్వచ్ఛమైన వేద యుగాల వైదిక జాతుల వాళ్ళెవరూ ఈనాడు లేరు. అందుకు సాక్ష్యం జాత్యహంకారం, కులాధిక్యతా రాజసం, జన్మకుల వ్యవస్థ. ఈ వ్యవస్థ భారతీయం కాదు. అన్యజాతీయం. అభారతీయం.

ఈ దుస్థితిని సరిదిద్దడానికే నా ప్రయత్న మంతా. అందుకే కులం మార్పిడి చట్టం తీసుకురావాలంటున్నాను. జాతి మొత్తం కుల భేద రహితం కావా లంటున్నాను. వేద వ్యాసుడు కేంద్రంగా విస్తరిల్లిన ఈ యుగ చతుష్కం నాది. ఎన్ని కులాలు వున్నా అన్నీ సమానమే ! ఏదీ జన్మ ప్రధానం కాదు. అన్నిటికి జ్ఞానమే అంతర్వాహిని.

కులాధిక్యత సహించరానిది. కుల గర్వం భరించరానిది. కుల గతాలైన రాగద్వేషాలు, పక్షపాతాలు, దురభిమానాలు అమానుష మైనట్టివి. అభ్యుదయ నిరోధక మైనట్టివి. నా జీవిత కృషి అంతా ఈ మార్గంలోదే. సాహిత్యం ఆయుధంగా నేను సాగిస్తున్న పోరాటమంతా ధర్మం కోసమే ! సమగ్ర మానవ ధర్మ సర్వతోముఖ వికాసం కోసమే !

## వ్యాసుడి చివరి యత్నం

జ్ఞానమె జీవ లక్ష్యమయి,
శక్తికి పూజ లభించినట్టి ప్రా
చీన సమాజ మందు విక
సించెను వేదములున్, పురాణముల్;
వాణి వరించె వాల్మికుల,
వ్యాసుల వర్ణ వివక్ష లేక ; తత్
స్థానము మార్చి, జన్మకుల
చట్టము తెచ్చిరి జాతి శత్రువుల్

బ్రహ్మ విద్యయె విద్యా పరాత్పరమ్ము ;
దాని లోగొని, కర్ర పెత్తనము నెరపి,
దేవదానవ యుద్ధాల తెరల వెనుక
జ్ఞానమును చంపి, జన్మ రాజై రహించె

బ్రహ్మ యెవ్వరు ? న్యాయ దైవతమె ; అతని
పంచమ ముఖంబు త్రుంచి కుంచించిరేల ?
చతురుడై వ్యాసముని భవిష్యత్తు చూపి
ఆత్మ రక్షణ కొరకు పోరాడు డనియె !

వేద కాలం నాటి భారతీయ సోషలిస్టు సమాజాన్ని పునరుద్ధరించడానికి వేదవ్యాసుడు చేసిన చివరి యత్నం భగవత్ గీత.

నాలుగు వర్ణాలు వ్యక్తి యొక్క గుణకర్మలను బట్టి ఏర్పాటు చేయబడ్డాయన్నాడు. సృష్టిని యే దేవుడూ చేయలే దన్నాడు. దానికదే స్వభావతా పుట్టి పెరిగిపోతున్నదన్నాడు. గౌరవ జీవితం ఒకళ్ళు భిక్ష పెట్టేది కాదన్నాడు. దానిని యుద్ధం ద్వారా సాధించుకోవాలన్నాడు. పని చెయ్యమన్నాడు. ఫలితం వ్యతిరేకమ్మైనా బాధపడ వద్దన్నాడు.

"తస్మాత్ ఉత్తిష్ఠ, కౌంతేయ
యుద్ధాయ కృతనిశ్చయః"

అన్నాడు. ఈ భగవత్ గీతలో కూడా సన్యాసులు ఎవరికి తోచిన భావాలను వాళ్ళు శ్లోకాలుగా వ్రాసి, మొత్తం గీతనే కల్తీ చేసి పారేశారే కాని యథాతథంగా బ్రతకనివ్వలేదు. ఇప్పుడా యుద్ధ గీత ఒక సన్యాస దూతగా మారి, పనికి రాకుండా పోయింది.

దేవ దానవులు అన్నదమ్ముల పోరాటంలో కొట్టుక చస్తుండే వాళ్ళు కదా, వాళ్ళు భారతదేశానికి కూడా వచ్చినప్పుడు, వాళ్ళతో పాటు మధ్య ప్రాచ్యం నుంచి యూదులు కూడా వచ్చారు. వాళ్ళే ఉభయ పక్షాలకు గురువులు కూడా అయ్యారు. యుద్ధాలు

ముగిసి శాంతి నెలకొనేటప్పటికి శ్రుతులు పోయాయి. దేశమంతా పట్టణ రాజ్యాలు వెలిశాయి. యూదు గురువులు బ్రాహ్మణ మతాన్ని చేజిక్కించుకొని, శ్రుతుల స్థానంలో స్మృతులను నింపి, ధర్మశాసనాలు చేసి ప్రజలపై రుద్దారు.

అదే క్రమంగా హిందూ మతమైంది. జ్ఞానం స్థానం లోకి జన్మ తేబడింది. వర్ణ వ్యవస్థ కుల వ్యవస్థ అయ్యింది. స్వేచ్ఛా సమాజం కులకట్టుబాట్లతో కట్టు బానిస అయింది. ఇది నా ఊహకాదు, ఆనాటి నుంచీ వివిధ జాతుల మేధావులు ప్రకటిస్తూ వస్తున్న అభిప్రాయమే.

వేదవ్యాసుడి చరిత్ర ప్రాచీన భారతీయ సమగ్ర చరిత్ర. చారిత్రక, సాంస్కృతిక, సాంఘిక, రాజకీయ, వేదాంతాది అన్ని రంగాలలోను గూడా వ్యాసుడే భారత జాతి, భారత జాతే వ్యాసుడు.

"అల్లుడుగారి ఈ ఇల్లరికం ఇంకా ఎంతకాలం ?" అంటూ ఎత్తి పొడుస్తున్న అత్తగారి మాటలను భరించలేక కాశీకి మకాం మార్చిన శివుడు, కాశీరాజైన దివోదాసుని వంచించి అతని రాజ్యాన్నే ఆక్రమించుకుని కూర్చున్నాడు కదా ! అట్టి ఆది భిక్షువు తన రాజ్యంలో వేదవ్యాసుడికి భిక్ష దొరక్కుండా చేసి కాశీ నుండి వెళ్ళగొట్టాడు. ఈ అన్యాయపు గాథ వ్యాసుని జీవితంలో ఒక ప్రత్యేక నాటకానికే వస్తువు కాగలిగి నట్టిది. దానిని ఈ గ్రంథంలో నేను స్పృశించలేదు. కొన్ని వివరాలను మాత్రం నా బాలయోగీయం కావ్యంలో ఇచ్చి ఉన్నాను.

## జయాపజయాలు

"జయాపజయాలు దైవాధీనాలు" అనేది సామెత. ఇది భగవద్గీతలోని ఒక శ్లోకానికి సారాంశం. "కర్మణ్యే వాధి కారస్తే, మా ఫలేషు" అనేది ఆ శ్లోకం. జయాపజయాలు దైవాధీనాలు. వాటిపై నీ కధికారం లేదు. వాటిని గురించి ఆలోచిస్తూ కూర్చోకు. నీ అధీనంలో ఉన్నదీ, నీవు చేయగలిగిందీ ఒక్కటే. పనిచేయడం. కర్తవ్య నిర్వహణ. చేసిన పని మంచి ఫలితాన్నిస్తుందా, విఫలమౌతుందా అనే ఆలోచనే నీకు అక్కర్లేదు. నీ కర్తవ్యం యుద్ధం చెయ్యడం. గెలిస్తే భూలోక రాజ్యం, చస్తే వీర స్వర్గం. కనుక ఫలితాన్ని గురించి ఆలోచించకు, లేచి యుద్ధం చెయ్.

ఇదీ భగవద్గీత చేసిన బోధ. వేద వ్యాసుడు కృష్ణ భగవానుడిచే చెప్పించిన సుభాషితం.

ఇంతటి మహత్తర సుభాషితాన్ని వక్రీకరించి, నిష్కామ కర్మ, అనాసక్త యోగం వంటి మాటల్ని సృష్టించి గీతను, జాతిని కూడ పండితులు అధోగతి పాలు చేశారంటే, అది వ్యాసుడి దోషం కాదు కదా ! శ్రీకృష్ణ బోధామృతంలో విషం కలిపి జాతి ప్రజలకు పంచిపెడుతున్నారు స్వాముల వార్లు. గుర్తించే జ్ఞానం ప్రజలకు లేదు మరి.

## నా కథన ప్రణాళిక

అట్టి వ్యాసుడి గురించి ఏమి వ్రాసినా, ఎంత వ్రాసినా అసమగ్రమే అవుతుంది. అందుకే ఈ నాటక రచనకు రెండు మూడు అంశాలను మాత్రమే తీసుకున్నాను. వ్యాసుడి పుట్టుక, అతడు భారత రాజ వంశాన్ని పునరుద్ధరించడం, వేదాలను విభజించడం, పురాణ రచన, భారత భాగవతాల నిర్మాణం, శ్రీశుకుడి పుట్టుక – వీటిని మాత్రమే ఈ రచనలో స్పృశించగలిగాను. సందర్భాలను అతకడానికి నేపథ్యం నుంచి ప్రయోక్త చేత కథ చెప్పించాను.

మొట్టమొదటిలో నా వుద్దేశ్యం మతంగుడి కథ వ్రాయాలని. అది కూడా ఒక మహా సముద్రమే. అందులో పడి ఈదసాగాను. కాని మునిగిపోయే ప్రమాదం ఏర్పడింది. అంట రానితనం ఏర్పడడానికి మూలపురుషుడు మతంగుడే. వెలి అంటరానితనంగా వెర్రి తలలు వేసినప్పుడు, ఆ తలలు కొన్ని స్వార్థపరుల కుల వ్యవస్థగా కుక్క మూతి పిందెలు కాయగా, మరికొన్ని వేద వ్యవస్థకే వేరుపురుగులై, వేద జాతినే నాశనం జేశాయి.

అదొక యుగ సంధి. యుగానంతర కల్లోల పరిస్థితి. దానిని అనేకులు అనేక విధాలుగా ఉపయోగించుకున్నారు. వేదాలను కల్తీ చేసి స్మృతులను సృష్టించి, వాటినే వేద ప్రతీకలుగా ప్రచారం జేసి, గుణ కర్మ ప్రధానమైన వర్ణ వ్యవస్థను కేవలం జన్మ ప్రధానమైన కుల వ్యవస్థగా మార్చి, విదేశీ పెత్తందార్లు జాతిని నిర్వీర్యం చేసిపారేశారు.

ఈ పెత్తందార్లు చారిత్రకంగా మొగలాయి తురుష్కులై వుండవచ్చునని కొందరనగా, యూదులై వుండవచ్చునని మరికొందరు అంటున్నారు. ఈనాడు

ప్రచారంలో ఉన్న ఆధునిక మతాలకు సంబంధించిన కాలం కాదది. మూల వైదిక వ్యవస్థకు ప్రాణ ప్రతిష్ట చెయ్యటానికి ప్రయత్నించిన వ్యాసుడు తన భగవద్గీతలో ఆ విషయాన్ని ప్రస్తావించి వదిలేశాడు – "చాతుర్వర్ణం మయా సృష్టం" అంటూ. ఈ ఒక్క వాక్యాన్ని మాత్రమే గ్రహించి, ఆ తర్వాత "గుణ కర్మ విభాగశ" అనే ముఖ్య వాక్యాన్ని వదిలేసి, జాతిని అదే కాళ రాత్రిలో ముంచేసి వుంచేశారు మన సామాజిక గురువులు. ఇప్పటికీ అదే దుస్థితి.

ప్రజలకు తెలియదు, గురువులు నిజం చెప్పరు. ఈ దుస్థితిని తొలగించి వ్యాస సంస్కృతిని పునరుద్ధరించా లనేది నా ప్రయత్న మంతా.

అందుకు మతంగుడితో మొదలు పెట్టాలి కదా ! మతంగుడు ధర్మ వ్యాధుడికి వియ్యంకుడు కనుక, అతడి కథను తీసుకొని ధర్మవ్యాధుడు నాటకాన్ని వ్రాసాను. దానికి జంటగా వుంటుందని వేదవ్యాసుడి జీవితం లోని కొన్ని ఘట్టాలను తీసుకొని ఇపుడీ నాటకాన్ని ప్రకటిస్తున్నాను.


ఈనాడు దళితులుగా పరిగణించబడుతున్న అంత్య కులాల మూలంలోకి వెళ్ళాలంటే అందుకు మూలపురుషులైన మతంగుడు (చండుడు), ధర్మవ్యాధుడు, కర్దముడు, అరుంధతి, వాల్మీకి, వీరబాహుడు, త్రిశంకుడు, అరుంధతి వంశం వాళ్లైన శక్తి, పరాశరుడు, వేద వ్యాసుడు, అరుంధతి అక్కలైన అనసూయ మొదలైన వాళ్లు, తమ్ముడైన కపిల మహర్షి, ఆంజనేయుడు, సంగీతం కోసం మతంగుడికి కుమార్తెగా అవతరించిన మహాశక్తి మాతంగి వంటి మహావ్యక్తుల మూల చరిత్రలను పరిశీలించవలసి వుంటుంది.

అట్టి పరిశీలనా శక్తి బాధితులకు లేదు. బాధకులు చెప్పరు. విజాతీయుడైన మార్క్స్ ముల్లర్ పూనుకొని వుండకపోతే, ఈ మాత్రం పూర్వ చరిత్ర అయినా మన వరకూ వచ్చి వుండేది కాదు.

కనీసం ఈ నా రచనలు చదివి ఆలోచించగల విద్యావంతులు పుట్టుక వచ్చినప్పుడే నా ఆదర్శం నెరవేరుతుంది. జాతి పునరుద్ధరణలో నా పాత్ర కూడా అక్షయ మవుతుంది. ఈ రెండు నాటకాలతో పాటు ఇప్పుడే వెలువడిన నా "పంచమ స్వరం" కావ్యాన్ని కూడా చదవండి, గ్రహించండి.

శంఖారావం కావ్యం కూడా వస్తూ వుంది. ఎదురు చూడండి, ఎదురు చూడడమే చైతన్య లక్షణం కదా!

## నా వంశ వృక్షం




## నా వంశ వృక్షం – వివరణ

1. మతంగుడు జన్మకుల వ్యవస్థ తొలి దశలలో రెండు కులాల తల్లిదండ్రులకు పుట్టిన వాడు. అందువల్ల వెలివేయబడిన వాడు. మొట్టమొదటి వర్ణ బాహ్యుడు. ఈనాటి అవర్ణు లందరికి ఆద్యుడు.
2. సంగీత కళలో ఆద్యుడు అగ్రగణ్యుడు కనుక, అతని దగ్గర సంగీతం నేర్చుకోవడానికి జగన్మాతే కూతురై పుట్టింది. ఆమె మాతంగి. ఆమె కోసం తొలిసారిగా వీణను సృష్టించిన వాడు మతంగుడు. ఈనాటి వీణకు చాండాలిక అనే పేరుంది.
3. మతంగుడే తొలి చండాలుడు. సమాజంపై తిరుగుబాటు చేసిన విప్లవ కారుడు.

చండ దేవుడు. సర్వ విద్యా సమగ్ర మేధావి. రామాయణ కాలం నాటికి కిష్కింథలో ఋష్యమూక పర్వతం మీద స్థిరపడినవాడు. అదే మాలాద్రి. మాలకొండ.

4. గిరిజనుడైన ధర్మవ్యాధుడు తన కుమార్తెను మతంగుడి కుమారుడి కిచ్చి వియ్యంకు డైనాడు. హరి నుంచి తన వంశం వాళ్ళు పారంపర్యంగా కవులు కావాలన్న వరం పొంది, హరిజను డైనవాడు ధర్మవ్యాధుడు.

5. హరిజన, గిరిజన మైత్రికి మతంగ ధర్మ వ్యాధుల బంధుత్వమే అది.

6. మతంగ ధర్మవ్యాధుల బంధుత్వ కారణంగా విస్తరిల్లిన అవర్ణ ప్రజలలో గిరిజనులను అలా వుంచితే, హరిజనుల సంఖ్య దేశ మంతటా అశేషంగా పెరిగింది.

7. ఈనాడు ఆసేతు హిమాచలం మొత్తం దేశమంతటా విస్తరించి వున్న దళితులం దరికీ మూల పురుషులు మతంగ ధర్మవ్యాధులే. అందులో మతంగుడి వంశ వృక్షం ఉన్నతోన్నత మైనట్టిది.

8. ఈ వంశంలోని వాళ్ళే ఎక్కువ మంది దేవ ఋషులు, ప్రజాపతులు, బ్రహ్మలు.

9. కర్దమ అనే మాటకు మాంసం, మురికి అనే అర్థాలున్నై. కర్దముడు అంటే మురికి వాడు, మాంసం తినేవాడు అని అర్థం.

10. కృతయుగం నాటి ఈ కర్దముడు సరస్వతీ నదీ తీరంలో విష్ణు నామ సంకీర్తనం చేసుకొంటూ వుండేవాడు. ఇతని భార్య దేవహూతి. సంతానం తొమ్మిది మంది ఆడపిల్లలు, ఒక మగ పిల్లవాడు. ఎనిమిదవ కూతురు అరుంధతి. పదవ వాడు కపిల మహర్షి. భక్తి జ్ఞానాదుల వల్ల కర్దముడు బ్రహ్మ పదవిని పొందాడు.

11. మతంగుడి తరువాత అతని వంశ పరంపరలో కర్దముడు మరొక సుప్రసిద్ధుడు. తరువాత సుప్రసిద్ధుడు అదే పరంపరకు చెందిన వేద వ్యాసుడు.

12. జ్ఞానం స్థానంలో జన్మ వచ్చి, వర్ణం స్థానంలో కులం వచ్చి కులాంతర సంతానం వర్ణ బాహ్యులైన తర్వాత, ఈ బహిష్కృత ప్రజావర్గం లోనే బ్రహ్మలూ, మేధావులూ, మహర్షులూ పుట్టారనడానికి ఈ మహావ్యక్తులే నిదర్శనం.

13. అరుంధతికి సమకాలీనుడైన గిరిజనుడు వాల్మీకి. పుట్టుకతో హరిజనుడే, రామాయణ కర్త. ఈ చరిత్రను రామాయణంలో పేర్కొన్నవాడు.

14. అరుంధతికి అక్షమాల అనే పేరుంది. ఈ అక్షమాలలోని మాలే ఈనాటి మాల అయిందేమో ! మతంగ నుంచి వచ్చిన పేరు మాదిగ కావచ్చు.
15. రుంధతి అంటే మురికిగా వుండేది అని అర్థం. తపస్సు ద్వారా అరుంధతి అయింది.
16. మాతంగి వేరు, అరుంధతి వేరు. మాతంగికి చండాలి అనే పేరు కూడా వుంది. ఆమె కోసం మతంగుడు నిర్మించిన వీణ చాండాలిక.
17. వశిష్టుడ్ని పెళ్ళాడిన అరుంధతికి సంతానం చాలా వుంది. అందులో ముఖ్యుడు శక్తి మహర్షి. శక్తి భార్య మాల పిల్ల. అరుంధతి మేనకోడలు. పేరు అదృశ్యంతి. ఈమె కపిల మహర్షి కుమార్తె.
18. శక్తి, అదృశ్యంతిల కుమారుడు పరాశరుడు.
19. పరాశర సత్యవతుల కుమారుడు వ్యాసుడు.
20. వ్యాసుడి సంతానం ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు. భరత రాజవంశానికి వ్యాసుడు మూల పురుషుడు. ఈ పంచముల చరిత్రే పంచమ వేదం. మహాభారతం. వైదిక ధర్మ సమగ్ర చరిత్ర.
21. ధర్మ వ్యాధుడి వరాల ఫలితంగా వేదవ్యాసుడి వంశీకుడిగా పుట్టిన వాడ్ని నేను.
22. వ్యాస యుగ చతుష్కంగా పేర్కొనబడే నాలుగు యుగాల చరిత్ర నాది. ఈ నాలుగు యుగాల భారతీయ హైందవ ధర్మానికి ఆత్మ వ్యాసుడే. పరమాత్మ వ్యాసుడే. వ్యాస పరంగా వచ్చే యుగాన్ని పంచమ యుగం అంటున్నాము.
23. అందుకే నన్ను గురించి నేను వ్రాసుకున్నాను. అన్ని కులాల అందరి మేధావుల ప్రశంసలు పొందిన కవిత యిది....

"కృత యుగంలో ధర్మవ్యాధుడు బోయ
త్రేతా యుగంలో వాల్మీకి బోయ
ద్వాపర యుగంలో వ్యాసుడు బోయ
కలియుగంలో భీమన్న బోయ"

24. కృతయుగంలో మతంగ ధర్మవ్యాధులు హరిజన గిరిజన సమైక్యం మూలంగా పుట్టిన వంశవృక్షం నాది. శాఖోపశాఖలుగా పెరుగుతూ వచ్చిన ప్రధాన విభాగంలో సాహిత్య శాఖకు వాల్మీకి, వ్యాసుడు అఖండ జ్యోతులు. అదే వరుసలో ఒక చిన్న దీపాన్ని నేను.

25. ఒక పద్యంలో ఈ విషయం వివరించాను. "భీమన్న కావ్య కుసుమాలు" సంకలనంలో (1958) ఆ పద్యం ఉంది.

"వ్యాస వాల్మీకులే కవు లవని కెల్ల ;
కడమ వారు వారల పాద కమల గత మ
ధూళి సేవించి బ్రతుకు మధు వ్రతాలె ;
అందు కడ పంక్తి నొక పసికందు నేను !"

## కర్దముడి సంతాన వాహిని

1. కర్దముడి భార్య దేవహూతి.
2. దేవహూతి స్వాయంభువ మనువు కుమార్తె. ఇతడు తొలి ప్రజాపతి.
3. దేవహూతీ కర్దములకు తొమ్మండుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. కుమారుడి పేరు కపిలుడు. ఇతడే విశ్వ వేదాంతంలో అగ్రశ్రేణి సాంఖ్య దర్శనానికి కర్త.
4. కుమార్తెలలో–
    1. కళ: ఈమె మరీచి మహర్షి భార్య.
    2. అనసూయ: అత్రి మహర్షి భార్య, త్రిమూర్తులను పసిపాపలుగా మార్చిన మహా పతివ్రత.
    3. శ్రద్ధ: అంగీరసుని భార్య. ఆమె పుత్రికలు సినీవాలీ, కుహువు, రాక, అనుమతి. పుత్రులు – శల్యాం, ఇక్ష్వాకుడు, కవి మున్నగు వారు.
    4. హవిర్భువు: పులస్త్యుని భార్య.
    5. గతి: పులహుని భార్య. పంచజనుని తల్లి.
    6. క్రియ: క్రతువు భార్య.

7. ఖ్యాతి: బృహువు భార్య. దేవ దానవ యుద్ధాలలో దానవులకు రక్షణ కల్పించి, విష్ణువు చేత చంపబడింది. గమనించండి.
8. అరుంధతి: వశిష్ఠుని భార్య. వేదవ్యాసుడి ముత్తవ్వ. మొదట్లో ''రుంధతి''గా వుండి, తర్వాత తపస్సు వల్ల ''అరుంధతి'' అయ్యింది. తండ్రి వలెనే ఈమె కూడా చిన్నప్పుడు మురికి మురికిగా వుండేదన్న మాట.
9. శాంతి: అధర్వుని భార్య.
10. కపిల మహర్షి.

## ప్రతిభను పంచుకోవాలి

కవితా, వనితా, లతా ఈ మూడు పరసహాయం లేకుండా వికసించలేవు. జీవితానికి ఆనందం కలిగించే త్రిమూర్తులలో నే నొకడిని. నేనంటే కవిత. సహజంగా లలిత కళలలో దేనికైనా, ముఖ్యంగా కవితకు పరసహాయం అవసరం. నాకూ అంతేకదా!

నా పంచమస్వరం కావ్యం ప్రమాధి సంవత్సరంలో ప్రకటించబడవలసినట్టిది. అప్పుడది సాధ్యం కాక, ధర్మవ్యాధుడు నాటకాన్ని ప్రకటించాను. ఈ విక్రమ నామ సంవత్సరంలో కూడ పంచమ స్వరానికి సవోదయం అవుతుందో లేదో అనే అనుమానం వచ్చి, వేదవ్యాసుడు నాటకాన్ని ప్రెస్‌లో ఇచ్చాను.

పంచమ స్వరం ప్రస్తావన వచ్చిన ముహూర్తం ఎలాంటిదో మరి. ముహూర్తాల మీద నాకు నమ్మకం లేదు. నమ్మకం వున్న వాళ్ళకు అది సెంటిమెంటు. సెంటిమెంటు బలంగా వుంటే అది జీవితం మీద ప్రభావం చూపక మానదు.

వేద వ్యాసుడు ప్రెస్‌లో ఇచ్చిన తర్వాత, అనుకోని విధంగా విజయనగరం నుంచి ఫోను వచ్చింది. విజయనగరం అంటే తెలుగు జాతి సకల విద్యలకు చిరకాలంగా కేంద్రం. అట్టి విజయనగరంలో విజయ భావన అగ్రశ్రేణిలో సాహిత్య సేవ చేస్తున్న ఒక ప్రధాన సంస్థ. దాని కార్యదర్శి డాక్టర్ అయ్యల సోమయాజుల గోపాలరావు. ఆయన ఫోను చేసాడు.

విక్రమ నామ సంవత్సర ఉగాది నాడు నాకు సన్మానం చేయడానికి తీర్మానించు కొన్నారట. తప్పకుండా రావాలని విజ్ఞప్తి.

విక్రమ ఉగాది నాడు, అంటే 5-4-2000 నాడు.

# ఉత్తరాంధ్ర పర్యటన

నేను కొన్ని సంవత్సరాలుగా ఇల్లు కదలడం లేదు. సిటీలోని ప్రోగ్రామ్‌లకు కూడ తరచు వెళ్ళడం లేదు. కారణం ఆసక్తి లేక, ఓపిక లేక. ముసలివాణ్ణి కదా ! చివరి మెట్టు మీది శివుణ్ణి ! అయితే–

ఒక రోజున విజయనగరం నుంచి, విజయభావన సాహితీ సంస్థ నుంచి ఫోన్ వచ్చింది. ఆ సంస్థ సెక్రటరీ డా. ఆయ్యల సోమయాజుల గోపాలరావుగారు ఫోను చేశారు. ఏప్రియల్ 5వ తేదీన, విక్రమ ఉగాది నాడు విజయనగరంలో నాకు సన్మానం చేయడానికి తీర్మానించుకున్నారట. ఇద్దరకు రాకపోకలు. రసజ్ఞశేఖర కూరెళ్ళ వేంకటశాస్త్రి స్మారక పురస్కారం అందజేస్తారట. తప్పక రావాలని వారి విజ్ఞప్తి.

విజయనగరంలో, విజయనగర పండిత వదాన్యుల సన్మానం ఒక గొప్ప అదృష్టం కదా ! సరే అనేశాను. పోతే అక్కడే పోదాంలే అన్న ధీమా !

విజయభావన వారి సన్మానాలు, సత్కారాలు ఆ సాహితీ సమావేశాల వైభవాలు వర్ణనకు అందనివి. ఆ ప్రాంతాలకు ఎలాగూ వెళ్ళాను కాబట్టి గజపతి నగరంలో డా. మూర్తిగారి సాహితీ సన్మానం, విశాఖపట్టణంలో సాహితీ సాంస్కృతిక సంస్థల, సమాఖ్యల సన్మానాలు, ఆంధ్ర యూనివర్సిటీ వారి సన్మానం, కాపులుప్పాడలో అక్కడి సహ మిత్రుల ఆదరణ నిజంగా జన్మ ధన్యం అనిపించింది. నా వయసు గాని, అనాసక్తి గాని, శక్తి హీనత గాని ఆటంకం కాలేదు. అన్ని సమావేశాలలోనూ ఉత్సాహంగా పాల్గొన్నాను. నాతో పాటు మా ఆవిడ హైమవతి ఉంది. మాకు సహాయంగా వచ్చిన ఆర్య సోమయాజుల సావిత్రిగారు, వారి బాబాయి దైవజ్ఞ సుబ్బారావు గారు కూడ మాతోనే ఉన్నారు.

అన్నిటి కంటే ప్రధానమైంది ఈ కార్యక్రమా లన్నిటికి పత్రికలలో ఇవ్వబడిన ప్రచార సరళి. అన్ని పత్రికల వారు కూడ అద్భుతమైన కవరేజి ఇచ్చారు. పెద్ద పెద్ద శీర్షికలతో నా ఉద్దేశా లన్నిటినీ ప్రజల కందజేశారు. వారందరికీ నేను కృతజ్ఞతలు చెప్పుకోవలసి ఉంది.

ఇది ఒక గ్రంథానికి పీఠిక. ఇక్కడ వార్తా విలేఖనం కుదరదు. అయినా–

విజయ భావన సంస్థకు సంబంధించిన డా. గోపాల రావు, పి.వి.నరసింహ రాజులు (బుచ్చిబాబు), ఏ.యల్.ప్రసాదరావు మున్నగు మిత్రులకు, డా. మూర్తి గారికి, విశాఖకు

సంబంధించిన ఎమ్.వి.వి.యస్.మూర్తి (ఎం.పి.), డా. స్వామి, రాజ పాపయ్య (స్పందన), ఆచార్య ఆపదరావు, సి.హెచ్.శ్రీధర్ (ఆర్.డి.ఓ.), ఆర్.మల్లికార్జునరావు (జిల్లా సోషల్ వెల్‌ఫేర్ అధికారి), డా. జి. సుధాకర్ (అసిస్టెంటు ప్రొఫెసర్), కె.సురేశ్ ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రాధాకృష్ణగారు, రిజిష్ట్రారు నాయుడుగారు ఇంకా ఎందరో – ఈ అందరికీ నేను ఎంతగానో కృతజ్ఞుడ్ని.

గోదావరి ఏ.సి.లో వెళ్ళిన మేము, రెండు పోస్టుపోన్‌మెంట్ల తరువాత, యూనివర్సిటీ వారి ఔదార్యంతో తిరిగి విమానంలో ఇల్లు చేరాము.

**తొంబది యేండ్ల వాని కొక**
**ద్యోమణి రంభ నొసంగినారు ! భ**
**వ్యంబు లనూహ్యముల్ విజయ**
**భావన లీలలు ! చూతు నికనే**
**యంబుజ గర్భముల్ విరిసి**
**అంబర మంటునొ ప్రేమయాత్రలన్ ?**
**శంభుని కావ్య శేష నర**
**సం బొకటైనను చాలు దక్కినన్ !**

విజయ భావన వారు నాకిచ్చిన బిరుదుకు నా స్పందన. బిరుదు రంభ. శంభుని కావ్యశేషమంటే శంకరాచార్యుని చేతిలో నుంచి నందీశ్వరుడు లాగేసుకున్న సౌందర్యలహరి కావ్యభాగం.

## ఇంకా

జస్టిస్ కొత్తపల్లి పున్నయ్యగారు నాకు అపర భోజరాజు. జాతీయ స్థాయిలో ఎన్నో అధునాతన బాధ్యతలను నిర్వహిస్తూ తీరిక లేని తొందరలలో మునిగి వున్నప్పటికీ, నిరంతరం నన్ను పలుకరిస్తూ, నా మంచి చెడ్డలను గురించి పరామర్శిస్తూ వుండే ఆప్త మిత్రు డాయన.

నా సాహిత్య కృషిలో, ముఖ్యంగా ఈ గ్రంథానికి సంబంధించి ఎన్నో సలహా సహాయాలు అందించిన వాళ్లు మా అమ్మాయిలు విజయపల్లవి, విజయేందిరలు, మా ఆవిడ హైమవతి. నా శక్తి సామర్థ్యాలన్నిటికి బాధ్యులైన ఈ అందరికీ కృతజ్ఞతలేం చెపుతాం?

ఇక నాకు "ఊహ తెలియంగల లేఖక పాఠకోత్తముల్" కొందరున్నారు. అందులో ముఖ్యులు బంకా సుధాకరరావుగారు ఒకరు. ఆయన రిటైరైన ఐఏఎస్ అధికారి. నిర్దుష్టమైన భాష, నిర్దిష్టమైన భావాలు కల మేధావి. మరొకరు రత్నరాజు. ఈయన సిండికేట్ బ్యాంకులో అధికారి. నిరంతరంగా ఆధునిక సమస్యలపై ఆలోచనలుసాగించే భాషా కృషీవలుడాయన.

ఈ గ్రంథాన్ని ముద్రించిన రవిచంద్ర ఒక మంచి కళాకారుడు. నా కవితా కృషి పట్ల గొప్ప అభిమానమున్నవాడు. వీరితో బాటు నా ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి తగు సలహాలిస్తుండే డాక్టర్ రమేష్, డాక్టర్ రూతేంజిల్, మెడికో సుశీల్, అడ్వకేట్ గొల్లమందల రమేష్, సుమిత్ర పంపన వంటి వారందరికీ కృతజ్ఞతలు.

## సిగ్గుమాలిన వర్ణ బాహ్యత

హిందూ సమాజం లోని అస్పృశ్యతను గూర్చి ఎంతైనా చెప్పవచ్చు. ఎంత పరిశోధన అయినా చేయవచ్చు. అస్పృశ్యత ఎలా పుట్టింది ? ఎప్పుడు పుట్టింది ? అనే విషయంలో అనేక మంది మేధావులు తలొక విధంగానూ చెప్పారు. అసంగతమైన వాదనలు కూడా చేశారు. ఇప్పటికీ చేస్తున్నారు. దళితులలోని ప్రతిభా ప్రాభవాలను అణగద్రొక్కివేస్తున్నారు. వీటివల్ల ఫలితం ఏమిటి ?

నేను కూడా పదే పదే చెబుతూ వచ్చాను. మతంగుడు, అరుంధతి, వాల్మీకి, వేద వ్యాసుడు, కురు పాండవులు, ఈ పారంపర్యాన్ని వర్ణ బాహ్య మూల జనులుగా అభివర్ణిస్తూ ఎన్నో కావ్యాలు వ్రాశాను.

వర్ణాలు మొదట్లో వృత్తి పరమైనట్టివి కదా ? వ్యక్తులు తమ తమ శక్తిసామర్థ్యాలను బట్టి వృత్తులను మార్చుకోవచ్చు కదా ? అంటే ఆనాడు వర్ణాలు ప్రతిభను బట్టి మారుతూ వచ్చేవన్నమాట! అందుకే ఆనాటి వ్యవస్థను జ్ఞాన వ్యవస్థ అన్నాను.

వర్ణ బాహ్యుడుగా వెలివేయబడిన మొదటి వ్యక్తి మతంగుడు అస్పృశ్యుడు కాడు. ఈనాడు దళితులమని చెప్పుకుంటున్న హరిజనులు ఆనాడు వర్ణ బాహ్యులైనా అస్పృశ్యులు కాదు. హరిశ్చంద్రుని కాలం నాటి వీరబాహుడు, రంతి దేవుడి కాలంలోని పుల్కసుడు మొదలైన వాళ్ళు తరువాతి వేదవ్యాసుడి వరకు వర్ణబాహ్యులు అస్పృశ్యులు కారు. వర్ణ బాహ్యత వేరు, అస్పృశ్యత వేరు. వర్ణ బాహ్యత వెలి. అస్పృశ్యత పారిశుద్ధ్య సంబంధి.

## అంకితం గురించి

నాకు వున్నా లేక పోయినా, నా కావ్యాలకూ, పీఠికలకూ, అంకితాలకూ ఒక ఉజ్వలమైన చరిత్ర వుంది. కూలిరాజు నాటకాన్ని అప్పటి హరిజన మంత్రి వేముల కూర్మయ్యగారికి అంకిత మివ్వగా, పాలేరు నాటకాన్ని అప్పటి అగ్రశ్రేణి హరిజన నాయకుడైన కోనాడ సూర్యప్రకాశ రావుగారికి అంకితమిచ్చాను. అవి జంట నాటకాలు. నా నాటకాలు, కావ్యాలు చాల వరకు జంటలుగానే వుంటున్నై.

ఇపుడు ధర్మవ్యాధుడు, వేదవ్యాసుడు ఇవి జంట నాటకాలు. ధర్మవ్యాధుడు నాటకాన్ని ఒక మహిళకు అంకితమిచ్చాను. ఆవిడ అగ్రశ్రేణి రచయిత వాసిరెడ్డి సీతాదేవి గారు. ఇపుడీ వేదవ్యాసుడు నాటకాన్ని మరొక మహిళకు అంకిత మివ్వాలనేది నా ఆకాంక్ష. అందుకు ఎక్కువగా వెదకవలసిన అవసరం కూడా లేకపోయింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకరు కావలి ప్రతిభా భారతిగారు స్పష్టంగా, సార్వకాలిక సుప్రభాతం వలె ప్రకాశిస్తూ కనిపిస్తున్నది. ఆవిడకు ఈ వేదవ్యాసుడు రచనను సమర్పించు కుంటున్నాను.

కావలి ప్రతిభా భారతి అంటే జస్టిస్ కొత్తపల్లి పున్నయ్యగారి కుమార్తె. అంటే ఇక చెప్పేదేముంది. ఉదయ సూర్యుణ్ణి చూపుతూ, సూర్య నమస్కారాలు చేయవలసిందే తప్ప, ఆలోచనకు తావెక్కడిది ?

జాతీయోద్యమంలో, స్వాతంత్ర్య సమరాంగణంలో పున్నయ్యగారిది అగ్రశ్రేణి చరిత్ర. హరిజనోద్ధరణ కృషీ క్షేత్రంలో విద్యార్థి నాయకుడుగా ఉత్తరాంధ్రలో ప్రధాన పాత్ర వహించిన నాటి నుంచి, న్యాయవాదిగా, ఆంధ్ర యూనివర్శిటీ సెనేటు సభ్యుడిగా,

రాష్ట్ర కాంగ్రెసు కార్యనిర్వహకుడుగా, శాసన సభ్యుడుగా, జిల్లా జడ్జిగా, హైకోర్టు న్యాయమూర్తిగా ప్రసిద్ధు డయినవాడు ఆయన. హరిజన సంక్షేమానికి అగ్రశ్రేణి నేత ఆయన. ప్రస్తుతం దళిత జనం మీద సవర్ణ దొరల అత్యాచారాలను గురించి పరిశోధించి, నివేదించడం కోసం ప్రభుత్వంచే ఏక సభ్య కమిషన్‌గా నియమించబడ్డారు. కేంద్ర ప్రభుత్వం వారి రాజ్యాంగ సమీక్షా సంఘంలో ప్రధాన సభ్యుడు.

అట్టి మహా వ్యక్తి కుమార్తె ప్రతిభా భారతి. కావలి కృష్ణప్రసాద్‌గారి సతీమణి. గ్రీష్మ, అభిషేక్‌ల మాతృదేవి.

ఉన్నత విద్యావతిగా విద్యార్థి నాయకురాలిగా ప్రతిభా ప్రాభవాలను ప్రదర్శించి, తర్వాత తెలుగుదేశం పార్టీ నాయకురాలై శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నుంచి రాష్ట్ర శాసన సభకు ఎన్నుకోబడ్డారు. జాతివంణి ఆమె. అప్పటి నుంచి అవిచ్ఛిన్నంగా ఎన్నుకోబడుతూ, చాలా కాలం మంత్రిగా వుండి, ప్రస్తుతం శాసన సభకే స్పీకరు హోదాను చేపట్టి ప్రచండ శక్తితో కార్యనిర్వహణ సాగిస్తున్న చైతన్య భారతి ఆమె. నా కావ్య స్వీకర్త్రిగా ఆవిడను ఏక పక్షంగా నిర్ణయించుకున్నాను నేను. కృతి సమర్పణ చేస్తున్నాను.

ఇప్పుడు జరుగుతున్న వ్యాస యుగ చతుష్కంలోని భారతీయ సాంఘిక వ్యవస్థలో ఒక శాఖ యొక్క చరిత్ర ఇది. ఈ చరిత్రనే పంచమ యుగం అంటున్నాను.

## సమగ్ర ప్రార్థన

ఆంగికం భువనం యస్య
వాచికం సర్వ వాఙ్మయం
ఆహార్యం చంద్ర తారాది
తం వందే సాత్వికం శివం.

నా విజయనగర యాత్రలో ప్రతి సభలోను నా ప్రసంగాన్ని ఇదే శ్లోకంతో ప్రారంభించాను నేను.

శివుడంటే పరమవిశ్రాంతి స్థానం, సమాధి స్థితి, పరబ్రహ్మ. సచ్చిదానంద ధామద్వారం శివ శబ్దం. సర్వ ప్రపంచానికీ, సర్వజాతులకూ, సర్వ మతాల ప్రజలకూ పనికి వచ్చే ఏకైక సర్వ సమగ్ర వైజ్ఞానిక ఆధ్యాత్మిక ప్రార్థన శ్లోకం ఇది.

నేటి హైందవ సమాజం వైదిక జ్ఞాన సమాజంగా వుండిన ప్రాచీనకాలంలో, సుమారుగా కళావాఙ్మయాలు ఆవిర్భవించిన ఆదికాలంలో పుట్టిన ఏకేశ్వర భావం ఇది. ఇంతటి సమగ్రసుందరమైన శ్లోకం ఈనాడు దాని జన్మస్థలంలోనే ఉపేక్షించ బడిందంటే, కేవలం నాట్యరంగానికి మాత్రమే పరిమితమై పోయిందంటే ఏమనాలి ? లోపం ఎక్కడుందనాలి? మానవ సమాజం పురోగమిస్తున్నదనాలా, శిథిలమైపోతున్నదనాలా?

శిథిలమై పోతుండడం స్పష్టంగానే కనిపిస్తున్నది. ఈ పాతిత్యానికి కారణం ఆధ్యాత్మిక తత్వాన్ని రాజకీయం చేసి స్వార్థానికి ఉపయోగించుకోవడం మొదలుపెట్టిన వివిధ మతాలు, వివిధ సామాజిక వ్యవస్థల ఆచారాలూను.

జీవిత పురోగమనం ఆయా వ్యక్తుల చేతుల్లో లేకపోవడం వలన, దైవ స్వరూపం ఎవరికీ తెలియకపోవడం వలన, సామాన్య జనానికి ఆధ్యాత్మిక తత్వాలోచనలకు తీరిక లేకపోవడం వలన ఎవరో కొందరు డాంబికులు చెప్పిన మాటలనే నమ్మడం తప్పదు. వివిధ బుద్ధి జీవుల స్వప్రయోజక ప్రవచనాలను నమ్మిన వివిధ జాతులు (దేశాలు) ప్రజలు సన్నిహితులయ్యే కొలదీ పరస్పరం ఘర్షించుకోవడం మొదలు పెట్టి వైర మతాలుగా శత్రు జాతులుగా తయారయ్యారు. ఈ శత్రు సమరక్షేత్రంలో బలవంతులు విజృంభించగా శాంతి కాముకులు ఓడిపోతూ బానిసలైనారు, కొన్ని వర్గాలు (జాతులు) నశించి పోయాయి కూడా. నశించిపోక పోయినా, బానిసలైపోయిన జాతులలో హైందవ జాతి ఒకటి.

''కృణ్వంతో విశ్వమార్యం'', ప్రపంచాన్ని ఆర్య (వ్యవసాయ) జాతిగా మార్చండి అని ప్రబోధించిన ఋగ్వేదాన్ని అలక్ష్యం చేసి ''సమానమస్తు వో మనో'', మానవులారా సమానులై జీవించండి అనే వేద ప్రవచనాన్ని ప్రక్కకు నెట్టిన జాతి, ''అహం బ్రహ్మాస్మి'' అన్న సార్వకాలిక ధర్మాన్ని తిరస్కరించిన జాతి, ''ఆంగికం భువనం యస్య'' అన్న ఉత్తమోత్తమ ప్రార్థనను విస్మరించిన జాతి, ''సర్వ ధర్మాన్ పరిత్యజ్య'' అన్న భగవద్గీతనే తప్పుదారి పట్టించిన జాతి పతనం కాక మరి ఏమవుతుంది ?

జ్ఞాన ప్రధానమైన వర్ణ (వృత్తి) వ్యవస్థ జన్మ ప్రధానమైన కఠిన కుల వ్యవస్థగా, వైదిక సోషలిస్టు సామాజిక వ్యవస్థ దుష్టస్వార్థ స్వప్రయోజక వర్ణ వ్యవస్థగా ఎలా మారింది? ఎందుకు మారింది ? ఎవరు మార్చారు ? ఈ ప్రశ్నలకు జవాబేమిటి ? ఆలోచిస్తున్నారా?

కుల వ్యవస్థ పోవడానికి అగ్ర కులాల వాళ్లు అంగీకరించరు. పీడిత కులాల వాళ్లకు ప్రశ్నించే జ్ఞానాన్ని కాని, తిరగబడే శక్తిని కాని కలగచేయరు. ఏమిటి దీనికి పరిష్కారం? ఆధునిక రచయితలు కూడా వేద వ్యాసుడ్ని గురించి చెపుతున్నప్పుడు వశిష్టుడి ముని మనుమడు అంటున్నారే తప్ప, అరుంధతి పేరైనా ఎత్తడం లేదే !

మతంగుడు, ధర్మ వ్యాధుడు దగ్గర నుంచి వాల్మీకి, అరుంధతి, పరాశరుడు, కృష్ణ ద్వైపాయనుడు, కర్దముడు, కపిల మహర్షి, నారదుడు తుదకు కాళిదాసు వరకూ కూడా నిమ్న కులాలకు చెందిన వాళ్ళే అనే సత్యాన్ని ప్రకటించడం లేదే ! ఎందుకు ప్రకటించడం లేదు ? వాస్తవాలను ఎందుకు దాచిపెడుతున్నారు?

నా జవాబు ఒక్కటే! అట్టి రచయిత లందరూ స్వప్రయోజనాలను వదులుకోలేని దొరల సంతతికి చెందిన వాళ్ళు కనుక.

## రిజర్వేషనులు పత్యం మెతుకులు

దళిత జనుల అభివృద్ధి కొరకు పోరాడిన డాక్టర్ అంబేద్కర్ సైతం సాంఘిక న్యాయ సాధనకు రిజర్వేషనులు ఒక్కటే మార్గం కాదన్నాడు. బౌద్ధులు కూడా హిందు మతస్థులే అంటూ పేర్కొన్న ఆయన, తాను హిందూమతం నుంచి బౌద్ధ మతంలోకి మారాడు. అది రాజకీయం. ఆధునిక భారతీయ సమాజంలో అది కేవలం బెదిరింపు.

అంత మాత్రం చేతనే దళిత జనోద్ధరణ జరగదని ఆయనకు బాగా తెలుసు. ఇందుకు అనేక మార్గాలు సూచించాడు. స్టేట్ సోషలిజం అన్నాడు. అయినా, వ్యాధి నిజ నిర్ధారణ జరగలేదు, వేరు పురుగును ఎవరూ పట్టలేదు. శాశ్వత పరిష్కారం పై వర్గాలకు తెలిసినా, అందుకు వారు పూనుకోరు. పూనుకోగల దళిత వర్గాలకు అంతటి తెలివి లేదు, ఉన్నవాళ్లు బలవంతులు కాదు.

నేను [illegible] (హైందవ) సమస్య లన్నిటికీ మూల పరిష్కారం నేను చెపుతున్నాను. పౌరాణిక వస్తువును ఆధారంగా తీసుకొని నేను వ్రాసిన నాటకాలన్నీ దళిత జనుల మూల బలం ఏమిటో ఎత్తి చూపేవే. వీళ్లను బలవంతులను చేసేవే.

ధర్మవ్యాధుడు నాటకం మతంగుడితో ముడిపడి వుంది. ఈ ఇద్దరిలో ధర్మవ్యాధుడు ఎస్.టి., మతంగుడు ఎస్.సి... ఈ వేదవ్యాసుడు నాటకం అరుంధతి, మత్స్యగంధి, కృష్ణ ద్వైపాయనులతో ముడిపడి వుంది. ఇందులో అరుంధతి ఎస్.సి., మత్స్యగంధి బి.సి., వ్యాసుడు ఎస్.సి. మొత్తం మీద ఈ జంట నాటకాలు ఎస్టీ, ఎస్సీ, బిసీ వర్గాల మూలాన్ని ప్రకటిస్తున్నట్టివి.

ఇందులో ధర్మవ్యాధుడు నాటకాన్ని ఒక అగ్రస్థాయి రచయిత్రికి వాసిరెడ్డి సీతాదేవిగారికి అంకిత మిచ్చాను. ఈ వేద వ్యాసుడు నాటకాన్ని ఒక అగ్రస్థాయి ప్రజాధినేత్రికి కావలి ప్రతిభా భారతిగారికి అంకిత మిస్తున్నాను.

పాలేరు, కూలిరాజు నాటకాల వలెనే ధర్మవ్యాధుడు, వేద వ్యాసుడు నాటకాలు సర్వజన పురోగమన సముద్బోధకాలు. సర్వేజన సుఖినోభవంతులు. భారత జాతి సమైక్యతకు, సర్వతోముఖ వికాసానికి సర్వార్థ సాధకాలు.

## తుది మాట

చివరిగా నేను చెపుతున్న దేమిటంటే-

1. వేదకాలం నాటి ఆర్య మతం జ్ఞాన ప్రధాన మైనట్టిది. దేవ రాక్షస గణాల మధ్య జరిగిన యుద్ధాలు ముగియడంతో ఈ జ్ఞానమతం కూడా శిథిలమై అంతమయ్యింది.
2. ఆ తర్వాత పునరుద్ధరించబడిన హిందూమతం జన్మ ప్రధానమైనట్టిది. నాటిది వర్ణ వ్యవస్థ కాదు, కుల వ్యవస్థ.
3. ఆనాటి జ్ఞాన వ్యవస్థకు పుట్టుకతో సంబంధం లేదు. వ్యాసాదులతో సహా వేద ఋషు లందరూ ఎక్కడెక్కడో పుట్టి బ్రహ్మజ్ఞానులైన వాళ్ళే.
4. ఈనాటి కుల వ్యవస్థలో జన్మకే ప్రాధాన్యం. పుట్టుకకే గుర్తింపు. జ్ఞానానికి కాదు. అగ్ర నాయక దౌష్ట్యానికి, మానవతా ఔన్నత్యానికి, ఈ వ్యవస్థ అతి నికృష్ట స్థాయి.
5. కనుక ఇప్పుడు నా ప్రతిపాదన ఏమిటంటే "తిరిగి వేద వ్యవస్థ లోకి వెళదాం" అనేది. Go back to vedas అనేది చిరకాలంగా నా నినాదం.

6. వేద కాలపు సామాజిక వ్యవస్థ "సమానమస్తు వో మనో" అనే సూత్రం ప్రాతిపదిక అయినట్టిది. అది స్వచ్ఛమైన సోషలిస్టు వ్యవస్థ. శక్తినిబట్టి పని, అవసరాన్ని బట్టి ఆహారం.
7. దీనినే నేను "జాతీయ సోషలిజం" అంటున్నాను.
8. ఆర్య మంగోలు మిశ్రమ జాతి తురుష్కులు ఇస్లాం మతం స్వీకరించి, మతాన్ని కత్తితో ముందుకు నడిపించే ఉద్యమాన్ని చేపట్టి, భారత్‌ను చావగొట్టి ఆక్రమించుకున్నారు.

   క్రీస్తు శకం 700 సంవత్సరం నాటికి ఆఫ్ఘనిస్తాన్ భారత్‌లో భాగంగా ఉండేది. ఆఫ్ఘని స్థానం, కాశ్మీరు చిరకాలంగా క్షత్రియ రాజుల పాలనలో ఉండేవి.
9. అరబ్బులు సింధును, గజనీ తురుష్కులు పంజాబును, గోరీ, బాబరీ తురుష్కులు మిగిలిన భారత్‌ను ఎలా జయించగలిగారు ? దేశంలో ఆనాటి పరిస్థితే ఈనాడు కూడా లేదా ? దీనిని సరిదిద్దవలసిన బాధ్యత మనకు లేదా !
10. The Turkish conquest gave a rude shock to the caste system and the idea of physical pollution among the people of India.

    The result was that those people of India who suffered under the caste system, became the supporters of the new rulers (Muslims). *(Vidyadhar Mahajan, "HISTORY OF INDIA". Page : 85)*
11. భారతీయ సమాజంపై చరిత్ర చేస్తున్న ఈ నిందకు ఏమిటి జవాబు? జవాబు ఒక్కటే నా కులం మార్పిడి చట్టం.

    తస్మాత్, ఉత్తిష్ఠ ! ఉత్తిష్ఠ !!

–భీమన్న

❋ ❋ ❋

## పాత్రలు

| | | |
|---|---|---|
| 1. వ్యాసుడు | : | వేదవ్యాస మహర్షి |
| 2. పరాశరుడు | : | వ్యాసుడి తండ్రి, దివ్యశక్తులు గల పరమర్షి |
| 3. సత్యవతి | : | దాశరాజు పుత్రిక, వ్యాసుని తల్లి |
| 4. భీష్ముడు | : | మహాభారత కథా పితామహుడు |
| 5. ఘృతాచి | : | అంబిక చెలికత్తె, విదురుని తల్లి. తర్వాత శ్రీశుకుని తల్లి |
| 6. పైలుడు | : | వ్యాసుడి శిష్యుడు |
| 7. జైమిని | : | వ్యాసుడి శిష్యుడు |
| 8. వైశంపాయనుడు | : | వ్యాసుడి శిష్యుడు |
| 9. సుమంతుడు | : | వ్యాసుడి శిష్యుడు |
| 10. రోమహర్షణుడు | : | వ్యాసుడి శిష్యుడు |
| 11. నారదుడు | : | దేవర్షి |
| 12. బ్రహ్మ | : | చతుర్ముఖ బ్రహ్మ |
| 13. శ్రీశుకుడు | : | వ్యాసుడి పుత్రుడు |
| 14. రంభ | : | అప్సరస |
| 15. కథకుడు | : | దృశ్యానికీ దృశ్యానికీ మధ్య జరిగిన, లేక జరుగు తున్న కథను తెర వెనుక నుంచి వివరించే స్త్రీ లేక పురుషుడు. ఈ వివరణ మైకు ద్వారా జరగడం ఉత్తమం. |

16. ధూపదృశ్యాలు : రంగంలో సాంబ్రాణి ధూపం వ్యాపించి వుండేవి ధూపదృశ్యాలు. లోనుంచి కథకుడు కథ చెప్పు తున్నపుడు ఈ ధూపం వ్యాపించి కథకుడు ఆగినప్పుడు ఆగిపోతాంది. ధూపం వ్యాపించి వున్నప్పుడు – కథకుని కథ ననుసరించి – అదనంగా ఏ పాత్రల నైనా ప్రవేశపెట్టవచ్చు. అవి మాట్లాడకుండా నటించిపోతై.

# వేదవ్యాసుడు

## అంకం ఒకటి

*(యమునా నది రేవు దృశ్యం తత్సంబంధం. నదిలో ఒడ్డున నావ. నావలో ఒక పల్లె పిల్ల. అప్పుడే విచ్చిన గులాబి మొగ్గలా వుంది. శరీరం పై ఎక్కువ దుస్తులు లేవు. పదును పెట్టిన కామబాణంలా వుంది. లోకలోకాల సమస్త దివ్య సౌందర్యాలూ ఆమెలో సమీకృతాలైనై. ఆమె నావ తట్టుపై కూర్చుని, యాత్రికుల కోసం ఎదురు చూస్తున్నది.)*

**కథకుడు** : ఆమె సత్యవతి. దాశరాజు కూతురు. యమునా నదిలో నావ నడుపుతూ, యాత్రికులను రేవు దాటించే పని ఆమెది. ఈనాడు ఎందువల్లనో ఒక్క ప్రయాణీకుడు కూడ ఆ దారికి రాలేదు. తిధి వార నక్షత్రాలలో ఒక్కటి కూడ ప్రయాణాను కూలంగా లేదేమో ! లేక అవన్నీ కలిసి, ఎక్కడైనా పండుగ చేసుకొంటున్నవో యేమో ! ఆమె నావలో కూర్చుని, విశ్రాంతిగా పాడుకొంటున్నది.

(నావలో కూర్చున్న సత్యవతి లేచి నిలబడి, దిక్కులు చూస్తూ, పాడుకోసాగింది.)

**సత్యవతి** : (పాట)

రండోయి, రండోయి
రమ్యోర్వీ పర్యటకులారా !
శుక పిక శారీ సుస్మిత రశ్ములు
సుప్రభాతములు పాడే నోయి ! ॥రం॥

రేయి పగిలీ, వాయి పెగిలీ,
రేవుకు చేరే జీవన శీలి !
మోవి విరిసిందోయి !
నావ కదిలిందోయి ! ॥రం॥
ప్రజ్ఞా పరులై పని తీరాలకు
పలు బాటలలో పయనమైన ఓ
ఏకానన చతురాననులారా !
లోకాలోకన లోచన మిదిగో ॥రం॥
సరదాగా దేశాటన చేసే
సౌందర్యోపాసకులారా !
మౌనులారా ! మా యమునాద్వీపం
మానవతోదయ గతి దీపం ! ॥రం॥

(ఆమె అప్పుడప్పుడు పాడుకొంటూ, నావ దిగి వస్తూ ఉంటుంది. రేవులో రకరకాల బాటసారులు ఇటూ అటూ కదులుతూ వుంటారు. ఆమె మాత్రం ఎవరిని పట్టించుకోదు)

కథకుడు : అట్టి సమయంలో పరాశర మహర్షి ఆ రేవుకు వచ్చాడు. వేడుక కోసం విశ్వ పర్యటన చేస్తున్న తరుణర్షి అతడు. అదృశ్యంతీ శక్తి మహర్షుల పుత్రుడు. అరుంధతీ వశిష్ఠుల పౌత్రుడు. పరమ దార్శనికుడు. అద్భుతమైన శక్తులు కలవాడు.

(అప్పటికే పరాశరుడు రంగంలో ప్రవేశించి, నావలోకి ఎక్కి కూర్చున్నాడు. అతన్ని చూస్తూనే సత్యవతి కంగారు పడింది. తన శరీరాన్ని చూచుకొని సిగ్గుపడింది. అతడు తన వంక చూడనే లేదు. ఆమె ప్రకంపనంతోనే ఒడ్డుకు దిగి, నావను త్రోచి, ఎక్కి చుక్కాని తీసుకొన్నది. నావ కదిలింది.)

పరాశరుడు : నీపాట విని, దాని కోసం వచ్చాను, కన్యామణీ ! ఏదీ, పాడు!

సత్యవతి : (తడబాటుతో) నా పాట కోసమా ?

పరాశరుడు : అవును నీ పాట కోసమే. అది నన్ను ఆహ్వానించింది. త్రికూట శిఖరంపై నిల్చి వినోదిస్తున్న నన్ను ఆకర్షించింది ! ఆనందంలో ముంచింది. అలానే మునిగి వుండనీ నన్ను ! నీవు పాట కొనసాగించు.

సత్యవతి : (సంతోషంతో, లజ్జావతియై) మీరు పండితులైన మహర్షులు, నాది వట్టి పల్లె పాట !

పరాశరుడు : పాండిత్యానికేంలే ! నా పాండిత్యమంతా ఒక టెంకాయ ! నీ పాట ద్రాక్ష పండు !

సత్యవతి : టెంకాయ ! బాగుంది! (నవ్వుతూ)

టెంకాయ ! (మరీ నవ్వుతుంది)

పరాశరుడు : (చిరునవ్వుతో కళ్ళెత్తి, ఆమె కళ్ళల్లోకి చూచి) అవును ! టెంకాయే ! దాని పీచు ఇదిగో ! (గడ్డాన్ని సవరించుకుంటాడు)

సత్యవతి : పీచు! టెంకాయ పీచు ! (విరగబడి నవ్వుతుంది. నవ్వులో నావ చుక్కాని జారిపోయి, నదిలో పడిపోతుంది) అమ్మో ! చుక్కాని ! (దానికోసం నదిలోకి దూకుతుంది.)

పరాశరుడు : (కంగారుగా) అరె ! (తాను కూడా నదిలోకి దూకుతాడు. ఇద్దరు కలసి చుక్కానిని పట్టుకుంటారు. నావ ఎక్కుతారు. ఆమె ఇప్పుడు నిజంగానే సిగ్గు పడుతూ, పెడ మొగంగా నిలబడింది. అతడు ఆమె వంక చూడకుండా వుండలేక పోతున్నాడు.)

సత్యవతి : మీరు గొప్ప గజ ఈతగాడిలా వున్నారే ! మీరు రాకపోతే నేను ఆ కెరటంలో కొట్టుకొని పోయి వుందును !

పరాశరుడు : అది వట్టి మర్యాద మాటలే ! కాని – చుక్కాని నేను పడతాను. నీవు దుస్తులు ఆరబెట్టుకో ! (చుక్కాని తాను పుచ్చు కుంటాడు)

సత్యవతి : (అనుమానంతో చూస్తూ) కాని –

పరాశరుడు : (నవ్వుతూ) నన్ను అనుమానిస్తున్నావా, దేవీ ? నీకేసి నేను చూడనే చూడను. చర్మ చక్షువులతో శరీరాన్ని చూచే దేమిటి ? ఆత్మ చక్షువుకు అందని అందా లెక్కడున్నై ? నీ ఎడమ తొడలో పుట్టుమచ్చ, నీ వామ వక్షోజంపై –

సత్యవతి : (విభ్రమంతో) చాలు, ఆపండి ! మీరు కేవలం మానవ మాత్రులు కాదన్న సత్యాన్ని నేను గుర్తించక పోలేదు !

పరాశరుడు : అందుకే నీవు సత్యవతివి ! (ఈ లోపల సత్యవతి తడిసిన తన దుస్తులు ఆరబెట్టుకొంటూ, పలుచని వోణి తరంగాల గాలికి రెపరెపలాడుతూ తాళం వేయగా, పాట పాడసాగింది.

సత్యవతి : తళ తళ విరిసే తరగల్లారా !
మిల మిల మెరిసే మీనుల్లారా !
గుంపులు కూడే రెందుకే?
గుస గుస లాడే రేమిటే ?
అదియే యమున ! అదియే నావ !
రేవుకు వచ్చే రెంద రెందరో !
క్రొత్త ఏమిటే ఈ వేళ ?
గుండెలలో ఈ గుబులేల ?
ఎండలు కాసే ఇనుదే నేడీ
వెన్నెల కురిసే విధమేమో !

చెప్పరాదటే, చిరుమారుతమా
సిగ్గుల మొగ్గల సిరులేమో ?

*(పాట వింటూ, పరవశుడైన పరాశరుడు చుక్కాని తీసి ఒడిలో పెట్టుకొని, దానిపై తాళం మీట సాగాడు. నావ దాని దారిని అది పోతూ ఉంది. అతడి పారవశ్యాన్ని క్రీగంట చూస్తూ, తాను కూడ పరవశిల్లి నావ వంక చూసింది. అతడి వంక చూచింది.)*

సత్యవతి : (చుక్కానిని పట్టి కుదుపుతూ) అయ్యో ! నావ !

పరాశరుడు : (కళ్ళు తెరవకుండానే) ఓహో, సారస్వత లక్ష్మి !

సత్యవతి : మీ మెప్పుకు ధన్యవాదాలు. కాని, నావ ! అయ్యో! ఇదేదో లంకకు కొట్టుకొంటోంది !

పరాశరుడు : (లేచి, చుట్టూ తేరి చూచి) ఇప్పుడెలా ?

*(అంతలో నావ ఒడ్డుకు తగిలి, పెద్ద కుదుపు కుదిపింది. ఆమె తూలి అతడిపై పడింది. ఇద్దరూ నవ్వుకొన్నారు.)*

సత్యవతి : ఇప్పుడెలా ?

పరాశరుడు : అదే మరి, ఎలా ? పోనీలే, ఏం చేస్తాం ? కాసేపు ఈ లంకలో విహరించి పోదాం !

సత్యవతి : (భయంగా) మీతోనా ?

పరాశరుడు : మరింకెవరితో ?

సత్యవతి : వద్దు, వద్దు ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు ?

పరాశరుడు : ఏమి అనుకోరు. మహా అనుకుంటే - పరాశర మహర్షి పెళ్ళాడా డనుకుంటారు.

సత్యవతి : మరి మనం పెళ్ళాడలేదుగా ?

పరాశరుడు : ఇప్పుడాడదాం !

సత్యవతి : అందుకు మా తండ్రి అనుమతి అవసరం కదా !

పరాశరుడు : తాత్కాలికపు పెళ్ళికి ఎవరి అనుమతీ అక్కరలేదు. అంతరాత్మ అంగీకరిస్తే చాలు.

సత్యవతి : తాత్కాలికపు పెళ్ళా? దానివల్ల నా కన్యాత్వం దూషితమై పోదా? అందుకు నే నంగీకరించను.

పరాశరుడు : మనం యాదృచ్ఛికంగా కలుసుకున్నాం. మన మనస్సులు కలిసినై. శరీరాలు కలువగోరుతున్నై. ఇప్పుడు తాత్కాలికపు పెళ్ళికంటె గత్యంతరం ఏముంది ? నేను శాపానుగ్రహశక్తి కల మహర్షిని. నీ కన్యాత్వం చెడకుండా వరం ఇస్తున్నాను. సరేనా? (చేయి పట్టుకుంటాడు)

సత్యవతి : (మెల్లగా చేతిని విడిపించుకుంటూ) నేను మత్స్యగంధిని. నా శరీరం నీచు వాసన.

పరాశరుడు : నీ శరీరం పద్మగంధంతో పరిమళించేటట్టు వరం ఇస్తున్నాను. నేటి నుంచీ నీవు యోజన గంధివి ! (సత్యవతి ఆశ్చర్యపడింది. ఆమె శరీరం పద్మం వలె పరిమళించ సాగింది.)

సత్యవతి : (ప్రసన్నంగా) మీ శక్తి అద్భుత మయిందే !

పరాశరుడు : (చిరునవ్వుతో, ఆమె చేతిని చేతిలోకి తీసుకొని, లంకలోకి నడుస్తూ) చూడు ! ఈ యమునా ద్వీపం ఎంత ఆనందంతో మనకు స్వాగత మిస్తున్నదో ! బ్రహ్మానంద ప్రతిబింబమే రసానందం కదా ! ఇలకు బ్రహ్మానందమే రసానందముగ ప్రతి ఫలించుచు నుందు ప్రణయ దర్పణమందు ప్రణయమే ప్రణవమై ప్రవహించు యమునలో ఏడైన ఆనంద వేదపద్యం మేనే, చెలీ !

(ఆమెను కౌగిలిలోకి తీసుకుంటాడు. ఆమె సిగ్గుపడి, కౌగిలి నుంచి తప్పు కొంటుంది.)

సత్యవతి : ఇంత పట్ట పగలా? ఈ యమున ! ఈ దిక్కులు ! ఆ సూర్యుడు -

పరాశరుడు : (అన్నిటి వంకా చూస్తూ) అవును అయితే యేం ? పోనీ - సరే - ఇదిగో, చీకటి కల్పిస్తున్నాను !

(హఠాత్తుగా రంగం అంధకారమై పోతుంది. రంగంలో మాటలు వినిపిస్తాయి. వ్యక్తులు కనిపించరు. ఒక్క క్షణం నిశ్శబ్దం తర్వాత -)

సత్యవతి : ధన్యురాలను ప్రభూ !

పరాశరుడు : ఎంత రసమయివి ! ఎంత ఆనందమయివి !

సత్యవతి : కృతజ్ఞతగా మీకే మివ్వను ?

పరాశరుడు : ఇంకే మివ్వాలి ?

సత్యవతి : ఈ ఆనంద పారవశ్యంలో, ఏమిటో ఈ సుఖభారం !

పరాశరుడు : నీవు సద్యోగర్భిణి వయావు, ప్రియా ! ఇదుగో, అబ్బాయి ! మన అబ్బాయి !

(సరిగ్గా అప్పుడు, లోపలి నుంచి కథకుడు ఆశీర్వచనం చదువుతాడు)

కథకుడు :

ఓం వ్యాసాయ విష్ణు రూపాయ
వ్యాస రూపాయ విష్ణవే
నమో వై బ్రహ్మ విదయే
వాశిష్ఠాయ నమో నమః
కవిర్మ నీ షీ పరిభూః

స్వయం భూర్ యధాతథ్య
తోర్ధాన్ ! వ్యదధా
చ్ఛాశ్వతీభ్యః సమాభ్య ః

సత్యవతి : ఓహో ! ఎంత చిత్రం ! అబ్బాయి ఎంతలో పెద్దవాడై నాడు !

*(అప్పుడు రంగంలోకి కొంచెం కొంచెంగా వెలుగు ప్రసరిస్తుంది. సత్యవతి, పరాశరుడు, వారి ముందు పన్నెండేండ్ల బాలుడైన వ్యాసుడు – నిలబడి వున్నారు. వ్యాసుడు దివ్యమైన దండ కమండలములు ధరించి వున్నాడు. కృష్ణ వర్ణ తరుణ ఋషి అతడు. ఇంకా కళ్ళు తెరవలేదు. రంగంలోని చీకటి పూర్తిగా పోయింది. బాగా వెలుగు వచ్చింది.)*

వ్యాసుడు : (మెల్లగా కళ్ళు తెరచి, చుట్టూ చూచి, ఆశ్చర్యం ప్రకటించి, తల్లి దండ్రుల్ని తిలకించి, నమస్కరిస్తూ) అమ్మా ! నాన్న !

ఇద్దరు : (అత్యంత ప్రీతితో) కుమారా !

వ్యాసుడు : నా పేరేమిటి ?

సత్యవతి : పారాశరి !

పరాశరుడు : సాత్యవతేయుడు !

ఇద్దరు : కృష్ణ ద్వైపాయనుడు !

వ్యాసుడు : (ఆలోచించి, తల ఊపి) సరే, ఇక నన్ను ఆశీర్వదించండి !

ఇద్దరు : భగవానుడవు కా, తండ్రీ !

వ్యాసుడు : ఇక నేను తపస్సుకు పోతున్నాను. అమ్మా ! నీ వెప్పుడు తలచుకుంటే

అప్పుడు వచ్చి, నీవు చెప్పిన పని చేసి పెడతాను. నాన్నా ! సెలవు !

(వ్యాసుడు ఇద్దరికీ పాదాభివందనం చేసి, నిష్క్రమిస్తాడు. సత్యవతీ కళ్లలో కన్నీరు నిండుతుంది. పరాశరుడు చిరునవ్వు నవ్వుతాడు.)

**పరాశరుడు** : (ఆమె కన్నీటిని తుడుస్తూ) ప్రియా ! ఎంత ధన్యురాలవు !

**సత్యవతి** : (పెద్ద నిట్టూర్పుతో) ఎంతలో ఎంతవాడై, ఎంత ఆకస్మికంగా వెళ్ళిపోయాడు !

**పరాశరుడు** : ఎక్కడికి పోయాడు ? నీవు ఎప్పుడు తలంచుకుంటే అప్పుడే వస్తాడు. అయితే, ఏదైనా పని కలిగినప్పుడు మాత్రమే తలచుకో !

**సత్యవతి** : (కళ్ళు తుడుచుకుంటూ) సరే !

**పరాశరుడు** : ఇక నాకు కూడ సెలవియ్ ! నీ కన్యాత్వం దూషితం కాలేదు. నీవిక నిశ్చింతగా ఇంటికి పో !

**సత్యవతి** : (దీనంగా) తలచుకుంటే రావడం అబ్బాయి మాత్రమేనా ? మీరు రారా ?

**పరాశరుడు** : (జాలిగా) నేను రావడం నీకే క్షేమం కాదు, దేవీ ! అది ముందు ముందు నీకే తెలుస్తుంది. మనిద్దరం ఒకరి కొకరం అమృతం అందించుకొన్నాం, అది చాలదా ? ప్రేమకు ఫలం ఆనందం, వివాహానికి ఫలం సంసారం. నేను సంసార విముఖుడ్ని, నిత్య బ్రహ్మచారిని.

**సత్యవతి** : (కళ్ళు తుడుచుకుంటూ) నేనూ అంతే. నిత్యకన్యగా ఉండగలను.

**పరాశరుడు** : (నవ్వి) వివాహం లేకుండా మగవాడు ఉండగలడు. స్త్రీ ఉండలేదు.

సంఘ ధర్మమే కాదు. ప్రకృతి ధర్మం కూడా, పురుషుడికి లేని ఒక బాధ్యత స్త్రీకి అప్పగించబడింది. చూశావుగా ఇక నన్ను వదిలేయ్.

సత్యవతి : (కొంటెగా అతని వంక చూచి) సరేలెండి. పదండి మిమ్మల్ని రేవు దాటించే వదులుతాను. (నావలో ఎక్కి చుక్కాని తీసుకుంటుంది.)

పరాశరుడు : నన్నే కాదు - జగత్తునే సంసార సాగరం దాటిస్తున్న నీవు సాక్షాత్తు వేదమాతవు.

*(నావ ఎక్కుతాడు. నావ కదులుతూ వుండగా, తెరజారుతూ వుంటుంది. నదిపై నుంచి, సత్యవతి కంఠస్వరంతో, ఒక పాట వినిపిస్తూ వుంటుంది.)*

## పాట

ఎచ్చట నుండియో రాక ?
ఎచ్చటికో పోక ?
ఏ తెలియని తీరాల విరహమో
హృదయము గుంజే ఆ కేక ?
నావ దొరికినప్పుడే నీవు
రేవు దాటి పోవో !
నేనే రేవుగ, నా యెద నావగ
బ్రతుకే పారావారముగా,
నీవు దాటి పోయిన వెనుక
నేనుండను కనుక -
బెంగలేదులే, ప్రియతమా !
ప్రేమకు బంధనమా ?

# వేదవ్యాసుడు

## అంకం రెండు

*(హస్తినాపురంలోని మహారాజోద్యానం. సాయం సమయం. మహారాణి సత్యవతి శోకవ్యాకులిత హృదయంతో, ఇటూ అటూ తిరుగుతూ వుంది. ఇప్పుడామెలో పరాశర ప్రియా మాధుర్యం గాని, వ్యాసమాతృతా దివ్యత్వం గాని లేవు. కేవల మానవ సామాన్య సాంసారిక బాధ్యతా దుఃఖ దూసరితగా వున్నదామె. రంగంలో ధూపం వ్యాపించి వుంది.)*

**కథకుడు** : మత్స్యగంధి యోజనగంధి అయిన సత్యవతికి – ఆ విధంగా వ్యాసమహర్షి పుట్టి తపస్సుకు పోయిన వెనుక, పరాశరుడు రేవు దాటి పోయిన వెనుక, కొద్ది కాలానికి శంతన మహారాజును వివాహమాడి, కురు మహారాణి అయింది.

శంతన మహారాజుకు మొదటి భార్య అయిన గంగాదేవి ద్వారా, ఒక కొడుకున్నాడు. అతడే భీష్ముడు. తనకు రాజ్యం అక్కరలేదనీ, తాను వివాహమే ఆడనని – వాగ్దానం చేసినందు వల్లనే దాశరాజు సత్యవతిని శంతనుడికి ఇచ్చి పెండ్లి చేశాడు. అదే భీష్మ ప్రతిజ్ఞ ! తండ్రి సుఖం కోసం తనను తాను త్యాగం చేసుకొన్న ఆదర్శ పుత్రుడు, మహా మహితాత్ముడు భీష్ముడు !

పట్టపురాణి అయిన సత్యవతికి శంతనుడి ద్వారా ఇద్దరు కొడుకులు. చిత్రాంగదుడు అహంకారియై, వ్యర్థమైన ఒక పేచిలో మరణించాడు. విచిత్ర వీర్యుడికి – కాశీ రాజు కుమార్తెలైన అంబికను, అంబాలికను తెచ్చి వివాహం చేశాడు. కాని – విచిత్రవీర్యుడు స్త్రీలోలుడై, నిర్వీర్యుడై నిస్సంతువుగా మరణించాడు ! పుత్ర శోకంతో పాటు – రాజ్యానికి

వారసుడు లేడనే చింత సత్యవతిని పీడించ సాగింది.

ఇప్పుడేం చెయ్యాలో తోచక చస్తున్నదామె !

భీష్ముడికి కబురు చేసింది. అతడి మనస్సును మార్చ వలసిందిగా భగవంతుడ్ని ప్రార్థిస్తోంది !

(ఈ స్మృతులన్నీ, దుఃఖాలన్నీ, బాధ్యతలన్నీ ఆమెలో ద్యోతకమవుతాయి)

సత్యవతి : (ఆకాశంలోకి అంజలి ఘటించి)

**పుత్రకులు గతియించి రపుత్రకులుగ**
**రాణి నయ్యును గతిమాలి దీన నైతి !**
**రాణియను గర్వమేల ? ఏ ప్రాణికైన**
**బ్రహ్మ వ్రాతలో వర్గతత్వమ్ము కలదె ?**
**చేప కడుపున పుట్టిన చెలువ నేను**
**దాశరాజున కౌరస తనయ నైతి !**
**మహితు నొక్కని ప్రేమించి మాత నైతి !**
**రాజు నొక్కని పెండ్లాడి రాణినైతి!**
**రాణితనమెల్ల ప్రజ కోసరమ్ము కనుక,**
**జనుల రక్షించవలె నరాజకము నుండి :**
**భీష్ము డిప్పుడు తన పట్టు విడువడేని**
**యమున గర్భమె నాకు గత్యంతరమ్ము !**

అరాజకం సర్వ సంప్రదాయ వినాశకం. సంప్రదాయం తోడిదే సమాజం. సమాజం తోడిది వ్యక్తి భద్రత. భద్రతే స్వేచ్ఛ. స్వేచ్ఛే ఇతోధికాభ్యుదయం. కనుక, భద్రతకు మూలమైన రాజ్యం సుభద్రం కావలసి ఉంది. అందుకు భీష్ముడు పెండ్లాడ వలసి వుంది. ముందుగా అతడు రాజ్య భారాన్ని స్వీకరించ వలసి వుంది. (అంజలి ఘటించి, నిమీలిత నేత్ర అయి) పరమేశ్వరా ! ఇక ఈ బాధ్యతను నీవు స్వీకరించవలసిందే !

కేవలము నీ విలాస మిా జీవితమ్ము ;
సుఖము, దుఃఖము, శాంతి, సంక్షోభ మెల్ల
జీవిత స్థితులను నీకు చెందినవియె ;
కనుక నను బ్రోచు బాధ్యత కలదు నీకు !

*(అట్టి స్థితిలో భీష్ముడు ప్రవేశించాడు. వినయంగా నమస్కరించి నిలబడ్డాడు. చిరుత గడ్డం, దీక్షా కఠినమైన యవ్వనం, ధైర్యం, ధర్మం మూర్తీభవించిన అతణ్ని చూచి, సత్యవతి కళ్ళొత్తుకున్నది.)*

భీష్ముడు : (కేలు మోడ్చి) అమ్మా !

సత్యవతి : బాబూ !

భీష్ముడు : దుఃఖించి ఏం లాభం ?

సత్యవతి : దుఃఖించక చేసే దేముంది ?

భీష్ముడు : (నిట్టూర్చి) అవును.

సత్యవతి : (కన్నీటి చిరునవ్వుతో అతడి వంక చూచి) అంతేనా ? స్త్రీ నైన నాకు కన్నీరే జీవితం. నీవు పురుషుడివి కదా, తండ్రీ ?

భీష్ముడు : నేను పురుషుణ్నే, కాని –

సత్యవతి : (సిగ్గుతో కళ్లు దించుకొని) కాని –

భీష్ముడు : నన్ను క్షమించమ్మా ! నీ కిప్పుడు నేనివ్వగల సమాధానం ఒక్కటే. నేను పురుషుడ్ని కాదమ్మా ! (ముఖం దించుకుంటాడు)

సత్యవతి : (నిట్టూర్చి) నా తండ్రి నీ తండ్రిని కోరిన వరాలకు నేను బాధ్యురాలనా?

భీష్ముడు : కాక పోవచ్చు. అది నీ తండ్రికీ, నా తండ్రికీ సంబంధించిన విషయం.

సత్యవతి : మరి – నీకూ, నాకు సంబంధించిన విషయం మాట !

భీష్ముడు : (గంభీరంగా) అమ్మా !

సత్యవతి : (లాలనగా, జాలిగా, కేవలం స్త్రీగా చూస్తూ, గాద్గదికంగా) బాబూ!

భీష్ముడు : అమ్మా ! నీ కోర్కె సాధ్యం కాదమ్మా !

సత్యవతి : (దెబ్బ తిన్న తీగలా వణికిపోతూ) మరి – వంశం ? రాజ్యం?

భీష్ముడు : (నిబ్బరంగా) వంశమా ? మానవులలో ఏ వంశమైనా ఒక్కటేనమ్మా! అది మానవత్వం కల వంశమైతే చాలు. ఇక రాజ్యం సంగతి. రాజ్యం భగవంతుడిది. ఈ భూమిని ఎవరు, ఎప్పుడు, ఎంతకాలం, ఏవిధంగా పరిపాలించాలో నిర్ణయించేది భగవంతుడే. ఆశలు, ఆకాంక్షలు, వరాలు, శపథాలు, పరాక్రమాలు, దురాక్రమణలు – అన్నీ కూడ మానవుని వట్టి అహంకారం మాత్రమే. ప్రపంచానికి రాజు భగవంతు డొక్కడే. తన ప్రతినిధిని నిర్ణయించుకునే బాధ్యత అతడిదే !

సత్యవతి : ఆ ప్రతినిధివి నీవే, కుమారా !

భీష్ముడు : కాదమ్మా, కాదు ! అలా ఎన్నటికీ జరుగదు !

సత్యవతి : నీ మాటను నీవే కాదంటావా ?

భీష్ముడు : ఏ మాటను ?

సత్యవతి : నా తండ్రి కోరిన వరాలు ఎలా భగవన్నిర్ణయానికి వ్యతిరేకమో, ఆనాడు నీవు చేసిన శపథాలు కూడా అలానే వ్యతిరేకం కాదా !

భీష్ముడు : (చిరునవ్వుతో) అది నా సొంత విషయ మమ్మా ! నేను పెళ్ళాడను, రాజ్యం చేయను. ఇవి నా వ్యక్తిగత విషయాలు. పర ప్రసక్తి లేని

విషయా లివి. నేను ఆడి తప్పను. నా శపథం శపథమే. ఇందులో నన్నిక వ్యామోహ పెట్టవద్దు. మరేమైనా చెప్పు. ప్రాణమైనా ఇస్తాను.

సత్యవతి : (దీనంగా) అంతేనా ?

భీష్ముడు : (ఖచ్చితంగా) అంతే !

సత్యవతి : అయితే, ఒక్క న్యాయాన్ని ఆచరించి వంశాన్ని నిలుపు.

భీష్ముడు : (అనుమానంగా) ఏమిటది ?

సత్యవతి : దేవర న్యాయం. ఇది ఆపద్ధర్మంగా ఆర్యులు ప్రవేశ పెట్టిన సద్ధర్మం. దీన్ని అనుసరించి, నీ మరదండ్రైన అంబికకు, అంబాలికకు సంతానాన్ని ప్రసాదించు. వంశాన్ని పునరుద్ధరించు. పితరులకు గతులు కలిగించు. ప్రజలను, ధర్మాన్ని రక్షించు !

భీష్ముడు : దేవర న్యాయం !

సత్యవతి : అవును, తండ్రీ ! ఆ జన్మకామ దుఃఖం నుండి, వంశక్షయ భేదం నుంచి కర్మదష్టులైన యువతీ యువకులను రక్షించేటందుకు, పరమ దైవజ్ఞులైన ఆర్యఋషులు ప్రతిపాదించిన న్యాయం ఇది. ఇది నీ శపథాన్ని భంగించదు. వ్రతభంగం కాకుండానే వంశాన్ని ఉద్ధరించవచ్చు.

భీష్ముడు : (విషాదంగా నవ్వి) పెండ్లి మాని వ్యభిచారం చేసే బ్రహ్మచర్యం కాదమ్మా నాది ! బ్రహ్మచర్యమంటే అస్ఖలిత బ్రహ్మచర్యమే ! నా ధర్మానికి రెండు ముఖాలు లేవు.

సత్యవతి : శాస్త్ర సమ్మతమైన ఒక న్యాయాన్ని ఆచరించి, ఒక ధర్మాన్ని నిలపడం వ్యభిచారమెలా అవుతుంది ?

భీష్ముడు : బ్రహ్మచారికి స్త్రీ సంగమం మరే మవుతుంది ? నేను బ్రహ్మచారిగా వుండిపోతా నన్నానంటే – పెళ్ళాడననే కాదు. అసలు స్త్రీనే ముట్టనని.

సత్యవతి : బ్రహ్మచర్యం చెడకుండా సంతానం పడిసిన మహాపురుషులు లేరా!

భీష్ముడు : (మార్మికంగా నవ్వి) ఎందుకు లేరు ? అయితే అందుకు మహత్తరమైన తపశ్శక్తి అవసరం. మనం ఏ పేరుతో పిల్చినా స్త్రీ పురుష సంబంధం ఒక్కటే. వారి మధ్య దీర్ఘకాలిక సాహచర్యం పెండ్లి - తాత్కాలిక సాహచర్యం ప్రణయం. సంఘం వ్యభిచార మనేది ఈ ప్రణయాన్నే! పెండ్లి కన్న ప్రణయం బలవత్తరం. వివాహం వల్ల పుట్టినవాడి కంటే, ప్రణయం వల్ల పుట్టినవాడు శకివంతుడుగా వుంటాడు. మన మహర్షులంతా ప్రణయం వల్ల పుట్టిన వాళ్ళే కదా! వివాహమే ఆడనన్న వాణ్ని అంతకంటె శక్తివంతమైన ప్రణయాన్ని ఎలా భరించగలను.

సత్యవతి : నీకు అట్టి తప్పశ్శక్తి లేదా ?

భీష్ముడు : తపశక్తి భగవద్దత్త మమ్మా ! అది పుట్టుకతో రావలసినట్టిది. ఈ మధ్య బదరీవనంలో ఒక బాల తపస్విని చూశాను. అఖండ శక్తివంతు డతడు. అతడి జన్మ వృత్తాంతం అపూర్వ మైనట్టిది. అతడొక మహాకవి ! సర్వవేదాల సారాంశాన్ని - పురాణాలనే పేరుతో - కథలుగా, గాధలుగా, ప్రజలకు అందిస్తున్నాడతడు. అతడి పేరు కృష్ణ ద్వైపాయనుడు. అదీ -

సత్యవతి : మరి - అత డొక కన్యకు, ఒక బ్రహ్మచారికీ పుట్టిన వాడే కదా ?

భీష్ముడు : శపథం ద్వారా బ్రహ్మచర్యవ్రతం పూనిన వాణ్ని నేను.

సత్యవతి : (నిరాశగా) మరి కర్తవ్యం ?

భీష్ముడు : కృష్ణద్వైపాయనుణ్ని నియోగిస్తాం. నీవు తలచుకుంటే వస్తాడతడు. ఆ మహాత్ముడికి కావలసిన సదుపాయా లన్నీ సమకూరుస్తాను. కురువంశాన్ని ఉద్ధరించగలవాడు అత డొక్కడే.

సత్యవతి : (నిట్టూర్చి) అతడు కూడ నిరాకరిస్తే ?

భీష్ముడు : అతడు నిరాకరించడు.

సత్యవతి : సరే, నీ యిష్టం !

భీష్ముడు : (సంతృప్తిగా) ధన్యుణ్ణమ్మా ! ఇక ఆ మహా మనీషిని రప్పించు (నమస్కరించి, నిష్క్రమిస్తాడు)

సత్యవతి : (ఉద్రిక్తురాలై) నా చిట్టి తండ్రి పారాశరి - ఎంతటి వాడైనాడు! ఉచితజ్ఞుడైన భీష్ముడు సర్వజ్ఞుడే కాదు. సమయజ్ఞుడు కూడ ! మళ్ళీ చూడలేదు నా తండ్రిని ! ఇప్పుడెలా వున్నాడో ! నా మాట ఎందుకు కాదంటాడు ? అతడు రావడమే నేను చెప్పిన పని చెయ్యడం కోసం కదా !

*(మాటలోనే రంగంలోకి ప్రవేశించాడు వ్యాసుడు. అప్పటికంటె ఉజ్వలంగాను, సుదీర్ఘ శ్మశ్రువులతో భయంకరంగాను వున్నాడు. సత్యవతి గాభరాపడింది.)*

వ్యాసుడు : అవునమ్మా ! నీవు చెప్పిన పని చెయ్యడం కోసం వచ్చాను. ఏమిటా పని? చెప్పు ! చేసేస్తా !

సత్యవతి : నా తండ్రీ ! (కౌగలించుకొన్నది.)

వ్యాసుడు : (ఆమె కన్నీరు తుడుస్తూ) ఏమిటిప్పుడు వచ్చిన పని ?

సత్యవతి : నిన్ను చూడ్డం కంటే నాకు మించిన పనేముంది, బాబు?

వ్యాసుడు : (నవ్వి) చూడ్డం పనేమిటమ్మా ! ఆత్మ చక్షువు కంటే చర్మ చక్షువు గొప్పదా ? నిత్యం నీలోనే వున్న నన్ను బైట ఏమి చూస్తావు ?

సత్యవతి : నీవు భగవానుడవు, తండ్రీ ! నీతో నేను ఏం మాట్లాడగలను? నిన్ను తలచుకొన్న పని చెప్పేస్తాను. కురురాజులైన నీ తమ్ములిద్దరూ

నిస్సంతుగా మరణించారు. రాజ్యానికి వారసులు లేరు. అందువల్ల నీవు నీ మరదంద్ర ద్వారా –

వ్యాసుదు : ఓ, దానికేం ? ని కోడంద్రకు పిల్లలేగా కావలసింది ? నేనొక వ్రతం చెపుతాను. యధావిధిగా దానిని వారిచే నిర్వర్తింపజేయి!

సత్యవతి : తప్పకుండా !

వ్యాసుదు . తప్పకుండా చేస్తే, ఒక సంవత్సరానికి –

సత్యవతి : సంవత్సరానికా? కాదు, కాదు. రాజ్యం అరాజకంగా వుంది. తక్షణం ఒక రాజు కావాలి. రాజనే వాడొకడుంటే, రాజ్య భారం భీష్ముడు చూచుకుంటాడు.

వ్యాసుదు : తక్షణమా ?

సత్యవతి : ఈ రాత్రికే !

వ్యాసుదు : సరే, రాత్రి పడనే పడింది. అంతఃపురం ఎక్కడ?

సత్యవతి : (నవ్వుతూ) అంతా తొందర ! తండ్రి పోలిక వచ్చింది నీకు. అంతః పురం లోకి ఇలానే వెళతావా ? (లోపలికి చూచి) ఘృతాచీ!

(ఘృతాచీ ప్రవేశించింది. అద్భుతమైన అందకత్తె ఆమె. వ్యాసుణ్ణి చూచి విప్పారిన ముఖాన్ని సిగ్గుపడి వంచుకున్నది. వ్యాసుడు ఆమె వంక మమతతో చూడసాగాడు.)

ఘృతాచి : మహారాణి ! (నమస్కరించి, నిలబడింది)

సత్యవతి : అంబికా దేవిని అలంకరించి, శయ్యామందిరానికి పంపు ! కురువంశోద్ధారకుని ఆమె కనవలసి వున్నదని చెప్పు !

ఘృతాచి : చిత్తం, మహారాణి ! (నిష్క్రమిస్తుంది)

సత్యవతి : నిన్ను కూడ కొంచెం అలంకరించనీ ! (దగ్గరకు తీసుకొని, జుట్టు సవరిస్తూ) ఇవి రాజాంతఃపురాలు, అడవులు కావు !

వ్యాసుడు : (తల్లి ఒడిలో కూర్చొని, తల దువ్వించుకొంటూ) ఆ విషయం నిన్ను చూస్తేనే తెలుస్తుంది కదా అమ్మా !

*(సత్యవతి వ్యాసుడికి తల ముడి వేసి, గడ్డం దువ్వి, ఏదో సుగంధ ద్రవాన్ని పూసి, వీలైనంత భోగ యోగ్యునిగా తయారుచేసిందామె అతణ్ని)*

సత్యవతి : బాబూ ! నీ తపఃశ్శక్తి నంతా ఉపయోగించి, మనస్సుతీరా క్రీడించి, మా కురు వంశానికి ఒక మహా బలవంతుడూ, వీర్య వంతుడూ, ఆయుష్మంతుడూ అయిన వారసుణ్ని ప్రసాదించు!

ఘృతాచి : (ప్రవేశించి) అంతా సిద్ధంగా వుంది, మహారాణీ ! ఋషి కుమారులిక రావచ్చు ! (కొంటెగా వ్యాసుడి వంక చూస్తుంది)

వ్యాసుడు : (ఘృతాచి వంక చూస్తూ) సరేనమ్మా ! సరే ! నీవేమి చెప్పితే అది చేస్తాను !

(వ్యాసుడు ఘృతాచి వెంట నిష్క్రమిస్తాడు)

సత్యవతి : (ఆనందంతో) కుమారా ! విజయీభవ ! విజయీభవ !

(మెల్లగా తెర, తెరలో నుంచి శ్రావ్యగానం)

# వేదవ్యాసుడు

## అంకం మూడు

(సరస్వతీ దక్షిణతీరం లోని బదరీవనం. వ్యాసుని ఆశ్రమం శమ్యా ప్రాసం. ప్రకృతి పరమ సుందరంగా వుంది. వ్యాసుడు తపస్సులో కూర్చుని వున్నాడు. రంగంలో ధూపం వ్యాపించి వుంది. లోపలినుంచి కథకుడు జరిగిన కథ చెప్పుతున్నాడు)

**కథకుడు** : ఆ విధంగా ఆ రాత్రి వ్యాసుడు అంబిక పడక గదిలో ప్రవేశించాడు. అతడి వికృత రూపం చూచి ఆమె ఆమె కళ్ళు మూసుకున్నది. అందువల్ల ఆమెకు గ్రుడ్డివాడైన ధృతరాష్ట్రుడు పుట్టాడు. దానికి సత్యవతి విచారపడి, అంబాలికను గదిలోకి పంపింది. ఆమె అతడ్ని చూచి వెలవెల బోయింది. అందువల్ల ఆమెకు పాండు రోగి అయిన పాండురాజు పుట్టాడు. దానికి సత్యవతి మరీ విచారపడి, అంబికనే మరొకసారి నియోగించింది. ఈసారి అంబిక తనకు బదులుగా తన చెలికత్తె అయిన ఘృతాచిని నియోగించింది. ఘృతాచి వ్యాసుణ్ని వలచి వున్నది కనుక, అతణ్ని అనేక విధాల తృప్తి పరచి, ఆరోగ్యవంతుడూ, పరమ ధార్మికుడూ అయిన విదురుణ్ని కన్నది. ఇక చేసేది లేక సత్యవతి - కలిగిన దానితో తృప్తిపడి, రాజ్యరక్షణ భారాన్ని భీష్ముడికి అప్పగించి, వ్యాసుడి సలహాతో తపోవ్రతం అవలంబించి, జీవితం తరింపజేసుకొన్నది.

ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు భీష్ముని రక్షణలో పెరిగి పెద్దవారైనారు. ధృతరాష్ట్రుడు పెద్దవాడు కనుక కురు రాజ్య ప్రభువైనాడు. పాండురాజు రాజ్య రక్షకుడైనాడు. విదురుడు ధృతరాష్ట్రుడికి ధర్మ చక్షువైనాడు.

ధృతరాష్ట్రుడికి దుర్యోధనాదులు వందమంది కొడుకులు. పాండురాజుకి ధర్మరాజాదులు ఐదుగురు కొడుకులు.

మొత్తం ఈ నూట ఐదుగురు అన్నదమ్ములలోను ధర్మరాజ ాడు. న్యాయంగా రాజ్యానికి వారసు డవుతాడు.

ధర్మరాజుకు రాజ్యం దక్కకుండా దుర్యోధనుడు కుట్ర చేయసాగాడు. పాండురాజు అకాల మరణం, ధృతరాష్ట్రుని స్వపుత్ర మమకారం ఆ కుట్రలకు తోడ్పడ్డాయి. మహా బలవంతులై వుండి కూడా, పాండవులు కష్టాలు పడవలసి వచ్చింది.

ఈ సమకాలీన చరిత్రలో వ్యాసుడు కూడ ఒక ముఖ్య పాత్రధారి! తన వల్ల నిల్చిన వంశం ఆంతరంగిక కుట్రల వల్ల నాశనమై పోవడం అతనికి ఇష్టం లేదు. అందువల్ల - కోరినప్పుడూ, కోరకుండానూ కూడా - అతడు హస్తినాపురం వెళ్ళి, కౌరవులకు, పాండవులకు కూడా - ఉచితమైన సలహాలను ఇస్తూ వచ్చాడు. దుర్యోధనాదులకు నీతులు గరపడం, ధర్మరాజాదులను ఓదార్చడం వ్యాసుడి నిత్య కృత్యమయింది !

కౌరవపాండవ విరోధంలో శాంతి దూత పాత్రను ఒక ప్రక్క నిర్వహిస్తూనే వ్యాసుడు - మరోప్రక్క తన ప్రజాసాహిత్య సృష్టిని కొనసాగిస్తున్నాడు.

ఆనాటి అతడి ప్రజా సాహిత్యం పురాణాలు ! భగవంతుడే- బ్రహ్మ విష్ణు మహేశ్వర స్వరూపాలతో - ఒక్కోసారి ఒక్కొక్కరుగా - అతణ్ని ఆవేశించి, తన మహిమలను, లీలలను లోకానికి విశదీకరిస్తూన్నారని పిస్తుంది - వ్యాసుని పురాణ రచనాపటిమను పరిక్షిస్తుంటే ! పక్షానికొక, మాసానికొక పురాణం చొప్పున నిర్మాణమై పోతున్నై ! అవి పైలుడు,

జైమిని, సుమంతుడు, వైశంపాయనుడు, రోమహర్షణుడు మున్నగు శిష్యుల ద్వారా అన్ని లోకాలకు అందించబడుతున్నై ! ఇదొక మహోద్యమమయింది !

అప్పటికి కొద్దిమంది చేతిలో వున్న వేదాలు కథలుగా, ఉపనిషత్తులుగా సులభశైలిలో జన సామాన్యానికి అంద జేయబడుతున్నై. ఇది లోకంలో ఒక అలజడిని సృష్టించ సాగింది.

(అప్పుడు రంగంలోకి ప్రవేశించారు - వ్యాస శిష్యులైన వైశంపాయనాది ఋషులు. వ్యాసుడు తపస్సు చాలించి లేచాడు. రంగంలో ధూపం పలచబడింది.)

**వ్యాసుడు** : ఎలా మీ పురాణ కాలక్షేపాలు?

**పైలుడు** : అద్భుతంగా వున్నై, గురుదేవా ! ప్రజలంతా వింటున్నారు. భక్తి ప్రపత్తులు పెల్లుబుకుతున్నై, మానవ సమాజం విజ్ఞాన భాసిత మవుతున్నది !

**జైమిని** : ఒక్క మానవులే కాదు, భగవాన్ ! దేవతలు కూడ వచ్చి వింటున్నారు. త్రిమూర్తులు కూడా మెచ్చుకుంటున్నారు !

**రోమహర్షణుడు**: మొన్న వరాహ పురాణాన్ని విని, శ్రీమన్నారాయణుడే ఆశ్చర్య పోయాడు! ధరణి దేవికి తాను చెప్పిన కథ- ఉన్నదున్నట్టు - మీకు తెలియదు అద్భుత మన్నాడు ! మీ దార్శనికతకు అది పరాకాష్ఠ అన్నాడు ! కవి అన్నవాడు పరమాత్మ చేతిలో ఒక లేఖిని అన్నాడు !

**వ్యాసుడు** : (చిరునవ్వుతో) అదే అతడి గొప్పతనం ! ఆత్మగతుడై, అతడే కదా నా నోట పలికిస్తున్నాడు ! తన గొప్పతనాన్ని తన అనుచరులపై త్రోయడమే భగవంతుని అసలు గొప్పతనం ! ఆ విద్యలో అతణ్ని మించిన వాడు లేడు !

(శిష్యులు ఒకరి మొగం ఒకరు చూచుకొని, వ్యాసుడికి సాష్టాంగపడి లేస్తారు.)

వైశంపాయనుడు: ధన్యులం గురుబ్రహ్మే ! ధన్యులం ! ఇంత సూక్ష్మంగా, ఇంత సులభంగా మేము బ్రహ్మజ్ఞానుల మవుతా మనుకోలేదు ! ఓహో ! బ్రహ్మానంద మహానిశ్రేయస శోభ! (తన్మయు డవుతాడు)

పైలుడు : అంగుకే, దేవతలంతా వేదాలను మాని, మీ పురాణాలను వింటున్నారు !

జైమిని : వేదాలన్నీ కలగాపులగంగా కలిసి పోయి అంతా అయో మయంగా వున్నదట ! ఏ ఋక్కు ఎవర్ని గురించో, ఎందు నిమిత్తమో తెలియక దేవతలు చాలా ఇబ్బంది పడు తున్నారట ! ప్రజలకు వర్షం కావాలో, ఎండ కావాలో తెలియకపోతే - దేవతలైనా ఏం చెయ్యగలరు ?

రోమహర్షణుడు : ఇప్పుడీ పురాణాలు వేదాలను చక్కగా విడమర్చి చూపు తున్నాయట! ఈ విధంగా వైదిక వాఙ్మయానికి, వైదిక ధర్మానికి అపూర్వ సేవ చేస్తున్న మిమ్ము చూడాలను కొంటున్నారు వారు !

వ్యాసుడు : ఇదంతా వెలుగు, మరి - చీకటి ?

సుమంతుడు : చీకటి లేకుండా ఎలా వుంటుంది ? స్వయంప్రకాశ పరబ్రహ్మకు కూడ, మాయ వుండనే వుంది కదా ? మీ వెలుగుకు చీకటి పండితులు ! వారు కొద్దిమంది మాత్రమే అయినా, మాయకు వలె వారి బలం చాలా అధికం ! పవిత్రమైన వేదాలను సులభశైలిలో ప్రజాసామాన్యానికి అందజేయడం తప్పంటున్నారు వారు !

వ్యాసుడు : మానవోద్ధరణకు మహేశ్వరుడు ప్రసాదించిన వేదాలు పండితుల సొంత ఆస్తులా ?

జైమిని : ఆ మాట మహేశ్వరుడే అన్నాడు. వేదాలను సృష్టించడం లోని ఉద్దేశాన్ని ఇప్పుడు మీరు అమలు జరుపుతున్నా రన్నాడు ఆయన.

పైలుదు : మీరు సాక్షాత్తు భగవాను లన్నాడు బ్రహ్మ !

సుమంతుదు : మొన్న సత్యలోకంలో జరిగిన దేవమహాసభలో ఒక తీర్మానం చెయ్యబడింది. ఏదో ఒక మహాకార్య నిర్వహణలో మిమ్ము నియోగించే నిమిత్తం బ్రహ్మ నాయకత్వంలో ఒక రాయ బారం ఇక్కడకు రానున్నది.

వ్యాసుదు : నియోగం ! బాగుంది (కళ్ళలో ఏదో మెరుపుతో) బాగుంది కాని - విదురు డేమన్నాడు ?

రోమహర్షుడు : మా అందరి కంటే ఇప్పుడు విదురుడికే ఈ పురాణాలన్నీ కంఠస్థం. అంతటి ధర్మ సూక్ష్మాలు తెలిసినవాణ్ని మేమెక్కడా చూడలేదు.

(అప్పుడు రంగంలోకి ప్రవేశిస్తారు. - బ్రహ్మ, కొందరు దేవతలు, దేవమునులు. వ్యాసుడు స్వాగతం చెపుతాడు. బ్రహ్మ, వ్యాసుడు తప్ప తక్కిన వారంతా మెల్లగా రంగం నుంచి వెనుకకు పోతారు.)

వ్యాసుదు : (కేలు మోడ్చి) పితామహుల పాద ధూళితో మా ఆశ్రమం పవిత్రమైంది.

బ్రహ్మ : (నవ్వుతూ) బ్రహ్మ బిందు కళ్యాణ తిలకమైన నీ ఆశ్రమ ధూళితో నేను పవిత్రుణ్ణయ్యాను. మహాకవీ ! సాహిత్య రూపంలో వేద మాతను ఆరాధిస్తున్న నీ ఆశ్రమం మానవులకే కాదు, దేవతలకు కూడా పుణ్యక్షేత్రం కదా !

వ్యాసుదు : (వినయంతో) అది మీరు నాకిచ్చిన పనే కదా ?

బ్రహ్మ : ఇచ్చిన పనిని చక్కగా చేస్తున్నవా రెంతమంది ? ప్రతి ప్రాణికీ ఒక పని వుంది. కాని, దానిని గుర్తించుకో గలుగుతున్నవాళ్ళు బహు కొద్దిమంది. దానిని సక్రమంగా నిర్వహించు కోగలుగుతున్న వాళ్లు ఎక్కడో గాని లేరు. అందుకే నీకొక మహాకార్యాన్ని అప్పగించడం కోసం వచ్చాం మేమిప్పుడు.

వ్యాసుదు : (అంజలి పట్టి) మహాభాగ్యం !

బ్రహ్మ : వేదాలను నీవు పురాణిస్తున్నావు. మానవులు, దేవతలు కూడ ఇప్పుడు వేదాలను విడిచి, పురాణాలను పఠిస్తున్నారు. ఇప్పటికే కలగాపులగంగా వున్న వేదాలు ఇక మీద పూర్తిగా అలక్ష్యం చెయ్యబడి నశించి పోయే ప్రమాదం ఏర్పడింది. మూలం శిథిలమైతే,

ఎంతటి మహావృక్షమైనా ఎంతకాలం నిలుస్తుంది ? అందుకని -

వ్యాసుడు : (అనుమానిస్తూ) అందుకని ?

బ్రహ్మ : (నవ్వి) అందుకని - వేదాలను తిరిగి వ్యవస్థీకరించ వలసిందిగా నిన్ను కోరుతున్నాం. వేదాలను నాలుగు అని అనుకోవడమే గాని, అన్నీ కలిసిపోయి వున్నై ! ఏ మంత్రం ఏ వేదంలోదో తెలియడం లేదు. పిడుగుకీ, బియ్యానికీ ఒకటే మంత్రమై పోయింది. నీవు పుట్టుక తోనే వేదమూర్తివి. నిన్ను మించి ఈ పని చెయ్యగలవారు మరెవ్వరూ లేరు. నాల్గు వేదాలను దేనికది వేర్పరచి వేదమాత నుద్ధరించు !

వ్యాసుడు : తండ్రీ ! నీ ఆజ్ఞను శిరసా వహిస్తున్నాను. నీ సంకల్ప బలంతో వేదాలను వ్యాసీకరిస్తాను. వేద విభజన భావం నాకిది వరకే వుంది. అది ఇప్పుడు స్థిరపడింది.

**విభజనము చేయుటో, నాల్గువేదములను**
**ఒకటిగా చేసి వ్రాయుటో, ఊహ విడక**
**యుంటి నిన్నాళ్ళు ; నేడది ఉత్పలమ్ము**
**చంద్రకాంతికి వలె విచ్చి, సంభ్రమయ్యె !**

**లోక మెరుగగ శ్రుతుల వ్యాసీకరింతు,**
**వేడ్క రచియింతు పంచమ వేద మొకటి ;**
**వాణితో పాటు నీవు నా వాక్కు నందు**
**కాపురము చేయ - సాధ్యము కానిదేది ?**

బ్రహ్మ : (సంతోషంతో వ్యాసుని భుజం తట్టి) మహా తపస్వీ !

**నవ్వుల కటంచు నా నాల్గు నాల్కలందు**
**నాల్గు కంబాల యాటను నడుపుచున్న**
**బ్రహ్మితో నీదు నాల్క నిల్లరిక ముందు**
**అదుపునకు తెచ్చి యిమ్ము ఈ ఆకసమును !**

ఋక్సతుష్కము తన బొమ్మరిండ్లు కాగ
ఆట తమకమ్ములో వాటి నన్ని కలిపి
రాశి పోసిన దయ్య గీర్వాణి వాణి !
చీమలట్లు నరుల్ దాన చిక్కుకొనిరి !

చిక్కు విడదీసి, నరులకు క్షేమ మొసగి,
అర్ష విజ్ఞానమును జగమందు నిల్పి,
వేదవ్యాసుడవై నీవు వెలయు మయ్య !
తండ్రి వగుమయ్య విశ్వవేదాంతమునకు !

వ్యాసుడు : (ఆనందంతో) ధన్యుణ్ని, తండ్రీ ! ధన్యుణ్ని !

బ్రహ్మ : మీ ముత్తవ్వ అరుంధతీ దేవీ తమ్ముడు కపిల మహర్షి సృష్టి క్రమాన్ని సిసలుగా ఊహించి, సాంఖ్య వేదాంతాన్ని నిర్మించాడు. దాన్ని కూడా ఉద్ధరించి, బ్రహ్మ జ్ఞాన పరమార్థాన్ని పనసపండులా పరిమళింప జేయి ! శుభం ! (ఆశీర్వదించి, సపరివారంగా నిష్క్రమిస్తాడు.) (అంతవరకు వ్యాసుని వెనుక వున్న శిష్యులంతా ముందుకు వచ్చి అతడి చుట్టూ చేరతారు. ఆశ్రమం మొత్తం అపూర్వ కాంతులతో ఉత్సాహాతిరేకతతో నిండి వుంది.)

పైలుడు : ఓహో ! జగత్ సంస్కృతీ పునరావిర్భూతి !

జైమిని : మానవ జగత్ పునర్నవీకృతి !

(వ్యాసుడు ధ్యాన నిమగ్ను డవుతాడు. తెర మెల్లగా జారుతూ వుండగా, లోపలి నుంచి వేదగానం వినిపిస్తూ వుంది. ఈ గానం వైశంపాయనాదుల బృందగానంగా వుంటే మంచిది.)

వేదగానం

యస్మిన్ ఋచః సామ యజూంషి
యస్మిన్ ప్రతిష్ఠితా ధనాభావి వారాః
యస్మిన్ శ్చిత్తం సర్వమేతం ప్రజానాం
త న్మే మనః శివసంకల్ప మస్తు !

# వేదవ్యాసుడు

## అంకం నాలుగు

*(శమ్యా ప్రాశం. రంగం ధూపంతో నిండి వుంది. వ్యాసు డొక్కడే తపస్సులో వున్నాడు. నాలుగు రంగుల కాంతులు రంగంలో ప్రసరిస్తున్నై. కథకుడు కథ చెప్తుతూ వుండగా పైలుడు, జైమిని, వైశంపాయనుడు, సుమంతుడు వచ్చి కూర్చుంటారు. వ్యాసుడు చెపుతూ వుంటే వారు - ఎవరికి చెప్పింది వారు - వ్రాసుకొంటూ వుంటారు.)*

**కథకుడు** : ఆ విధంగా వ్యాసమహర్షి బ్రహ్మ ఆజ్ఞను శిరసావహించి, పరమ దృష్టితో వేదరాశి వంక చూశాడు. అది నాలుగు రకాల, రంగుల, గుణాల పరమ పదార్థ మిశ్రణం ! ఆ రాశి నుంచి నాలుగు వేదాలను విడదీయసాగా డతడు. పైలుడికి ఋగ్వేదం, జైమినికి సామవేదం, వైశంపాయనుడికి యజుర్వేదం, సుమంతుడికి అధర్వణవేదం చెప్తుతూ వుంటే - వారు వ్రాసుకోసాగారు. పెసలు, సెనగలు, కందులు, మినుములు కలిసిపోయిన ఒక రాశి నుంచి - ఒక్కొక్క గింజ, ఒక్కొక్క కణం చొప్పున ఏ సరుకు కా సరుకును వేరు చేసేటట్టుగా - ఒక్కొక్క ఋక్కు, ఒక్కొక్క మంత్రం చొప్పున ఏ వేదాని కా వేదాన్ని వేరు చేశాడా యన !

నలుగురు శిష్యులు నాలుగు పాత్రల వలె, నాలుగు వేదాలను పట్టుకొన్నారు. వేద విభజన జరిగింది. వ్యాసుడు వేద వ్యాసుడైనాడు. ఆయా వేదాలను లోకంలో ప్రతిష్ఠించడం కోసం ఆయా శిష్యులనే నియోగించాడు వ్యాసుడు.

*(అప్పుడు ఋగ్వేద సంహితతో పైలుడు లేచి వచ్చి, నమస్కరించి నిలుస్తాడు)*

**వ్యాసుడు** : ఇది ఋగ్వేదము, బీజవాటిక జగత్ సృష్టి స్థితి శ్రీలకున్ !

(అతడు మళ్ళీ నమస్కరించి నిష్క్రమిస్తాడు. ఆ తర్వాత జైమిని సామ వేదంతో ముందుకు వస్తాడు)

వ్యాసుడు : హృదయ మ్మియ్యది సామవేదమఖిల శ్రేయస్కళా శ్రీలకున్! (అతడు నిష్క్రమించగా, వైశంపాయనుడు యజుర్వేదంతో యథారీతిగా ముందుకు వస్తాడు.)

వ్యాసుడు : పెదవిన్ రంభ, సుఖాంతిమ మ్మిది, యజుర్వేదమ్ము సుశ్రీలకున్ ! (అతడు వెళ్ళగా, సుమంతుడు అధర్వణ వేద సంపుటితో వచ్చి నిలుస్తాడు.)

వ్యాసుడు : సదనమ్మిద్ది, అధర్వణ వేదము మనుష్య ప్రాభవ శ్రీలకున్ ! (అతడు కూడా నిష్క్రమించిన మరుక్షణంలో నలుగురూ, నాలుగు సంహితలతోను ప్రవేశించి, వ్యాసుడి చుట్టూ నిలుస్తారు. పూలవాన కురుస్తుంది. దేవదుందుభులు మ్రోగుతాయి. వ్యాసుడు ఆ నాలుగు చరణాలనూ మళ్ళీ చదువుతాడు.)

వ్యాసుడు : **ఇది ఋగ్వేదము, బీజవాటిక జగత్ సృష్టి స్థితి శ్రీలకున్!**
**హృదయమ్మియ్యది సామవేద మఖిల శ్రేయస్కళా శ్రీలకున్ !**
**పెదవిన్ రంభ, సుఖాంతిమమ్మిది, యజుర్వేదమ్ము సుశ్రీలకున్!**
**సదనమ్మిద్ది, అధర్వ వేదము మనుష్య ప్రాభవ శ్రీలకున్!**

(తర్వాత శిష్యులను, సంహితలను ఆశీర్వదిస్తూ)

**వేదమే ఆత్మ, ఆత్మయే వేద మౌను ;**
**ఆత్మ పరమాత్మ యౌట వేదాంతమౌను ;**
**తనువె సర్వస్వ మనుకొను మనుజ తతికి**
**భోజనము పెట్టుదాత్మావ భోగములతో !**

(వ్యాసుడి ఆశీర్వాదం స్వీకరించి, శిష్యులు నిష్క్రమిస్తారు. వ్యాసుడు మళ్ళీ తపోముద్ర వహిస్తాడు. రంగం ధూప బంధురం అవుతుంది.)

కథకుడు : ఆ విధంగా, వేదాలను వ్యాసీకరించి వేదవ్యాసుడై నాడు సాత్య వతేయుడు. పురాణ రచన ద్వారా ప్రజాకవి అయి, వేద విభజన ద్వారా మహావేదస్రష్ట అయిన వ్యాసుడు వేదపారంతో ఉపనిషత్తులను నిర్మించాడు. సాహితీ రంగంలో ఇంత కృషి చేస్తూ కూడ, ఆనాటి రాజకీయ రంగంతో అత్యంత సాన్నిహిత్యాన్ని కలిగి వున్నాడు !

వాస్తవ జీవితంతో నిత్యసంబంధం కలిగి వుండి, దాని కష్టసుఖాలతో – మంచి చెడ్డలతో – తాదాత్మ్యం పొంది వుండి, దాన్ని అభ్యుదయ నిశ్రేణి వెంట ఒక్కొక్క మెట్టే పైకి తీసుకుపోవడానికి తన సమస్త ప్రతిభనూ ధారపోసే వాడే కదా నిజమైన కవి ! అదే వ్యాసుడి ప్రత్యేకత ! అదే వ్యాసుడి పరమాత్మత !

హస్తినాపుర సింహాసనం కోసం కౌరవపాండవుల మధ్య అగ్ని రగుల్కొన్నది ! దుర్యోధనుడి దురాశకు, అధికార వ్యామోహతకు ఒక పరిమితి లేకపోయింది. వ్యాసుడి హితోపదేశం బూడిద పాలయింది.

లక్కగృహ దహనానంతరం – దిక్కుమాలిన పాండవులకు – ధైర్యం చెప్పాడతడు. ద్రౌపది స్వయంవ రోత్సవానికి హాజరు కమ్మన్నాడు. తర్వాత ద్రౌపదిని అన్నదమ్ము లైదుగురూ పెండ్లాడవచ్చు నన్నాడు. భీముడికి హిడింబీ సాహచర్యం శుభప్రదమే నన్నాడు.

పాండవులు మాయాద్యూతంలో ఓడి, అరణ్య వాసానికి పోయినప్పుడు వారికి అవసర మైనప్పుడల్లా కనిపించి, కర్తవ్యబోధ చేశాడు. అతడి సలహా భగవంతుడి ఆదేశమే !

యుద్ధం తప్పనప్పుడు – ధృతరాష్ట్రుడికి చివరి హెచ్చరిక చేశాడు. ధర్మంతో పాటు, భగవంతుడైన శ్రీకృష్ణుడు పాండవుల పక్షాన వుండడం

వల్ల, పాండవులే గెలుస్తారని స్పష్టంగా చెప్పాడు. కౌరవులు, పాండవులూ తన మనుమలే ! తనకు పక్షపాతం లేదు. అధర్మాన్ని ధర్మం జయించకపోతే, అసలు సృష్టి మనుగడకే మోసం రాదా ? వ్యాసుడి వంటి భగవానుడికి ధర్మ మొక్కటే ప్రధానం ! స్నేహబాంధవ్యాలు కాదు !

యుద్ధం తప్పలేదు. అది దైవ నిర్ణీతం. దుష్టుడు తన దౌష్ట్యాన్ని ఒప్పుకోడు. ధర్మాన్ని ఎదిరించి, నశించి పోతాడు. కర్ర కాలి పోతుంది. మిగిలేది బూడిద ! ఇనుము ఎంత కాలినా, ఎంత కరిగినా అది ఇనుమే !

యుద్ధగతిని స్వయంగా చూడగోరితే, దివ్యదృష్టి ఇస్తా ననగా ధృతరాష్ట్రుడు వద్దని, వార్తలు వినగోరగా – అందుకు సంజయుణ్ణి నియమించి, అతడికి ప్రమాదం లేకుండా యుద్ధరంగంలో సంచరించగలిగేటట్టు వరం ఇచ్చాడు వ్యాసుడు !

యుద్ధ మధ్యంలో – పద్మవ్యూహంలో అభిమన్యుణ్ని పోగొట్టుకొని ఏడుస్తున్న ధర్మరాజాదులను ఓదార్చా డతడు.

చివరకు పాండవులు గెల్చినా, అది పేరుకు మాత్రమే గెల్పు ! దుర్యోధనాదులు సమూలంగా నశించగా, పాండవులు నామ మాత్రంగా మిగిలారు.

యుద్ధానంతరం మిగిలిన వాళ్ళు చచ్చిన వాళ్ళ కోసం దుఃఖ పడుతున్నప్పుడు – వాళ్లకు చచ్చి స్వర్గాన వున్న వాళ్ళందర్నీ తన తపోమహిమచే రప్పించి చూపాడు!

ఆ విధంగా వ్యాసమహర్షి భారత రాజకీయాలతో, కురుక్షేత్ర యుద్ధంతో, ప్రత్యక్ష సంబంధం కలిగి వుండి, చివరి వరకూ ఉభయ పక్షాల శ్రేయస్సు కొరకూ కృషి చేశాడు.

తన పంచమ వేద రచనకు ఈ మహాభారత చరిత్రనే ఇతి వృత్తంగా తీసుకుని మహాభారతాన్ని వ్రాశా డాయన. జన సామాన్యం కోసం నాలుగు వేదాల సారాన్ని గ్రహించి అందులో నిక్షేపించాడు. అందులో శ్రీకృష్ణపరంగా విశ్వవేదాంత జ్యోతి అయిన భగవద్గీతను ఆవిష్కరించాడు.

*(ఈ సమయంలో లోపలి నుంచి కొన్ని భారత విజయ గీతాసంకీర్తన శ్లోకాలు బృందగానం చెయ్యబడుతూ వుంటాయి)*

## సంకీర్తనం

ఓం నమోస్తుతే వ్యాస విశాల బుద్ధే
ఫుల్లారవిందాయత పత్ర నేత్ర
యాన త్వయా భారత తైల పూర్ణః
ప్రజ్ఞావితో జ్ఞానమయః ప్రదీపః ।

అష్టాదశ పురాణాని
నవ వ్యాకరణానిచ
నిర్మధ్య చతురోవేదాన్
మునినా భారతం కృతం !

పారాశర్యవచః సరోజ మమలం
గీతార్థ గంధోత్కటం
నానాఖ్యానక కేసరం హరికథా
సద్భానునా బోధితం

లోకే సజ్జన షట్పదై రహ రహః
పేపీయమానం ముదా
భూయాత్ భారత పంకజం కలిమల
ప్రధ్వంసినం శ్రేయసే !
గీతాకల్ప తరుం భజే భగవతా
కృష్ణేన సంరోపితం
వేదవ్యాస వివర్ధితం శ్రుతి శిరో
బీజం ప్రబోధాంకురం
నానా శాస్త్ర రహస్య శాఖమరతి
క్షాంతి ప్రవాళాంకితం
కృష్ణాంఘ్రి ద్వయ భక్తి పుష్ప సురభిం
మోక్ష ప్రదం జ్ఞానినాం !

కథకుడు : పురాణాలను నిర్మించి, వేదాలను విభజించి, పంచమవేదాన్ని వ్రాసి, వేదాంతాన్ని ఆవిష్కరించి – ఇంత చేసిన తర్వాత కూడ వ్యాసుని మనస్సు కుదుట పడలేదు. అసంతృప్తితో, అశాంతితో కొట్టుకొంటున్న దెందుకో !

*(అప్పుడు తెరలో నుంచి నారాయణ సంకీర్తనం వినిపించింది. మెల్లగా గానం చేసుకుంటూ నారద మహర్షి ప్రవేశించాడు. వ్యాసుడు సంభ్రమాచిత్తుడై లేచి, ఎదురేగి, స్వాగతం చెప్పాడు.)*

నారదుడు : వేదవ్యాస మహర్షి! శిష్యుడు నమస్సు లర్పిస్తున్నాడు !
*(అవనత శిరస్కుడవుతాడు)*

వ్యాసుడు : దేవర్షీ! నీవు నాకు నమస్కరించడమా !
సాటి లేని త్రిలోక సంచారి వీవు !
జీవతత్వము తెలిసిన దేవమునివి !

నేను కేవలమొక చిన్న మానవుడను,
ఎవ్వ రెరుగరు ఎవ్వరికెవరు గురువొ ?

నారదుడు : (భక్తితో మళ్ళీ మ్రొక్కి) గురుత్వం దేవ మానవ వర్గతత్వం పై ఆధారపడింది కాదు, సాత్యవతేయా! అది అక్షర తత్వాన్ని బట్టి వుండేది!

దేవమునులు, దేవేంద్రుడు, దేవతలును,
వారిపై త్రిమూర్తుల వంటి వారు కూడ
అక్షరత్వము గనుట నీయక్షరమున !
కావ్యమూర్తులు కవి కంటె ఘనులు కారు !

వ్యాసుడు : కవి అంతటి ఘనుడనుకొంటున్నావా, దేవర్షీ? దేవ దానవ మానవ పశుపక్ష్యాదుల సమస్త జీవదుఃఖాలను తానే వహించి, సతమతమయ్యే కర్మిష్ఠుడు, సంతత వ్యాకుల చిత్తుడు ఒక్క కవి కాక మరెవడు? అందుకు నేనే నిదర్శనం కదా?

**జీవతతి దుఃఖమెల్ల తానే వహించ,**
**ఖేదమున కవి సతము నిర్వేదమొందు !**
**గీత చెప్పియు, నిష్కామక్రియ తెలిసియు**
**గుండె గోలకు తాళలేకుంటి నేనె !**

**దేవ మానవులకె కాదు, జీవ జగతి**
**నెవరి నేనియు ఆపద లేచు నపుడు**
**అడుగకుండనే పోయి తోడ్పడుదు వీవు !**
**నన్ను రక్షించుటకు వచ్చినావు నేడు !**

(వ్యాసుడు తలవంచి నమస్కరిస్తాడు. నారదుడు చిరునవ్వుతో అతణ్ణి కౌగలించుకుంటాడు)

నారదుడు : కర్మందీ ! పారాశరీ ! నీకు విషాదమా ?

**సృష్టిలో ఎవ్వరును కూడ చేయలేని**
**అక్షరము చేసినట్టి బ్రహ్మర్షి వీవు !**
**అవనికమృత మిచ్చిన ప్రజాకవివి నీవు !**
**నీకె గతిలేక - గతియేది లోకమునకు ?**

లోకంలో ఎవరూ, ఎప్పుడూ చెయ్యని చెయ్యలేని మహాకార్యాలు, సాహితీ, సృష్టి స్థితులు నీ ఒక్క చేతి మీదుగా జరిగినై! అట్టి భగవానుడవైన నీకు విషాదమా ?

వ్యాసుడు : (నిట్టూర్చి) కవి పస్తుండి, కడమలోకానికి విందు గుడపాలనేగా మీరంతా కోరేది? సరే మీ కోరికే నెరవేరుగాక !

**నేను నిర్మించినట్టి అనేక కృతులు**
**శ్రుతులుగా - ఇలకిడుగాక సుఖము; నిష్ఫ**
**లమ్ముగా కాలయోని గులాబి వోలె**
**బ్రతుకుదును గాక తెలియని వెతల తోడ !**

*(వ్యాసుడు కన్ను లొత్తుకొని, పెడ మొగమై నిలుస్తాడు. నారదుడు జాలిగా అతడి భుజం మీద చేయి వేస్తాడు.)*

నారదుడు : మహామనీషీ ! పాలు త్రాగి రొమ్ము గ్రుద్దే లోక స్వభావం గురించి - ఎందుకింత రణగోల? వాస్తవంగా - ఏది నీ దుఃఖస్వరూపం? ఎందుకు ఇంత వ్యాకుల పడుతున్నావ్?

వ్యాసుడు : (చిరునవ్వుతో) నాకు తెలిస్తేగా? కురుక్షేత్ర కల్లోలం శాంతి పర్వంతో శాంతించ లేదు ! (భయపడుతూ) ఓహో, ఆ యుద్ధ బీభత్సం ! ఆ భీకర భేరీ వికటాట్టహాసాలు ! ఆ రక్తమాంస కంకాళ కరుణావిల దృక్కులు ! మానవుణ్ని ఆవేశించిన ఈ అజ్ఞతకు, అహంకృతికి, దైన్యానికి, దుఃఖానికి విరుగుడు లేదా? తరణోపాయమే లేదా? నా అనాసక్తయోగం కూడ నన్ను రక్షించలేక పోతున్నది. దేవర్షీ! *(విలవిల్లాడి పోయి, పడిపోతాడు. నారదుడు పట్టుకొంటాడు)*

నారదుడు : నిజంగా కవి వనిపించావయ్యా, సాత్యవతేయా ! తనను తాను హరింపజేసుకొంటూ, లోకానికి వెలుగును ప్రసాదించే మైనపు వత్తే కదా కవి అంటే ! ఆ వెలుగులో మణులే కాదు, మట్టి పాత్రలు సైతం ప్రకాశిస్తాయి కాదా? ఆ ప్రకాశమంతా నీ ప్రకాశం వున్నంత వరకే ! ఇప్పుడు - నీవు వ్రాసిన దంతా ఒక యెత్తు. నీ జీవిత వృత్తాంతం ఒక యెత్తు. జ్ఞానమే మోక్ష మార్గమని నీవు చెప్పావు. భక్తే మోక్షమార్గమని నీ జీవితం చెపుతున్నది ! నీ జీవిత వాస్తవానికి వాస్తవికమైన సృష్టిని నీవు ఎందుకు చేయవు?

వ్యాసుడు : (ఆలోచనలో పడి) ఇంతవరకు నేను చేసిన కృషి అంతా వ్యర్థ మనేనా నీ భావం?

నారదుడు : కాదు, వ్యర్థం కాదు. ఇంత వరకు నీవు నిర్మించిందంతా పునాది. దానిపై ఆనంద మందిరాన్ని రూపొందించు ! భక్తికి తావలమైన భాగవతాన్ని ప్రతిపాదించు !

వ్యాసుడు : అంతటి శక్తి ఇప్పుడు నాకెక్కడిది?

నారదుడు : అందుకు నీవు శక్తిని గోరి తపస్సు చెయ్యి! నీ కోర్కెలు రెండూ ఒకేసారి తీరగలవు. భాగవత మంటే భక్తి. భక్తి ప్రేమకు పరాకాష్ఠ. నీ ప్రేమకు ఆశ్రయం ఘృతాచి. ఆమె ఇప్పుడు స్వర్గంలో వుంది కాని, నీ మీద గల ప్రేమచే, ఆమె అప్పుడప్పుడు చిలుక రూపంలో వచ్చి, నీ సమక్షంలో విహరించి పోతూ వుంటున్నది. ఆమె నీలో ఐక్యం కావడం, నీవు భాగవతంతో తాదాత్మ్యం పొందడం - ఈ రెండూ ఫలసిద్ధి పొందడానికి శక్తిని గోరి తపస్సు చెయ్యవలసిందే. ఈ విషయం నీకు చెప్పి పోదామనే వచ్చాను. అన్నట్టు, నేను కూడ నీ శిష్యుడనే కదా! నాకు కూడా ఏదైనా పని చెప్పు.

వ్యాసుడు : సరే, కానీ ! పంచమవేదమైన మహాభారతాన్ని దేవ లోకంలో ప్రచారం చేయి. నారాయణ ధుని నుంచి నారాలను సర్వలోకాలకు పంచి పెట్టే సార్థక నామధేయుడివి.

నారదుడు : నీవు వ్యాసనారాయణుడివి. గురుదేవా! ఇక నుంచి నేను పంచమ వేద నారాయణుడ్ని.

(నారాయణ నామ గానంతో నారదుడు నిష్క్రమిస్తాడు. వ్యాసుడు చేతులు మోడ్చి నిలబడతాడు.)

కథకుడు : ఆవిధంగా నారద ప్రేరితుడై, వ్యాసుడు యావద్భూమినీ ఒకసారి పర్యటించి, హేమగిరిపై తపస్సు చేశాడు. అతడికి శివుడు ప్రత్యక్షమై, భాగవత రచన లోకోత్తరంగా కొనసాగ గలదని, పంచభూతసముడు, బ్రహ్మ స్వరూపుడు అయిన కుమారుడు కలుగ గలడని వరం ఇచ్చాడు. తపస్సుచే, శివుని వరాలచే బలవంతుడైన వ్యాసుడు భాగవత రచన పూనుకొన్నాడు.

(అంతవరకు వెలుగు చీకట్ల మధ్య వున్న వ్యాసుడు ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాడు. ధూపం పల్చబడింది. వ్యాస శిష్యులు రంగంలోకి ప్రవేశించారు. భాగవతం బృందగానం చేసుకొంటూ)

**బృందగానం**

నమః పరస్మై పురుషాయ భుయసే
సదుద్భువ స్థాన నిరోధ వీలయా
గృహీత శక్తి త్రితయాయ దేహినా
మంతర్భు వాయా సుపలభ్య వర్మనే !

య త్కీర్తనం యత్సరణం యదీక్షణం
యద్వందనం యచ్ఛ్రవణం యదర్హణం
లోకస్య సద్యో విధు నోతి కల్మషం
తస్మై సుభద్ర శ్రవసే నమోనమః !

యస్యాత్మ నీదం నిజమాయ యార్పితం
క్వచి ద్విభాతం క్వచతత్తి రోహితం

ఆవిద్ధ దృక్సాక్ష్య భయం తదీక్షతే
స ఆత్మమూలోవతు మాం పరాత్పర :

ది దృక్షవో యస్య పదం హి మంగళం
విముక్త సంగా ము నయస్సు సాధనః
చరంత్య లోక వ్రత మపుణం వనే
భూతాత్మ భూతా సుహృదస్సమే గతి :

(తర్వాత వారు వ్యాసుని చుట్టూ కూర్చుని వ్రాత ప్రారంభిస్తారు. వ్యాసుడు భాగవత రచనను కొనసాగిస్తున్నాడు.)

వ్యాసుడు : అథ సర్వగుణోపేతః
కాలః పరమ శోభనః
య ర్హ్యే వా జన జన్మ రక్షం
శాంతరక్షం గ్రహో తారకం -

మందం మందం జలధరా
గర్భు రమ సాగరం
నిశీధే తమ ఉద్భూతే
జాయ మానే జనార్ధనే -
సవిస్మ యోత్ఫుల్ల విలోచనో హరిం
సుతం విలోక్యానక దుందుభి స్తదా
కృష్ణావతారోత్సవ సంభ్రమో స్ప్ళ
శ న్ముదా ద్విజేభ్యో యుత మాప్లుతో గహం -

(ఆ సమయంలో రంగంలోకి ఒక చిలుక ఎగిరి వస్తుంది. మెల్ల మెల్లగా తెర జారుతుంది. భాగవతం వినిపిస్తూనే వుంటుంది.)

# వేదవ్యాసుడు

## అంకం అయిదు

(వ్యాసుని ఆశ్రమం చాలా అందంగా వుంది. పుష్ప ఫలాదులతో, శుక శారికాదుల గాన లీలలతో, మనోమోహనంగా వుంది. ఒక చక్కని శుకం క్రింది వాలి, వ్యాసుని పీఠంపై కూర్చుని పాడుకొంటున్నది. అప్పుడు వ్యాసుడు పాడుకొంటూ రంగంలోకి ప్రవేశించాడు. అతడు చాల కొత్తగా కనిపిస్తున్నాడు. ఏదో మధుర భావ మోహితుడుగా వున్నాడు.)

వ్యాసుడు :

**తమద్భుతం బాలక మంబు జేక్షణం**
**చదుర్భుజం శంఖగదాద్యుదాయుధం**
**శ్రీవత్స లక్ష్మం గళ శోభి కౌస్తుభం**
**పీతాంబరం సాంద్రపయోద సౌభగం !**

ఓహో ! శ్రీకృష్ణ పరమాత్మ ! తామరాకులో పరుండబెట్టబడ్డ ఆ బిడ్డడు వటపత్రశాయి వలె ఎంత దివ్య సుందరంగా వున్నాడు ! ఎంత ముద్దొస్తున్నాడు !

**అవతరించెను శ్రీకృష్ణు, డవతరింప**
**వలయు శ్రీ శుకు డిక, భాగవతము పండ !**
**ఇహ పరబ్రహ్మ మూర్తులీ యిర్వురకును**
**తండ్రి యౌవాని కన్నను ధన్యు డెవడు ?**

భాగవత నాయకుడు శ్రీకృష్ణుడు. భాగవత ప్రవర్తకుడు శ్రీశకుడు. ఘృతాచి శుకరూపంలో నన్ను అనుసరించి వున్నదన్నమాట ! అందుకే నా మనస్సు శ్రీశుక రూపం దాల్చి ప్రవర్తిస్తున్నది. ప్రతి లోకంలోను, ప్రతి వసంతంలోను, ప్రతి చిలుకా నా ప్రియురాలుగనే కనిపిస్తుంది. నేనే శుక రూపం దాల్చిన ఘృతాచి నైనాను.

(అప్పుడు హఠాత్తుగా, తన పీఠం మీద నిల్చి వున్న శుకాన్ని చూచి, ఉద్రిక్తుడై, దానిని పట్టుకోబోతాడు. అది ఎగిరిపోతుంది. దానికేసి చేతులు చాచి –)

వ్యాసుడు : ఘృతాచి ! ఇక నీవు నన్ను ఏమరించలేవు –

వేదాలు విభజించి వేద వ్యాసుడ నైతి,
ప్రజకు తత్త్వము చెప్పి పౌరాణికుడ నైతి
భారతము నిర్మించి భగవానుడె యైతి
ప్రాభవములిన్ని నీ ప్రణయమ్ము వెనుకనే !

శుకమవై నీవు నా సుఖమునే యెత్తుకొని
ఎగిరి పోయెద వేలనే చెట్ల కొమ్మలకు ?
నేను రాలేను, నీవే రమ్ము ! దిగిరమ్ము !
ప్రియతమా, వచ్చి నా హృదయమ్ము త్రచ్చుమా !

(చిలుకను అనుసరిస్తూ నిష్క్రమించి, ఘృతాచితో ప్రవేశించాడు వ్యాసుడు. రంగం దివ్యసౌందర్య కాంతులతో జిగేలు మన్నది. ఆమె చేయి పట్టుకొని రంగం ఎదటికి నడిపించుకుని వచ్చాడతడు. అప్పుడు ఆమె అతడి ముందు మోకరిల్లి, పాదాలపై తన బుగ్గలు అన్చుతుంది. అతడు కంపిస్తున్న చేతులతో ఆమెను లేవనెత్తుతాడు.)

ఘృతాచి : (అంజలి ఘటించి) ప్రాణపతీ ! ప్రభూ !

ప్రణత దేహినాం పాప కర్శనం
తృణ చరానుగం శ్రీనికేతనం
ఫణి ఫణార్పితం తే పదాంబుజం
కృణు కు చేషు నః కృంధి హృచ్ఛ యం

వ్యాసుడు : (మోహంలో ఆశ్చర్యం కలిసిన చూపుల్ని ఆమెపై నిల్పి) ఓహో, సుందరీ, ఆ శ్లోకం నేనింకా చెప్పనే లేదే! నా హృదయంలో ఇంకా మొగ్గగా వున్న భావం నీ వాక్కుపై ఎలా వికసించింది?

ఘృతాచి : (వినయంగా) మీ హృదయమే నాలో వున్నప్పుడు దానిలోని మొగ్గ నా పెదవులపై ఎందుకు వికసించదు?

వ్యాసుడు : నా హృదయమా?

ఘృతాచి : అవును. అది ఇప్పుడు నా దగ్గరే వుంది. దానితో పాటు భాగవతం అంతా వుంది ! అందులోని శ్రీకృష్ణ పరమాత్మ నాకు మీరే ! నేను మీ సహస్రాధిక గోపికలలో ఒకతెను. అంతకంటె అధికురాలను. వారికి కృష్ణుడి పునర్దర్శనం లభించలేదు. నాకు మీ పునర్దర్శనం లభించింది. ఈ జగత్తులో నన్ను మించిన ధన్యజీవులు మరి లేరు. ఒకసారి మీ సాంగత్యం లభించిన తర్వాత, మీరు తప్ప నాకు మరొక పరమార్థం లేదు.

**వంశీ విభూషిత కరాత్**
**నవ నీరదాభాత్**
**పీతాంబరాత్ అరుణ**
**బింబ ఫలాధ రోష్ఠాత్**
**పూర్ణేందు సుందర ముఖాత్**
**అరవింద నేత్రాత్**
**కృష్ణాత్పరం కి మపి**
**తత్వమహం న జానే.**

*(వంగి, వ్యాసుని పాదాలు స్పృశిస్తుంది. వ్యాసుడు కరిగి పోతాడు)*

వ్యాసుడు : ప్రియా ! నీ ప్రపత్తి రూపమే నా భాగవతం ! (ప్రహర్షంతో నిమీలిత నేత్రు డవుతాడు.)

ఘృతాచి : ప్రభూ ! మీ కోసమే నేను భూలోకంలోకి వచ్చాను. మీరే నా కృష్ణ తత్త్వం. మీ కంటే నాకు మరేమీ తెలీదు !

శాపవశమున పుట్టి, మీ శయ్య జేరి,
ప్రేమతత్త్వము తెలిసి, తరించి తేను !
హృదయమును నమ్ముకొన్న ఏ మృగము కైన
దారి దొరుకుట కేనె నిదర్శనమ్ము !

వ్యాసుడు : (ఆవేశంతో) ఘృతాచి ! ఎంత ధన్యురాలవు !

నీకు నచ్చినవానికి నిన్ను నీవు
హృదయపూర్వకముగ సమర్పించు కొన్న
మోక్షకాంతవు, నా మదిరాక్షి వీవు !
పురుషులకు లేదు నీకున్న పూర్ణ పదవి !

ఘృతాచి : అదంతా నాకు తెలియదు. కాని, పురుష హృదయాన్ని అభిముఖంగా త్రిప్పుకోడానికి స్త్రీ పడవలసిన బాధ - చెయ్యవలసిన త్యాగం - నరకం కంటె దుర్భరం కదా ! అయితే - అదొక్కసారి అభిముఖమై, స్త్రీ హృదయాన్ని స్వీకరించగల్గితే - ఆ తర్వాత అదేమైనా బాధలేదు. పురుషుని క్షణమాత్రాభిముఖ్యమే చాలు - స్త్రీని తనలో లయింపజేసుకోడానికి. అది ఛాయా చిత్రకళవలె - శాశ్వతా నందాన్నే ఇవ్వగలదు. అంబిక చెలికత్తెగా, తొలిసారి మీ పరిచయం. అప్పుడు నేను పరతంత్రను. స్వేచ్ఛ లేనిదే శాశ్వతానందం లేదు. ఇప్పుడు నేను స్వతంత్రను ! నన్ను నేను మనస్ఫూర్తిగా మీ కర్పించుకొన్నాను. మీ అనుగ్రహంతో మీలో - మీ ద్వారా పరమాత్మలో లయమైపోయాను. నేనిక ఘృతాచిని కాను. నామరూప రహితమైన వ్యాసప్రేయసిని. వేద వ్యాస హృదయ పద్మ సౌరభాన్ని. శుద్ధ నిర్గుణ తత్త్వాన్ని. శాశ్వత సౌందర్యాన్ని -

వ్యాసుడు : ఆగు ! ఆగు ! నాకు అలాంటి వేమీ వద్దు ! నాకిప్పుడు కావలసింది రూపగుణ సహిత అయిన ఘృతాచి ! సగుణ ప్రకృతి ! నా వంటి నిర్గుణ బ్రహ్మ నాకెందుకు?

ఘృతాచి : (మోహనంగా నవ్వి) క్షమించండి, నన్ను మీ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తింప జేసుకొండి.

వ్యాసుడు : నా ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించే బానిస కూడ నాకు వద్దు!

ఘృతాచి : (వ్యాసుని చెంపపై కొట్టి) మీకు బానిసా వద్దు, యజమానీ వద్దు ! పురుష ప్రకృతే ఇంత ! ఇదే స్త్రీ పై పురుషుని ఆధిక్యం! ఇది శాశ్వతంగా ఇలానే వుండు గాక !

తోటమాలియె లేకున్న తోట లేదు.
కర్షకుడు లేక అన్నము కలుగ దిలకు
సజ్జనుడొ, దుర్జనుడొ – పురుషాఖ్యుడొకడు
లక్ష్యమైన పై స్త్రీ మహాలక్ష్మి యౌను !

వ్యాసుడు : నేనే నీకు లక్ష్యమైనప్పుడు, నీవు శుకం ఎందుకయావు ?

ఘృతాచి : గత్యంతరం లేక సహజ ప్రకృతిపై నుంచి మీ దృష్టిని కృతక సౌందర్యం మీదకు మరల్చ లేక !

మీ కొరకు నేను ప్రకృతి తో మిళితమొంది
భూత పంచకరుచులతో భూషిత నయి,
మిమ్ము గొనలేక – చివరి యత్నమ్ముగాగ
చిలుకనైతి ! మీ పలుకులే చిత్తమిడితి !

అర్థమైనది యో లేదొ, అనవసరము
కొంచెమో గొప్పో, తర్కింపు కూడ వృథయె
హృదయ మెవరికి స్వేచ్ఛ నర్పించుకొనునొ
అతని గలియుటయే స్త్రీకి అమృత పదవి !

ఏది ? ఏమిటి? ఏల - అనే వితర్క
గుణము పరతంత్రునికి బాధ్యతను ఘటించు
పరమ బాధ్యుడు దైవ మొక్కరుడె కాన
అతని మీలోన చూచి దాసోహ మంటి !

వ్యాసుడు : అప్సరవై యైన, వేశ్యవీ వగుట, నీకు
ఆత్మ లేదని అనుకొందు రజ్ఞు లవని !
ఆత్మయే కాదు, ఆత్మ తత్వార్థ మెల్ల
నిన్ను గాకున్న న న్నుండెనే? ప్రియతమ !

నీవు రాధవై చూచు చున్నావు కృష్ణు !
నేను నందునై చూచు చున్నాను కృష్ణు !
కృష్ణు నే చూచు చుంటి మిర్వురము కూడ,
కృష్ణ తత్వము మనల రక్షించు గాక !

*(వ్యాసుడు ఘృతాచి చేతిని చేతిలోకి తీసుకుంటాడు. ప్రకృతి ఆనంద పులకిత అవుతుంది. రామచిలుకలు ఎన్నో జంటలు జంటలుగా వారి చుట్టూ బృంద నృత్యగానాదులు ప్రదర్శించినై. ఆకు పచ్చని కాంతి రంగంలో అలముకొన్నది. ఒకటి రెండుసార్లు రంగం చీకటై వెలిగింది. ఈలోగా ఒక దివ్యగానం లోపలినుంచి వినపడసాగింది. రంగం ధూపంతో నిండింది.)*

అప్సరో దివ్య సౌందర్య మాధుర్యాలు
యతుల మతులను విరచుటకు మాత్రమే కాదు :
రసదార్శనికులైన ఋషుల గుండెల నిండ
రాగామృతము నించుటయు వాటి ధర్మమే !

మానవుడు తరియించు మార్గమ్ములో నెవడు
పైనమై పోవునో వాడే మహార్షియౌ;
దివ్యుడై ఎవడు కాంతా సమ్మితమ్ముగా
కావ్యమ్ము నిర్మించునో వాడె కవి యౌను !

ఋషి కంటె, మతకర్త కంటె, దేవుడి కంటె
ఋజుధర్ముడే కవికి కాంతయైన ఘృతాచి
కాంతుచే వేదాలు వ్యాసీకరింపించె !
కాంతి మించిన వాని కనియిచ్చె నొక పుత్రు !

కనియిచ్చె శ్రీకృష్ణ కవితామ తల్లిలో,
శ్రీశుకుని కనియిచ్చె చెల్మిన్ ఘృతాచిలో,
ఇహపరోద్ధారకుల నిద్దరను ధర కిచ్చి
ధన్యుడైన కృష్ణద్వైపాయనుని గొల్తు !

*(ఈలోగా రంగం క్షణం సేపు చీకటై, క్రమంగా వెలుగు ప్రసరిస్తూ, ధూపం పలచబడుతూ, స్పష్టత ఏర్పడుతుంది. రంగంలో వ్యాసుడు, ఘృతాచి, వారి ముందు 12 ఏండ్ల బాల ఋషి శ్రీశుకుడు కనిపిస్తారు. శ్రీశుకుడు దివ్యదండ కమండల ధారి, దిగంబరుడు. దిగంబరతను ఆచ్ఛాదిస్తూ ఆజానులంచితమైన జడలు. గుండ్రని ముఖం, చిలుకముక్కు, నిత్యదరహాసం. ముద్దొస్తూ వున్నాడు. వ్యాసుడు అతణ్ని ఎత్తుకొని దించాడు. ఘృతాచి ముద్దు పెట్టుకొన్నది. శ్రీశుకుడు కొంచెం దూరంగా పోయి నిలబడ్డాడు. ఈలోగా కథకుడు కథ వివరించాడు.)*

**కథకుడు** : ఆ విధంగా ఘృతాచీ వ్యాసులకు శ్రీశుకమహర్షి పుట్టాడు. ఇర్వురి కోరికా నెరవేరింది. శ్రీశుకుడు పుట్టుకతోనే బ్రహ్మర్షి, బ్రహ్మ పదార్థం వలెనే జడుడు. దిగంబరుడు. ఘృతాచీ వ్యాసులు శుకరూప కాముకులు

కనుక శ్రీశుకుడికి శుకరూపం వచ్చింది. తల్లిదండ్రుల హృదయంలో అక్షర రూపంలో వున్న భాగవతం ఆ విధంగా శ్రీశుకుడై అవతరించింది.

(అప్పుడు ఘృతాచి శ్రీశుకుని జేరి, మళ్ళీ ముద్దు పెట్టుకొని, ఆశీర్వాదం ఇచ్చింది).

ఘృతాచి : తండ్రి నన్నిట మించిన తనయుడ వయి,
పూర్ణుడవయి, తరింపుము పుత్ర ! పంచ
భూతముల వలె ఎల్ల జీవులకు సముడ
వై తరింప జేయుము భాగవతుల జేసి !
(తర్వాత వ్యాసుని జేరి, పాదాలు కళ్ళ కద్దుకొని)
ఏ మహాభాగు హృదయాన హృదయ ముంచి
ధన్యురాలనై తరింపదలచి నానొ
ఆ మహా భాగధేయ దివ్యానుభూతి
నేడు సిద్ధించి సిద్ధి పొందించె నన్ను !

కొడుకు తోడిదె మీ కింక కువలయమ్ము !
నాకు మీతోడివే ఎల్లలోకములును ;
కార్యరూపముతో చాల కష్టపడితి,
కారణమ్ముగ ఇక మిమ్ము కలిసిపోదు !

వ్యాసుడు : (వ్యాకులుడై) ప్రియా ! ఎంతలో ఎంత విరక్తవైనావు !
నిన్ను తొలిసారి వే కనుగొన్న యపుడె
సాంఖ్య చరణమ్ము గీతకు సంతరిల్లె !
పదియు నెన్మిది చరణాల పాట గీత,
పాట కంతకు శ్రుతి వీవ ! స్వరము నీవ !

నీవు పాట కాగ, నిను పాడుకొనుటచే
పురుష నేను పరమపురుష నైతి
పరమ పురుష డాత్మ పారమ్యమును చేర
శుకమవైన నిన్ను శుకుడనైతి !

వివిధ కావ్య పురాణ వితతితో బల మొంది
వేదాలు వికసించి వేదాంత మగుదాక
గీతఫలము కోసి గీర్వాణి కిడు దాక
నా కృషికి పొల మీవుగా కెవ్వరే, సఖీ ?

అట్టి నీవు – ప్రతిక్షణమూ నన్ననుసరించి వున్న నీవు – ఇక నాకు కనిపించవా? ఇది వరకే నాలో కారణ రూపమై లేవా నీవు? కార్యరూపం విడవడం నిష్కారణం కాదా? ఇక నేను జీవితంలో చివరి మజలీ చేరుకొన్నట్టేనా? నీవు నాలో కలిసిపోతే – నేను ఎక్కడ కలవను?

(ఇంత వరకు నిరామయంగా ఎక్కడో చూస్తున్న శ్రీశుకుడు వారికేసి తిరిగి పకాలున నవ్వుతాడు. ఇద్దరూ ఆశ్చర్యంగా అతడికేసి చూస్తారు.)

శ్రీశుకుడు : నీవు నాలో కలు, నాన్న !

వ్యాసుడు : మరి నీవు?

శ్రీశుకుడు : నేనా? నేను నీలో కలుస్తాను.

తల్లి తండ్రిలో, తండ్రి ఆత్మజునిలోన,
ఆత్మజుడు పరమాత్మలో ఐక్యమొందు ;
భ్రమకు తావలమైన ఈ భ్రమణ మందు
చిక్కుకొన నేల నీ వంటి శ్రీశ్వరుండు?

వ్యాసుడు : (ప్రేమావేశంతో అతణ్ని కౌగలించుకొని) తండ్రీ ! మీ అమ్మ అన్నట్టు, నీవు నాకంటె గొప్పవాడివే కాదు – ఆత్మజ్ఞానంలో నీవు నాకు గురువవు!

అర్థ మవక కాదు, అది తెలియక కాదు,
క్రాంతి పరిధి నిన్ను కనక కాదు ;
కర్మ ఫలము పండకయె లేదు మోక్షమ్ము !
ప్రాకృతుడను నేను, పరుడ వీవు !

నేను తీగను, నాదు ప్రసూన మీవు !
ఐక్యమై పోవు గాక మీ అమ్మ నన్ను !
పరిమళింపుము నీవు ప్రపంచ మెల్ల
జీవలోకము అద్వైత సిద్ధి పొంద !

(ఘృతాచి చేతిని చేతిలోకి తీసుకొని) ప్రియా! నీ నిర్ణయం తిరుగులేనిదే అయితే –

ప్రియతమా, రమ్ము ! ఇదిగొ నాహృదయ జలధి !
సంగమింపుము గౌతమీ గంగ వోలె !
కణములో కణ, మణువులో అణువు వగుచు
కలసి పొమ్మాత్మ పరమాత్మ గలియు నట్లు !

(వ్యాసుడు మహా సమాధి నిష్ఠుడై నిలబడతాడు)

ఘృతాచి : (ఆనందంతో అతడికి సాష్టాంగపడి, ముమ్మారు ప్రదక్షిణ చేసి)

పురుషుడొ నీకు ప్రకృతి నై పరుగు దేని,
అన్ని రుచులందు నీకు ప్రేయసినె యేని,
స్త్రీ పురుషతత్త్వమున కిదె సిద్ధి యేని,
ఇపుడు నేను నీలోన లయింతు గాక !

*(ఒక అపూర్వ సంఘటనకు సూచనగా రంగంలో రంగులు కొట్టుకొన్నై. ధూపం ప్రజ్వరిల్లింది. ఒక్క క్షణం పాటు జిగేలుమని రంగం మళ్ళీ స్పష్టమయింది. రంగంలో*

ఘృతాచి లేదు. వ్యాసుడు శ్రీశుకుని కౌగలించుకొంటుండగా తెర జారుతుంది. తెరలో నుంచి *గీతాగానం* వినపడుతోంది.)

## గీతాగానం

సర్వభూతస్థ మాత్మానం
సర్వభూతాని చాత్మని
ఈక్షతే యోగ యుక్తాత్మా
సర్వత్ర సమదర్శనః

యోమాం పశ్యతి సర్వత్ర
సర్వంచ మయి పశ్యతి
తస్యాహం సప్రణశ్యామి
సచ మే న ప్రణశ్యతి

భక్త్యా మా మభి జానాతి
యా వాన్ య శ్చాస్మితత్త్వతః
తతో మాం తత్త్వతో జ్ఞాత్వా
నీశతే తదనంతరం !

# వేదవ్యాసుడు

## అంకం ఆరు

*(వ్యాసాశ్రమం, రంగం నిండా ఆకు పచ్చని కాంతి వ్యాపించి వుంది. శ్రీశుకుడు తనలో తానే మాట్లాడుకొంటూ, బయలుతో ఆడుకొంటూ వున్నాడు.)*

శ్రీశుకుడు : (ఆకాశంలోకి చూచి) ఏమిటే అంటున్నావ్ ? అ-ఉ-మ- హహ్హహ్హహ్హహ్హ! (పగలబడి నవ్వి) నీకు ఓనమాలైనా వచ్చు! నా కవీరావు ! (నిట్టూర్పు విడుస్తాడు.)

ఎందుకలా భుజం తడతావు? వీపు తట్టు ! (వంగుతాడు) నీ చిరునవ్వు మంటలు, ఆ లోపలి నీ దంత చూర్ణం - ఎందుకే అలా ప్రదర్శిస్తావు? వీపు తట్ట మంటే, ముఖం మాడ్చమనా? (వెనక్కి తిరిగి చూచి) కన్నీరు తేకు, ప్రియతమా! నేర్చుకుంటానులే నీ ఓనమాలు ! మా నాన్న నడుగుతాను - రాగానే !

ఓహో ! ఇంత మాత్రం దానికే నాకు దీప ధూప నైవేద్యాలా?

*(రంగం ధూపంతో గుప్పుమంటుంది. రంగు కాంతి ప్రసరిస్తుంది. పుష్ప ఫలాదులు వర్షిస్తే. శ్రీశుకుడు ఆనందంతో గంతులు వేస్తాడు. అప్పుడు ఒక ప్రక్కగా వ్యాసుడు ప్రవేశిస్తాడు. వాత్సల్యాతిరేకతతో భాసిస్తున్న దతడి ముఖం. శ్రీశుకుణ్ని చాలా సేపటి నుంచి చూస్తున్నా డతడు.)*

వ్యాసుడు : **పవన మటు వీచు, అగ్నిలా ప్రజ్వరిల్లు,**
**జలము వలె ప్రవహించు నైజప్రవృత్తి !**
**ఆడుకొను బయలుతో గ్రుద్దులాడు కొంచు !**
**తల్లి లేనప్పు పంచభూతములె తల్లి !**

జడుని మాదిరి నుండును, జడుడు కాడు;
చంచలుండయి తిరుగును, చపలి కాడు;
చూడ నట్లుండు, అంతయు చూచుచుండు;
రాశిపోసిన పరమాత్మ శ్రీశుకుండు !
(అంతలో అతణ్ని శ్రీశుకుడు సమీపిస్తాడు.)

శ్రీశుకుడు : నాన్నా !

మాటి మాటికి ఈ మహాంబరము నన్ను
ఓ న మా లైన రావంచు నుడికిలించు !
తక్కు దెయ్యాలు నికిలించు దాని తోడ !
ఏమి టా ఓ న మాలు ? నా కెరుగజెప్పు !

వ్యాసుడు : (అతణ్ని ఒడిలోకి తీసుకొని) తండ్రీ !

అంబరము ఓనమాలకు అమ్మయైన,
నీవు అయ్యవు సుమ్ము, బ్రహ్మావధాని !
భూతతతి యిట్లు నీమీది బుద్ధి చేత
వెంటబడుచునుండును, లోకు వీయ వద్దు !

వెక్కిరించు వారు, వెంటాడి పీడించు
వారు, దోష మెంచి దూరువారు,
నిన్ను మీర లేక ఖిన్నులై మనువారె
కాన, లెక్కగొనకు కాని వారి !

బ్రహ్మ విదుడ వీవు, భాగవతుడ వీవు,
లేదు నీకు తెలియలేని విద్య;
అవసరమ్ము లేదు అభ్యసింపగ వేరె !
తపము చేయు మొక్క తరిని నిల్చి !

శ్రీశుకుడు : బ్రహ్మవిదుడనె యైనను పామరుడను,
భాగవతుడనె యైనను ప్రాకృతుడను,
గురువు లేకుండ విద్యలు కుదురు కొనవు !
కాన, చదివింపు, మా పైని మౌని నౌదు !

వ్యాసుడు : (ఆలోచించి) సరే, తండ్రీ ! అలానే చదువుకో ! ముందు మిథిలకు పోయి, జనక మహారాజును చూడు. ఇంకా అనుమానం వుంటే దేవగురువైన బృహస్పతిని చూడు. కోరిన విద్యలేవో నేర్చుకొనిరా ! నీవు వచ్చేవరకు నిమిషం ఒక యుగంగా గడుపుతాను.

శ్రీశుకుడు : (చిరునవ్వుతో తలవూపుతూ) ఒక్క నిమిషంలో వచ్చెయ్యనూ? (శ్రీశుకుడు నిష్క్రమించాడు. వ్యాసుడు తపస్సులో కూర్చున్నాడు. రంగం ధూపంతో నిండింది. కథకుడు భాగవతం వినిపించసాగాడు.)

కథకుడు : పుష్కరే మధురాయాంచ

ద్వారవ త్యాంయతాత్మవాన్
ఉషోష్య సంహితామేతాం
పఠిత్వాముచ్యతే భయాత్

దేవతా మునయః సిద్ధాః
పితరో మనవో నృపాః
యచ్ఛన్తి కామాన్ గృణతః
శృణ్వతో యస్య కీర్తనాత్

నామ సంకీర్తనం యస్య
సర్వ పాప ప్రణాశనం
ప్రణామో దుఃఖ శమన స్తః
నమామి హరిం పరం

*(అంతలోనే శ్రీశుకుడు రంగంలోకి ప్రవేశించాడు. వ్యాసుడు - ఎంతో వియోగం తర్వాత వలె - గాఢంగా కౌగలించుకున్నాడు.)*

**శ్రీశుకుడు** : నాన్నా! జనకమహారాజును, అతని ఆస్థానములోని మహాపండితులను చూశాను. వారి చర్చలు, గోష్ఠులు, అన్ని వట్టి కాలక్షేపం కోసం! రాజసం అహంకారం, సేవాభావం తప్ప అక్కడ జ్ఞానం లేదు. దేవగురువును కూడా చూశాను. ఆయన నీ సామవేదాన్ని పాడుకొంటూ కూర్చున్నాడు. భౌతిక భోగాలే తప్ప, ఆత్మ సౌందర్యం లేదక్కడ!

**వ్యాసుడు** : (తలపంకించి) అంతే నన్నమాట?

**శ్రీశుకుడు** : అంతే, నాన్న! జనకుడు మాత్రం నాకో సలహా ఇచ్చాడు. పెళ్ళాడి, పిల్లల్ని కనాలట నేను! ఆత్మ కంటే శరీరానికి ఆధిక్యం కలచోట జ్ఞానం ఎక్కడిది? స్వర్గపురిలో అంతకన్న తమాషా ఒకటి జరిగింది! ఎవరో రంభ అట! ఆమె నా వెంట పడింది! నేను పారిపోయి వచ్చేశాను.

**వ్యాసుడు** : (నవ్వుతూ) మంచి పని చేశావు! జనకుడికి, బృహస్పతికి కూడ జ్ఞానం లేదంటున్న నీకు ఎవరేమి చెప్పగలరు!

**శ్రీశుకుడు** : (ఉత్సాహంతో) నీవే చెప్పగలవు! నీవేమి చెప్పినా వింటాను!

**వ్యాసుడు** : భాగవతాన్ని మరోసారి చూడు!

**శ్రీశుకుడు** : ఓ తప్పకుండా చూస్తాను. (నిష్క్రమిస్తాడు)

**వ్యాసుడు** : (అతడి దారి వంకే చూస్తూ) పిచ్చి తండ్రీ!

**పాలు పిలికెడు నంత సేపైన నొక్క**
**చోట నిలువడు : తెలియని మాటలేదు :**

శూన్యమును మించి చూచెడి శోభ లేదు !
ఎట్లు శిక్షింతు ? ఏ చదువెట్లు చెపుదు ?

(నిర్వేదంతో పైకి చూస్తూ) ఘృతాచీ ! ప్రియా ! ఆనాడు విదురుణ్ని కన్నావు. అతడు నీతి విశారదుడై, లోకవృత్తంతో కలిసి, లోకవిఖ్యాత ఖ్యాతి నార్జించి వెళ్లిపోయాడు. అతడు ఎవరికీ ఎట్టి సమస్యా కాలేదు. మహానుభావుడు. నిజానికి నైతికులు లోకంతోపాటు పోతూ లోక సన్మానితు లౌతారు ! ఇప్పుడు ఈ శ్రీశుకుణ్ని కన్నావు ! ఇతడు ఆకాశంతో తప్ప మాట్లాడడు ! గాలికి తప్ప చలించడు ! అగ్నికి తప్ప కన్నెత్తడు! నా పంచప్రాణాలూ ఇతడిలో గూడు కట్టుకున్నై! ఇతణ్ని నేను ఎలా అదుపు చెయ్యగలను ?

(అంతలో శ్రీశుకుడు ప్రవేశిస్తాడు - భాగవత సంహితతో)

శ్రీశుకుడు : నాన్నా ! భాగవతాన్ని ఆద్యంతమూ మరోసారి చూశాను. అయితే -

సృష్టి నీది నాది ప్రతిష్ఠ; చూడ నందు
నీవు నేనును తప్ప నింకేమి కలదు?
నన్ను నిన్ను మించిన మహానందమేదొ
దాని నెరిగింపు మయ్య ! నా దారి బోదు !

వ్యాసుడు : (దిగ్భ్రమతో) తండ్రీ ! ఆ మహానంద మేదో నీకు తెలియకనా నన్నడుగుతున్నావు? అది నీవే ! ఆ మహానందం నీవే !

శ్రీశుకుడు : నేనా ? ఎలా నేను ? ఏమిటి నేను ?
(తొందరపెడుతూ) చెప్పు, నాన్నా ! ఎవరు నేను?

వ్యాసుడు : (దిగాలుపడి, ధైర్యం తెచ్చుకొని) చూశావు కదా భాగవతం ?

శ్రీశుకుడు : ఓ చూశాను !

వ్యాసుడు : దానిని ఎవరు ఎవరికి చెప్పారు ?

శ్రీశుకుడు : నేను పరీక్ష న్నరేంద్రుడికి చెప్పాను !

వ్యాసుడు : మరి – చెప్పావా ?

శ్రీశుకుడు : (ఆశ్చర్యంగా) ఇంకా లేదు !

వ్యాసుడు : (చిరునవ్వుతో) వెళ్ళి చెప్పిరా ! పరీక్షన్నరేంద్రుడు శమీక శిష్యుడైన శృంగిచే శపించబడి, మృత్యువుకు ఎదురుచూస్తూ, మృత్యువును మించిన ఘోరయాతనలో పడి వున్నాడు. అతడికి భాగవతాన్ని వినిపించి, భీతిని తొలగించి, మనస్సును భగవదాయత్తం చేసి, కైవల్యాన్ని ప్రసాదించి రా!

శ్రీశుకుడు : ఓ, క్షణంలో చేసి వస్తాను . (నిష్క్రమిస్తాడు)

వ్యాసుడు : (నిట్టూర్చి) గోదోహన మాత్ర కాలం మించి ఎక్కడా నిలవని వాడు ఏడు రోజుల పాటు భాగవతాన్ని ఎలా వినిపించగలుగుతాడో ! పరీక్షిత్తు నెలా తరింపజేస్తాడో ! (ఆలోచించి) అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పి కాని కదలని గుణం వుంది కనుక పర్వాలేదు. జవాబు ముగియగానే ప్రశ్న వేస్తూ పోతే, ఎన్నిరోజులైనా అతణ్ని ఒకచోట ఆపి వుంచవచ్చు. ఈ రహస్యాన్ని పరీక్షిత్తుకు స్ఫురింపచేస్తాను.

*(వ్యాసుడు ధ్యాన ముద్ర దాల్చి నిలుస్తాడు. రంగంలో ధూపం వ్యాపించింది. అతడు యోగ దృష్టితో శ్రీశుకుణ్ని చూస్తున్నాడు. ఆ విషయాలను కథకుడు సామాజకులకు వివరిస్తున్నాడు.)*

కథకుడు : శ్రీశుకుడు హస్తినకు బైలుదేరాడో లేదో – అప్పుడే అక్కడకు చేరుకున్నాడు ! ఓహో, అతడి వేగం ! అది వాయు వేగం ! అది

వాయు వేగం కాదు. మనోవేగం ! యమున మధ్య ఒంటి స్తంభం మేడలో నివసిస్తున్న పరీక్షిత్తును చేరాడు ! భాగవతం వినిపించసాగాడు. శ్రీశుకుడు పరీక్షిత్తుకు ముత్తాత. అయినా పరీక్షిత్తే శ్రీశుకుడికి తాతలా కనిపిస్తున్నాడు. శ్రీశుకుడు నిత్యయౌవనుడు. పరీక్షిత్తు మృత్యుభీతితో మరీ కృంగి పోయి వున్నాడు. భాగవతం వింటున్న కొలదీ అతడు తేరుకోసాగాడు. ప్రశాంతుడు కాసాగాడు. ఇక్కడ వ్యాసుడికి మాత్రం ఆందోళన ఎక్కువ కాసాగింది.

*(రంగంలో ధూపం తగ్గింది. వ్యాసుడు కళ్ళు తెరిచాడు.)*

వ్యాసుడు : ఏడు దినా లెంతలో గడిచిపోతై ? (నిట్టూర్చి) శ్రీశుకుడిక వచ్చేస్తాడు ! రాగానే, బ్రహ్మ తత్వం చెప్పమంటాడు. చెప్పిన తక్షణం - ఇంతేనా అనుకొంటూ - తన దారిన తాను పోతాడు. అతన్ని విడిచి బ్రతకడం ఎలా ? మమతలు, మమకారాలు తల్లిదండ్రులకే కాని, బిడ్డలకు ఉండవు కదా ? పైగా -

**తల్లి నన్ను గలువ, తల్లియు తండ్రియు**
**నేన యౌట, నన్ను నేచు నిట్లు**
**కొడుకు ప్రేమ రెండు గుండెల బిగువుతో,**
**ఎంత తత్వ మెరిగి యేమి ఫలము !**

(ఆలోచించి) జనకమహారాజు చెప్పిన సలహాను పాటించడం కన్న గత్యంతరం లేదు. కాని, అతడి మనస్సు సంసారం మీదకు మళ్ళించడం ఎలా ? శూన్యం తప్ప దేన్నీ చూడడే, స్త్రీనెలా చూస్తాడు ! (జ్ఞాపకం వచ్చి) రంభ ఈ విషయంలో సహాయపడ గలదేమో ! ఒక్క క్షణమైనా అతడు తన దృష్టిని రంభ మీద నిలపగలిగితే చాలు !

స్త్రీని చూడనంతసేపు జడత్వమ్ము,
చూచినంతసేపు సుందరమ్ము,
చూచి విడుచు వెనుక సుఖ దుఃఖ సంసార
సాగరమ్ము, మోహవాగు రమ్ము !

స్త్రీతో పరిచయం ఉన్నా కష్టమే, లేకున్నా కష్టమే. అయినా, శ్రీశుకుణ్ని నిల్పుకోవాలంటే అతణ్ని వ్యామోహపరచక తప్పదు. ఒక చోట నిలకడ కలిగిన తర్వాత – అతడు మంచి తపస్వి కాగలడు. రంభను రప్పించి ఆమె సహాయం కోరతాను.

(నిష్క్రమిస్తాడు. తెర)

# వేదవ్యాసుడు

## అంకం ఏడు

(వ్యాసాశ్రమం, ఋతురాణి తన అన్ని అందాలతోను అలంకరించి పెట్టింది దాన్ని. జ్ఞాన వృక్షం శృంగారం పూచి పరిమళిస్తున్నట్టున్న దది. అట్టి ఉత్తేజక రంగంలోకి ఉత్సాహంగా ప్రవేశిస్తాడు. శ్రీశుకుడు మరీ పరధ్యానంగా వున్నాడు. తండ్రి కోసం అటూ, ఇటూ చూశాడు. అప్పుడు లోపల నుంచి ఒక చక్కటి పాట వినిపించసాగింది. గానం మనోహరంగా వుంది. అతడు ఒక చెట్టు కొమ్మకు అనుకొని నిలబడ్డాడు. పాటకు అనుగుణంగా మన్మథ వయస్యలంతా రంగంలో నృత్యం చేయసాగారు. ధూపం పలుచగా వ్యాపించి వుంది. పూలు, తుమ్మదలు, కోకిలలు, వెన్నెల వగైరాలతో ఛాయా నృత్యం ప్రదర్శించవచ్చు. ఇక్కడ రంగు రంగుల వెలుగులు ప్రసరిస్తున్నై. లోపలి పాట దగ్గరవుతూ వుంది.)

పాట :

విసరకురా, మదనా !
విరితూపులు పదనా ?
శివునే కదిలించని ఈ లవములు
శ్రీ శుకునేమిటి చేయునురా ?

(పాడుకొంటూ, దాని కనుగుణంగా ఆడుకొంటూ, రంభ ప్రవేశిస్తుంది. అతి లోకమోహన సౌందర్యవతి. శ్రీశుకుడు ఆమెకేసి చూస్తూనే చూడడు.)

అందం తెలియని, డెందము కలుగని,
అచల రూపు లీ మునులు !
అంద చందములు అస్పృశ్యములని
అవమానించే ఘనులు !

విసరకురా ! మదనా !
విరితూపులు పదనా ?

జనకుని ద్వారా జన్మించిన యతి
జనకుడగుట కేలనో వెనుదీయును !
కామ మోహములు కానివైనచో,
ఏమి మిగులు నీ సృష్టి లోన ?
విసరకురా ! మదనా !
విరితూపులు పదనా ?
శుకవాహనా ! నీ శోధన వీడి
సుభగుడవై శ్రీ శుకుని గొల్వరా !
విసరకురా ! మదనా !
విరితూపులు మరి పదనా ?

*(రంభ నృత్యం చేసి చేసి, అలసి పోతుంది. శ్రీశుకుడు అలానే చిరునవ్వుతో చూస్తూ వుంటాడు. రంభ అతడి ముందు మోకరిల్లుతుంది.)*

శ్రీశుకుడు : ఓహో ! చతుర్వేదాల పంచమ నృత్యం ! ఆగావేం ? ఆడు! నీవు ఆగితే ప్రకృతే ఆగిపోదా ? లే ! ఆడు !

రంభ : (లేచి, దీనంగా అతడికేసి చూచి, మళ్ళీ ఆడసాగింది.)

జాలి లే దేలరా ?
బాలేందు శేఖరా !
నీ కొరకు కాకున్న
నా కేల ఈ హేల ?
మరుని గెలిచితి నన్న
మాట నిజమే కాని,
మరు దనగ నెవడు ? నీ
దరహాస మాత్రుడే !

నీ నివాళికె పనికి
రాని ఈ కామనలు
సృష్టించగా నేల ?
చిన్న బుచ్చగ నేల ?

*(ఆగి, పైట జారగా, కుచ్చెళ్ళు చెదరగా, వయ్యారంగా అతని దగ్గరగా చేరి, సమస్త మోహ శక్తులను కన్నులలోకి కూడ దీసుకొని అతని వంక చూస్తుంది. అతడు శూన్యం లోకి చూస్తున్నాడు.)*

**శ్రీశుకుడు** : అయిందా ? అంతేనా ?

**రంభ** : (నిట్టూర్చి) అయింది. అంతే

**శ్రీశుకుడు** : (జాలిగా) పాపం !

**రంభ** : (లీలగా) ఏం ?

**శ్రీశుకుడు** : నిరంతరంగా ఆడలేవు. నిర్విరామంగా పాడలేవు. నిత్యానంద సుందరం కాలేవు.

**రంభ** : (అతని కళ్ళలోకి చూస్తూ) అలా చూస్తారేం ? నేను కనిపించడం లేదా?

**శ్రీశుకుడు** : లేదు.

**రంభ** : (అతణ్ని కౌగలించుకొని) నా స్పర్శ సుఖంగా లేదా ?

**శ్రీశుకుడు** : నీవే లేనప్పుడు నీ స్పర్శ ఎక్కడిది ?

**రంభ** : (ఆత్రంగా) నేనే లేనా ? మరి - నన్ను ఇంకా ఇంకా ఆడమన్నారే! పాడమన్నారే ! పోనీ, మళ్ళీ నృత్యం చేస్తాను. నేను ఆడుతూ, పాడుతూ వున్నంతసేపూ మీరు నన్ను చూస్తూ వున్నారు !

శ్రీశుకుడు : ఎంతసేపు అలా చెయ్యగలవు ?

రంభ : ఎంతసేపైనా చేస్తాను. మీరు మెచ్చే వరకు చేస్తాను.

శ్రీశుకుడు : ఇప్పుడు మెచ్చలేదా ?

రంభ : మెచ్చి కౌగిట గుచ్చే వరకు చేస్తాను.

శ్రీశుకుడు : ఇప్పుడు గుచ్చలేదా ?

రంభ : (ఆశ్చర్యంతో) ఎప్పుడు ?

శ్రీశుకుడు : నీవు ఆడుతూ, పాడుతూ వున్నప్పుడు

రంభ : (పారవశ్యంతో) అవును ! అవును ఇప్పుడు మళ్ళీ చేస్తాను.

శ్రీశుకుడు : చెయ్యలేవు.

రంభ : (నిట్టూర్చి) చెయ్యలేనా ? నిజమే ! చెయ్యలేను.

శ్రీశుకుడు : ఏం ?

రంభ : (దీనంగా) నృత్యం నాకు లక్ష్యం కాదు. ఒక సాధనం మాత్రం మీరు దాన్ని లక్ష్యంగా చూస్తున్నారు. మీ దృష్టిని శాశ్వతంగా నాపై నిల్పుకోవాలంటే - నేను నిర్విరామంగా నృత్యం చేస్తూనే వుండాలి !

శ్రీశుకుడు : చెయ్యలేవు.

రంభ : చేస్తాను

(రంగంలో ఒక మెరుపు మెరిసింది. అది ఆమె నిర్ణయ ప్రతి ఫలనం. శ్రీశుకుడు ఆమెకేసి చూశాడు.)

రంభ : (ఉత్సాహంతో) చేస్తాను, మీ కోసం మీ దృష్టిని శాశ్వతంగా నా సౌందర్యంపై నిల్పడం కోసం తద్వారా నేనే మీరు కావడం కోసం నేను నిరంతరంగా నృత్యం చేస్తాను !

శ్రీశుకుడు : (మళ్లీ యథాప్రకారం శూన్యంలోకి చూస్తూ) సాధ్యం కాదు. రంభా ! శాశ్వత సౌందర్యంలో నీవొక తరంగం మాత్రం. నీకు నిరంతరత లేదు.

రంభ : (దృఢంగా) కావచ్చు. ఆ ఒక్క తరంగమూ మీ అనంతత్వంలో కలిసిపోయే దాకా నృత్యం చేస్తాను. ఇంత వరకు నేనే అనంతత్వాన్ని. నా సౌందర్యాన్ని అనుభవించిన వాళ్ళంతా నాలో చిన్న చిన్న తరంగాలు. ఇప్పుడు నీవు అనంతత్వమై సాక్షాత్కరించి, నన్నొక తరంగాన్ని చేశావు ! ఈ రసోదయం కోసమే, ఈ బ్రహ్మానుభూతి కోసమే ఇంతకాలమూ నేను కళాతపస్సు చేశాను ! నా విధి నేను ఆనంద మివ్వడమే అయినా, నేను తరించేది నాకు ఆనందం కలగడం ద్వారా. ఇంత వరకు నేను విశ్వానికే ఆనంద లక్ష్యాన్ని నాకు మాత్రం ఒక లక్ష్యం లేదు. అట్టి లక్ష్యం ఇప్పుడు నీలో లభించింది. నా అదృష్టం నన్ను నీ పాదాల వద్దకు తెచ్చింది. నా సమస్త ప్రాణశక్తినీ కేంద్రీకరించి నీ కోసం నాట్యం చేస్తాను.

శ్రీశుకుడు : ధన్యురాలవు, రంభా ! విశ్వప్రేయసిగా లోకం ఊర్వశిని ఆరాధిస్తున్నది. ఊర్వశికి మాత్రం ఆరాధించ దగిన ఒక ప్రియుడంటూ లభించలేదు. నిజంగా నీవు ధన్యురాలవు !

రంభ : (అతని పాదాలు తాకి) ప్రభూ, చాలు ! నేను నిజంగా ధన్యురాలను.

శ్రీశుకుడు : నేను శూన్యాన్ని తప్ప, మరిదేన్ని చూడను. నేను పుట్టినప్పుడు నా తల్లి ఘృతాచిని ఒక్క క్షణం పాటు చూశాను. ఆమె నాన్నలో కలిసి పోయినప్పుడు రెండు క్షణాలపాటు నాన్నను చూశాను. జనక బృహస్పతులు ప్రతిమల్లా, పరీక్షిత్తు నీడలా మాత్రం కనిపించారు. ఈ అనంత కోటి చేతనా చేతన స్త్రీ పురుష ప్రకృతిలో – నేను రెండు మూడు క్షణాల పాటైనా స్పష్టంగా చూడగలిగింది నిన్నే !

రంభ : (ఆనందంతో) ప్రియా ! నీవు శూన్య మంటున్నది - నీవు నిరంతరం చూస్తున్నది - నీవు నిర్విరామంగా రమిస్తున్నది - వట్టి శూన్యమేనా ? సత్యం శివం సుందరం అయిన అమృత పదార్థం అదే కదా ? దాని ఒక్క తరంగమే కదా నేను ? అట్టి నేను - తిరిగి అసలు నేనై - నీ ఆత్మాలింగనంలో పరమాత్మ నేల కాలేను ?

శ్రీశుకుడు : కాగలవు, ప్రియా ! కాగలవు. నీటి నురుగు తనను తనలోకి ఎలా ఉపసంహరించుకొని మహా సాగర మవుతుందో, అలా - నీ సమస్తాన్నీ నీలోకి ఉపసంహరించుకొని నీవు శాశ్వతా నంద పరబ్రహ్మ ఎందుకు కాలేవు?

రంభ : (నిమీలిత నేత్ర అయి) ఏమో - అదంతా నాకు తెలియదు. నాకు తెలిసిందొక్క నీవే ! నాకు కనిపిస్తున్న దొక్క నీవే ! నేను అయిపోతున్న దొక్క నీవే -

(జిగేలుమంటూ నృత్యం చేయసాగిం దామె. నృత్యం క్రమంగా తాండవంగా మారింది. తాండవ వేగం హెచ్చే కొలదీ దుస్తులు పోయాయి. అలంకారాలు పోయాయి. రూపం పోయింది. శరీరం పోయింది. ఛాయ కూడ పోయింది. రంగం ఎర్రటి ధూపకాంతితో నిండి పోయింది. రంగం లోని ధూపం కొంత వెలిచేటప్పటికి శ్రీశుకుడు ఇతోధిక తేజస్సుతో ప్రకాశిస్తున్నాడు. పారవశ్యంలో మునిగి వున్నాడు.)

శ్రీశుకుడు : (తేరుకుంటూ) ఓహో ! దివ్యానుభూతి ! (పిలుస్తూ) రంభా ! (నాలుగు దిక్కుల నుంచి ఒకేసారిగా ఒక పలుకు వినిపిస్తుంది.)

పలుకు : ఓ !

శ్రీశుకుడు : రంభా ! ప్రియా !

పలుకు : ఓ ! ప్రియా !

శ్రీశుకుడు : (ఉద్వేగంతో) ప్రియా ! రంభా ! ఎక్కడ ?

పలుకు : ఇక్కడే, ప్రియా ! ఇక్కడే ! నీ బైట ! నీ లోపల ! సర్వత్రా !

శ్రీశుకుడు : అవునా ?

పలుకు : అవును ! ఇప్పుడు నీవు నేనే ! నేనే నీవు !

శ్రీశుకుడు : మరి – నేనిక్కడే వున్నానే !

పలుకు : నీవు అక్కడే లేవు. ఎక్కడా లేవు ! సర్వత్రా వున్నావు ! ఈ సమస్త విశ్వమూ నీవే ! అలా అనుకో ! అనుకొన్న తక్షణం నీవే నేను ! నేనే నీవు !

శ్రీశుకుడు : అవును ! అవును ! ఓహో ! అపూర్వ దివ్య సౌందర్యం ! నేను చూస్తున్న శూన్యం నీవేనా ! ఇదేనా మా నాన్నను నేను కోరుతున్న బ్రహ్మ రహస్యం ? ఆ రహస్యం వట్టి నీవేనా ?

పలుకు : నేనే ! నేనే ! వచ్చెయ్ ! నీవు కూడ వచ్చెయ్ !

శ్రీశుకుడు : వచ్చేస్తున్నా ! వచ్చేస్తున్నా ! ఈ సమస్త జీవ పరిమితుల్ని దాటి వచ్చేస్తున్నా ! (వేగంగా ముందుకు వెళ్ళబోయి, ఆగి) ఎవరు నీవు ?

లోపలి నుంచి : పృథ్విని !

శుకుడు : తొలగు ! (ముందుకు దూకి) నీవెవరు ?

లోపలి నుంచి : అప్పుని !

శ్రీశుకుడు : తొలగు ! (ముందుకు ఈది) ఎవరది?

లోపలి నుంచి : అగ్నిని !

శ్రీశుకుడు : తొలగు ! (ముందుకు గెంతి) నీవు ?

లోపలి నుంచి : వాయువును !

శ్రీశుకుడు : తొలగు ! (ముందుకు ప్రసరించి) మరి నీవు?

లోపలి నుంచి : ఆకాశాన్ని !

శ్రీశుకుడు : తొలగు ! (ఛాయా మాత్రుడై) ఏమీ కనిపించ లేదు ! ఇక ఇక్కడ ఎవరూ లేరా ?

లోపలి నుంచి : నేను లేనా ?

శ్రీశుకుడు : ఎవరు నీవు?

లోపలి నుంచి : మనస్సును !

శ్రీశుకుడు : (నవ్వి) ఏనుగు లాంటి దానవు ! పీనుగులా ఇలా వున్నావేం ?

లోపలి నుంచి : ఏం చెయ్యను? పాంచ భౌతికమాయా ప్రాకారాలు దాటి వచ్చిన నీముందు నేను లేని దాననే !

*(తెర తొలగినట్టయి, మబ్బు విడి పోయిన మధ్యందిన సూర్యతేజంలా ఒక మహాకాంతి రంగంలో జిగేలు మంటుంది.)*

శ్రీశుకుడు : ఓహో, పరమ సౌందర్య శోభా పారమ్యం ! ఎవరు నీవు ?

పలుకు : నేనే ! వచ్చెయ్ !

శ్రీశుకుడు : (ఆనందంతో) ఇదిగో, వచ్చేశాను !

పలుకు : వచ్చెయ్ ! వచ్చెయ్ !

శ్రీశుకుడు : మరి - మా నాన్న ?

పలుకు : మనమే ! మీ నాన్న కూడ మనమే !

మరేం బెంగ లేదు వచ్చెయ్ !

శ్రీశుకుడు : ఇదిగో, వచ్చేస్తున్నా ! (అగ్నిలా జ్వలించి, వాయువులా కరిగిపోతాడు. రంగం ధూపబంధురమై రంగురంగుల కాంతులతో భాసిస్తుంది. రంగంలో స్పష్టత ఏర్పడేటప్పటికి అక్కడ ఎవరూ లేరు. శ్రీశుకుడు ప్రకృతిలో లీనమై పోయాడు.)

వ్యాసుడు : (ఆత్రంగా రంగంలోకి ప్రవేశిస్తూ) శ్రీశుకా !

పలుకు : (అన్ని వైపుల నుంచి) ఓ !

వ్యాసుడు : (మళ్ళీ) శ్రీశుకా !

పలుకు : ఓ !

వ్యాసుడు : (కోపంగా) ఎవరు మీరు ?

పలుకు : నీ చుట్టూ వున్న, నీవై వున్న పంచభూతాలం !

వ్యాసుడు : (తీవ్రంగా) పంచభూతాల కంటె అతీతుణ్ని నేను ! శ్రీశుకా! శ్రీశుకా!

పలుకు : ఓ ! ఓ !

వ్యాసుడు : ఎవరు నీవు ?

పలుకు : రంభను !

వ్యాసుడు : రంభవా?

పలుకు : అవును, రంభనే ! నేను అతణ్ని నాలో ఇముడ్చుకోలేక, నేనే అతడిలో ఇమిడి పోయిన ధన్యురాలను ! ప్రియురాలను! ప్రకృతిని !

వ్యాసుడు : అన్యాయం ! (పిలుస్తూ) శ్రీశుకా ! కుమారా !

పలుకు : ఓ ! నాన్నా !

వ్యాసుడు : ఎవరు నీవు ?

పలుకు : నేనే !

వ్యాసుడు : నేనంటే ?

పలుకు : నీవే !

వ్యాసుడు : నీవా ! నేనా ! ఎక్కడ ? నీవెక్కడ ? నేనెక్కడ ? (చేతులు చాచి, ముందుకు పోతూ) ఎక్కడ ? శ్రీశుకా ! తండ్రీ ! ఎక్కడ నీ వెక్కడ ? (ముందుకు పరిక్రమిస్తాడు)

పలుకు : ఇక్కడే ! ఇక్కడే ! (పలుకు అతణ్ని ముందుకు ఆహ్వానిస్తుంది)

వ్యాసుడు : ఎక్కడ ? ఎక్కడ ?

పలుకు : ఇక్కడ ! ఇక్కడే !

(ఈ విధంగా, వ్యాసుడు శ్రీశుకుని అన్వేషించుకొంటూ, ముందుకు సాగిపోతున్నాడు. పంచభూత సమ్యగధి స్వరూపుడైన శ్రీశుకుడు వేదవ్యాసుణ్ని ముందుకు తీసుకు పోతూ వున్నాడు. ఇది తండ్రి కొడుకుల నిత్యానుగామి యాత్ర ! యాత్ర సాగుతూ వుండగా మెల్లగా తెర జారుతూ వుంటుంది. లోపలి నుంచి ఒక అమృత గీత వెల్లి విరిసి ప్రవహిస్తుంది.)

## అమృత గీతి

ఏక ఏవాగ్ని: బహుధా సమిద్ధ
ఏకం సూర్యోవిశ్వం అనుభూతః
ఏకై వోషా: సర్వం ఇదం విభాత్యేకం
వా ఇదం విబ భూవ సర్వం !

హిరణ్య గర్భః సమవర్త తాగ్రే
భూత స్వజాతః పతిరేక ఆసీత్
సదాధార పృథ్వీం ద్యాముతే మాం
కస్మైదేవాయ హవిషా విధేమ

సర్వభూతస్థ మాత్మానం
సర్వభూతాని చాత్మని
ఈక్షతే యోగ యుక్తాత్మా
సర్వత్ర సమదర్శనః

బ్రహ్మోణ్యాధాయ కర్మాణి
సంగం త్యక్త్వాకరోతియః
విప్యతేన సపాపేన
పద్మపత్ర మివాంభసా !

ఓం ఇత్యే కాక్షరం బ్రహ్మ
వ్యా హర న్మా మనుస్మరన్
యః ప్రియాతి త్యజన్ దేహం
స యాతి పరమాంగతిం !
కృష్ణం వందే జగద్గురుం !

***